www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 19-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 202 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 9.49 తదుపరి తదియ; నక్షత్రం: భరణి ఉ. 10.47 తదుపరి కృత్తిక వర్జ్యం: రా. 9.39-11.05; దుర్ముహూర్తం: ఉ. 6.12-7.45; అమృతఘడియలు: ఉ. 6.30-7.56; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 5.46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మియాపూర్‌లో చిరుత

మెట్రోస్టేషన్ సమీపంలో సంచారంతో కలకలం

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

మెట్రో వెనుక ఉన్న అటవీ ప్రాంతం నుంచి వచ్చినట్లు

అనుమానం.. చిరుత జాడ కోసం సీసీ కెమెరాలు 13



హైదరాబాద్‌లోని మియాపూర్ మెట్రో సమీపంలో చిరుత

స్కిల్స్ వర్సిటీకి
వంద కోట్లు

అదానీ ఫౌండేషన్ భారీ విరాళం

సీఎం రేవంత్‌కు చెక్కు ఇచ్చిన గౌతమ్ అదానీ

వర్సిటీకి తమ సహకారం ఉంటుందని హామీ

వర్సిటీ ప్రకటించాక భారీ కార్పొరేట్ విరాళం ఇదే

500 కోట్ల కార్పస్ లక్ష్యంగా పెట్టుకున్న సర్కారు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి భారీ విరాళం అందింది. దానికి అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళాన్ని అందించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఈ మేరకు చెక్ అందించారు. ప్రభుత్వం నెలకొల్పనున్న స్కిల్స్ యూనివర్సిటీకి తమ గ్రూప్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. స్కిల్స్ వర్సిటీని ప్రకటించిన తర్వాత కార్పొరేట్ కంపెనీల నుంచి అందిన అతి పెద్ద విరాళం ఇదే. రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు పెంచాలన్న లక్ష్యంతో స్కిల్స్ వర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 150 ఎకరాల్లో ఏర్పాటు కానున్న వర్సిటీకి ఆగస్టు ఒకటో తేదీన శంకుస్థాపన చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను దీనికి ఛైర్మన్‌గా నియమించారు. వర్సిటీ నిర్వహణ పూర్తి బాధ్యతలను మీపైనే పెడుతున్నామని గత నెల 19న నిర్వహించిన వర్సిటీ తొలి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి.. ఆనంద్ మహీంద్రాను ఉద్దేశించి స్పష్టం చేశారు. రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. వర్సిటీకి భవిష్యత్తులోనూ

మిగతా 13వ పేజీలో...



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న గౌతమ్ అదానీ

దీపావళి లోపు కొత్త ఆర్వోఆర్ చట్టం

ముసాయిదా చట్టంపై సీఎం రేవంత్‌తో చర్చించిన మంత్రి పొంగులేటి

క్యాబినెట్ భేటీలోనూ చర్చకు అవకాశం

ఆర్డినెన్స్ లేదా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల ద్వారా చట్టం అమలులోకి! 13

భూమాత కార్యాచరణ ప్రారంభం



కుమార్ మొలుగారం



అల్దాస్ జానయ్య

9 వర్సిటీలకు ఉప కులపతులు

ఓయూకు ఆచార్య కుమార్ మొలుగారం..

కాకతీయకు ఆచార్య ప్రతాప్ రెడ్డి

వ్యవసాయ వర్సిటీకి అల్దాస్ జానయ్య

తెలుగు వర్సిటీకి నిత్యానందరావు..

'తెలంగాణ'కు యాదగిరిరావు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను ప్రభుత్వం నియమించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆచార్య కుమార్ మొలుగారం, కాకతీయకు ఆచార్య ప్రతాప్ రెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయానికి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, శాతవాహనకు ఆచార్య ఉమేశ్ కుమార్, తెలుగు విశ్వవిద్యాలయానికి ఆచార్య నిత్యానంద రావు, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి ఆచార్య అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఆచార్య యాదగిరి రావు, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య అల్దాస్ జానయ్య, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఆచార్య రాజిరెడ్డి వీసీలుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి జిష్ణుదేవ్ వర్మ నిర్ణయం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. గత ఉప కులపతుల పదవీకాలం గత మే నెల 21న పూర్తయ్యాక.. తాత్కాలిక వీసీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించిన ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో...

మెయిన్స్‌కు ఓకే

గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయాలన్న పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు

మూడోసారి రద్దయితే వ్యవస్థపై విశ్వాసం ఉండదు

పరీక్షలు జరుగుతాయనే నమ్మకం పోతుంది

అన్నీ పరిశీలించే నిపుణుల కమిటీ 'కీ' తయారీ

విస్తృతంగా చర్చించిన తర్వాతే సింగిల్ జడ్జి తీర్పు

దానిలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు

ఎస్టీ రిజర్వేషన్ పెంచినా పోస్టులూ పెరిగాయి కదా

హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టీకరణ

గ్రూప్-1 వాయిదా కోరుతూ సుప్రీంలో పిటిషన్



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు ఊరట. మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఉన్న అడ్డంకులను హైకోర్టు తొలగించింది. ప్రిలిమ్స్ (ప్రాథమిక పరీక్ష)ను రద్దు చేయాలని, ఫైనల్ కీలో తప్పులున్నాయని, రీ నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదని, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు చెల్లదంటూ వివిధ కారణాలతో దాఖలైన పలు అప్పీల్ పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. ఈ సందర్భంగా.. 'మెయిన్స్ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 90 శాతం మంది

మిగతా 13వ పేజీలో...

గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసుల లాఠీఛార్జ్

కేసుల పరిష్కారం తర్వాత పరీక్ష నిర్వహించాలనే డిమాండ్‌తో అభ్యర్థుల ర్యాలీ

చెదరగొట్టిన పోలీసులు.. అనంతరం బీజేవైఎం నేతృత్వంలో మళ్లీ ర్యాలీ 13



హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

5 డీఏల్లో ఒక్కటీ ఇవ్వలేదు



మీడియాతో మాట్లాడుతున్న జేఏసీ ఛైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

సీపీఎస్ రద్దుపై చర్యలు తీసుకోలేదు

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలనూ నెరవేర్చలేదు

అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా మా సమస్యలను పట్టించుకోవడం లేదు

21లోపు తేల్చకపోతే 22న కార్యాచరణ

ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ అల్టిమేటం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. పది నెలల నుంచి ప్రభుత్వ సలహాదారులు, సీఎంవో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చుట్టూ తిరుగుతున్నా.. తమ డిమాండ్లపై ఎలాంటి స్పందన లేదని తెలిపింది. కనీసం ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడే పరిస్థితి కూడా లేదా? అని ప్రశ్నించింది. ఈ మేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ శుక్రవారం ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తమ డిమాండ్లతో కూడిన లేఖలను జేఏసీ ఛైర్మన్ మారెం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అందజేశారు. ఈ నెల 21 లోపు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే 22న ఉద్యమ కార్యాచరణ

మిగతా 13వ పేజీలో...

25 వేల కోట్లు చాలు!

మూసీ ప్రక్షాళనకు లక్షన్నర కోట్లు ఎందుకు?

బ్యూటిఫికేషన్‌కు మేం వ్యతిరేకం కాదు

లూటిఫికేషన్‌నే తప్పుబడుతున్నాం

ప్రక్షాళన మొదలుపెట్టింది మేమే

వండి పెట్టినం.. వడ్డించడమే రేవంత్ పని

మూసీపై కేటీఆర్ కౌంటర్ ప్రజెంటేషన్

అబద్ధాలే ఆశ్చర్యపోయేలా ముఖ్యమంత్రి రేవంత్ మాటలు

మూసీ రివర్ ఫ్రంట్‌లో దాగి ఉన్న స్టంట్ ఏంటి?

పునరుజ్జీవం పేరిట రియల్ దందా.. ఒప్పుకోం

10 వేల కుటుంబాలకు మేలు జరుగుతుందంటే మూసీ వద్ద 4 నెలలైనా ఉంటా: హరీశ్‌రావు



మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ కౌంటర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూసీ బ్యూటిఫికేషన్‌కు గానీ, ప్రక్షాళనకు గానీ, పునరుజ్జీవానికి గానీ తాము వ్యతిరేకం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూసీ పేరుతో చేస్తున్న లూటిఫికేషన్‌నే తప్పుబడుతున్నామని చెప్పారు. కేవలం

మిగతా 9వ పేజీలో...

మూసీ పునరుజ్జీవం పేరిట భారీ విధ్వంసం 9

పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వం: బీజేపీ

23, 24 ల్లో మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించనున్న పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

27న పార్టీ జాతీయ నాయకత్వానికి నివేదిక

సుందరీకరణకు వ్యతిరేకం కాదు: కిషన్‌రెడ్డి



రేవంత్‌ను దించేందుకు మంత్రుల కుట్ర

ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత ఇంకా పెరగాలని వారు చూస్తున్నారు

ఆ తర్వాత కుర్చీ నుంచి దించేస్తారు

గ్రూప్-1, హైడ్రా, మూసీలపై జాగ్రత్త పడకపోతే రేవంత్‌కు చిక్కులు తప్పవు

గ్రూప్-1 మెయిన్స్‌ను రీషెడ్యూల్ చేయాలి: బండి సంజయ్ 13

బాల్యవివాహం సామాజిక దురాచారం

వ్యక్తిగత చట్టాలు.. బాల్యవివాహ నిరోధక చట్టాన్ని అడ్డుకోజాలవు

సుప్రీంస్పష్టీకరణ.. మార్గదర్శకాల జారీ

చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులు, పోలీసు విభాగం

మూడు నెలలకోమారు సర్వే 2



మంచింగ్.. కుళ్లిన చికెన్!

బేగంపేటలోని ఓ చికెన్ సెంటర్‌లో 700 కిలోల కుళ్లిన చికెన్ స్వాధీనం

ఫ్రిజ్‌లో నిల్వ.. బార్లు, కల్లు కాంపౌండ్లు, పర్మిట్‌రూంలకు సరఫరా 3

భారత్‌లో 23.4 కోట్ల పేదలు

ప్రపంచంలోనే అత్యధికం.. అన్ని దేశాల్లో కలిపి పేదలు 110 కోట్లు

ఐరాస తాజా నివేదికలో వెల్లడి 2

ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్

న్యూఢిల్లీ, అక్టోబరు 18: నగదు అక్రమ చలామణి కేసులో ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నాయకుడు సత్యేందర్ జైన్‌కు శుక్రవారం రౌజ్ అవెన్యూలోని ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ ఇంకా ప్రారంభం కాక పోవడం, సుదీర్ఘ కాలం పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండడంతో బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే తెలిపారు. ఆదాయానికి మించి రూ.1.47 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నారంటూ సీబీఐ 2017లో కేసు నమోదు చేసింది. నాలుగు డొల్ల కంపెనీల పేరుతో మనీలాండరింగ్ పాల్పడ్డారంటూ అనంతరం ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఆ కంపెనీలకు చెందిన రూ.4.81 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. 2022 మే 30న అరెస్టు చేసింది. మధ్యలో అనారోగ్య కారణాల దృష్ట్యా మెడికల్ బెయిల్‌పై విడుదలయ్యారు. మొత్తంగా 18 నెలల పాటు జైలులో గడపడంతో ప్రస్తుతం పలు షరతులతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

మరోసారి రష్యా పర్యటనకు మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18: ప్రధాని మోదీ మరోసారి రష్యా పర్యటనకు వెళ్లనున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు కజన్‌లో జరగనున్న 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఈనెల 22, 23 తేదీల్లో మోదీ అక్కడ పర్యటించనున్నారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారని తెలిపింది. కాగా, ఈ ఏడాది మోదీ రష్యా పర్యటనకు వెళ్లడం ఇది రెండోసారి. ఈ ఏడాది జూలైలో ఆయన రష్యాలో పర్యటించారు.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై తీర్మానం

శ్రీనగర్, అక్టోబరు 18: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో తీర్మానం ఆమోదించారు. ఒకటి రెండు రోజుల్లో సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీకి వెళ్లి ఈ తీర్మానం ముసాయిదాను ప్రధాని మోదీకి అందజేస్తారు. మరోవైపు ఈ తీర్మానం ఆర్టికల్ 370 రద్దును ధ్రువీకరించడమేనని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధి వహీదా పారా అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామంటూ ఓట్లు దండుకుని ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ కూడా ఒమర్ తీర్మానంపై విమర్శలు ఎక్కుపెట్టింది. తీర్మానాన్ని రాజకీయ స్టంట్‌గా అభివర్ణించింది. సరైన సమయంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పిస్తామని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారని బీజేపీ అధికార ప్రతినిధి సునీల్ సేథీ గుర్తు చేశారు.

వ్యాయామ విద్య పేరుతో పీఎఫ్ఐ ఆయుధ శిక్షణ

- అంతర్యుద్ధం వచ్చేలా అశాంతి సృష్టే దాని లక్ష్యం: ఈడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18: దేశంలో అంతర్యుద్ధం సృష్టించేందుకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) పనిచేస్తున్నట్టు ఈడీ ఆరోపించింది. ఇందుకోసం వ్యాయామ విద్య పేరుతో ఆయుధ శిక్షణ ఇస్తోందని తెలిపింది. సమాజంలో అశాంతి నెలకొనేలా చేసేందుకు తరగతులు నిర్వహిస్తోందని పేర్కొంది. దర్యాప్తులో భాగంగా ట్రస్టులు, కంపెనీలు, వ్యక్తుల పేరున ఆ సంస్థకు ఉన్న రూ.56.56 కోట్లు విలువ చేసే 35 స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం తెలిపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అక్టోబరులో రూ.35.43 కోట్లు విలువ చేసే 19 ఆస్తులు, ఏప్రిల్‌లో రూ.23.13 కోట్లు విలువ చేసే 16 ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించింది. పీఎఫ్ఐకి గల్ఫ్ దేశాలు, సింగపూర్‌లో 13వేలకుపైగా సభ్యులు ఉన్నట్టు ఈడీ తెలిపింది.

అమెరికా ఈబీ-1 వీసా నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: గత వారం యూఎస్ సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈబీ-1 వీసా కేటగిరి నిబంధనల్లో మార్పులు చేసింది. అవి తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. సైన్స్, ఆర్ట్స్, విద్య, వ్యాపారం, ఆటల్లో 'అసాధారణ సామర్థ్యాన్ని' నిరూపించుకోవాలన్న దరఖాస్తుదారుని బాధ్యతను సరళతరం చేసింది. వీసా అర్హతగా నమోదయిన టీమ్ విజయాలను సాక్ష్యంగా చూపించినా సరిపోతుందంటూ వివరణ ఇచ్చింది. దీనివల్ల భారతీయులు ఎక్కువగా లబ్ధి పొందే అవకాశం ఉంది. వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించిన వారు ఈబీ-1(ఎక్స్‌ట్రార్డినరీ ఎబిలిటీ పర్మినెంట్ రెసిడెన్స్ వీసా) వీసాకు అర్హులు. వీరు శాశ్వతంగా అమెరికాలో నివసించవచ్చు, పనిచేయవచ్చు. ఈ వీసాను పొందిన వారి జీవిత భాగస్వామి, పిల్లలు కూడా గ్రీన్‌కార్డు దరఖాస్తుకు అర్హులు అవుతారు. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ లెక్కల ప్రకారం 2023 నవంబరు నాటికి 1.4 లక్షల మది ఈబీ-1 గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త రూల్స్ ప్రకారం అసాధారణ సామర్థ్యాలను నిరూపించుకోవడానికి తగిన ఆధారాలు ఉన్న వ్యక్తులు ఎవరైనా స్వయంగా ఈబీ-1ఏ వీసా గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులైన భారతీయులకు యూఏఈ వీసా-ఆన్-అరైవల్

న్యూఢిల్లీ, అక్టోబరు 18: భారతీయ ప్రయాణికుల కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వీసా-ఆన్-అరైవల్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. పర్యాటకులు, వ్యాపారవేత్తలు, ప్రవాసులను ఆకర్షించడంతో పాటు యూఏఈకి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అర్హులైన భారత పౌరులకు 14 రోజుల వ్యవధితో కూడిన వీసా-ఆన్-అరైవల్ సదుపాయాన్ని యూఏఈ కల్పిస్తోందని అక్కడి భారత రాయబార కార్యాలయం గురువారం ప్రకటించింది. ప్రయాణికులు కనీసం 6నెలల పాటు చెల్లుబాటయ్యే పాస్‌పోర్టును కలిగి ఉండటంతో పాటు అమెరికా జారీ చేసిన గ్రీన్‌కార్డు/ వీసా, యూరోపియన్ యూనియన్, యూకే దేశాలు మంజూరు చేసిన చెల్లుబాటయ్యే శాశ్వత నివాస పత్రం/ వీసా ఉన్నవారు అర్హులని వివరించింది. వీరికి తొలుత 14 రోజుల గడువున్న వీసా మంజూరు చేస్తారు. తర్వాత తగిన రుసుము చెల్లించి దీన్ని 60 రోజులు పొడిగించుకొనే అవకాశం ఉంది.

రూ.5 కోట్లు చెల్లించాలని సల్మాన్‌కు హెచ్చరిక

ముంబై, అక్టోబరు 18: హీరో సల్మాన్ ఖాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ మరో బెదిరింపు మెసేజ్ పంపించింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌తో వైరం వద్దనుకుంటే రూ.5 కోట్లు చెల్లించాలని, లేకుంటే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించింది. ఈ మేరకు ముంబయి ట్రాఫిక్ పోలీసులకు వాట్సాప్ మెసేజ్ అందింది. "దీన్ని తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా, లారెన్స్ బిష్ణోయ్‌తో శత్రుత్వాన్ని ముగించాలన్నా తప్పకుండా రూ.5 కోట్లు చెల్లించాలి. ఒకవేళ డబ్బు ఇవ్వకపోతే ఇటీవలే హత్యకు గురయిన బాబా సిద్దిఖీకన్నా దారుణమైన పరిస్థితిని ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఆ మెసేజ్‌లో పేర్కొంది. ఇది ఎక్కడ నుంచి వచ్చిందన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాంద్రాలోని సల్మాన్ నివాసం వద్ద భద్రతను పెంచారు. సల్మాన్‌కు గతంలోనూ ఇలాంటి బెదిరింపులు వచ్చాయి.

లెబనాన్‌కు భారత్ మానవతా సాయం

- 33 టన్నుల అత్యవసర మందుల సరఫరా

న్యూఢిల్లీ, అక్టోబరు 18 : ఇజ్రాయెల్-హెజ్బొల్లాల మధ్య దాడులతో సతమతమవుతోన్న లెబనాన్ ప్రజలకు భారత్ మానవతా సాయం అందించింది. ఆ దేశానికి 33 టన్నుల అత్యవసర మందులను అందించేందుకు నిర్ణయించింది. ఈమేరకు శుక్రవారం 11 టన్నుల మందులను పంపినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రాణాలను కాపాడే అత్యవసర ఔషధాలు ఇందులో ఉన్నాయి. హృద్రోగాలకు సంబంధించిన మందులు, యాంటీబయోటిక్స్, అనెస్తటిక్స్, యాంటి ఇన్‌ఫ్లమేటరీ మందులను ఆ దేశానికి పంపారు. మరిన్ని ఔషధాలను కూడా పంపనున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆ దేశానికి అత్యవసర మందుల కొరతను ఇవి కొంతమేర తీర్చుతాయని అంచనా. మరికొన్ని వారాల్లో మిగిలిన మందులను పంపనున్నట్లు తెలిపింది.

606 పోస్టల్ పార్సిళ్లలో రూ.21 కోట్ల డ్రగ్స్

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చామరాజపేట ఫారిన్ పోస్టాఫీస్‌కు వివిధ దేశాల నుంచి వచ్చిన 606 పార్సిల్స్‌లో రూ.21 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నెలలకాలంగా ఈ పార్సిల్స్ డెలివరీ కాలేదు. అమెరికా, బ్రిటన్‌తోపాటు ఆఫ్రికా దేశాలనుంచి ఈ డ్రగ్స్ వచ్చాయి. కొన్నేళ్ల నుంచి విదేశీ పార్సిల్స్‌పై సీసీబీ నార్కోటిక్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో పార్సిల్స్ తీసుకునేందుకు వస్తే పట్టుబడతామని భావించి.. విలువైన డ్రగ్స్‌ను పెడ్లర్‌లు వదులుకున్నారు. యూఎస్, యూకే, బెల్జియం, థాయ్‌ల్యాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాలనుంచి వచ్చిన డ్రగ్స్‌ను డాగ్‌స్క్వాడ్ సాయంతో తనిఖీ చేశామని సీపీ దయానంద్ తెలిపారు. పార్సిల్స్ అడ్రెస్‌లు తప్పుగా ఉన్నట్లు గుర్తించామని అన్నారు.

బాల్యవివాహం

సామాజిక దురాచారం



బాల్యవివాహ నిరోధక చట్టాన్ని వ్యక్తిగత చట్టాలు అడ్డుకోజాలవు

- సుప్రీం స్పష్టీకరణ..మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18: బాల్య వివాహం ఓ సామాజిక దురాచారమని, పర్సనల్ చట్టాలు, వాటిలోని సంప్రదాయాలు బాల్య వివాహ నిరోధక చట్టాన్ని అడ్డుకోజాలవని సుప్రీంకోర్టు పేర్కొంది. మైనర్‌గా ఉన్నప్పుడే వివాహం చేయటం వల్ల తనకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునే అవకాశం సదరు వ్యక్తులు కోల్పోతారని గుర్తు చేసింది. బాల్య వివాహ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ 'సేవ' అనే స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి 141 పేజీల తీర్పును వెలువరించింది. బాల్య వివాహాల నిరోధానికి తొమ్మిది శీర్షికల కింద పలు మార్గదర్శకాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలకు ఈ తీర్పులో సుప్రీంకోర్టు జారీ చేసింది. బాల్య వివాహ నిరోధక చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కొందరు అధికారులను నియమించాలని, వారికి ఇతర బాధ్యతలేవీ అప్పగించకూడదని ఈ మార్గదర్శకాల్లో సుప్రీంకోర్టు తెలిపింది. చట్టం అమలు తీరుపై మూడునెలలకోమారు సర్వే నిర్వహించాలని నిర్దేశించింది. జిల్లా స్థాయిలో బాల్యవివాహాలను నిరోధించే బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు తీసుకోవాలని పేర్కొంది. అంతేగాక, ఒక ప్రత్యేక పోలీసు విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బాల్య వివాహ ఘటనలపై న్యాయమూర్తులు కూడా సుమోటోగా తీసుకొని ఆదేశాలు జారీ చేయాలని తెలిపింది. బాల్యవివాహాలను అడ్డుకోవటంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వ అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. 'బాల్యదశ అంటేనే చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోలేదని అర్థం. వివాహం అనేది ఒక చట్టబద్ధమైన వ్యవస్థ. వివాహం పరిధిలోకి ప్రవేశించే వ్యక్తుల బాధ్యతలను బాలబాలికలు అర్థం చేసుకోలేరు' అని ధర్మాసనం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది.

పలు కారణాలు

బాల్యవివాహాలను లింగం, కులం, సామాజిక ఆర్థిక పరిస్థితి, ప్రాంతం వంటివి ప్రభావితం చేస్తున్నాయని.. పేదరికం, అసమానతలు, నిరక్షరాస్యత వంటివి మూల కారణాలుగా నిలుస్తున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో, బాల్యవివాహాల నిరోధానికి ఒకే రకమైన విధానాలను పాటించకుండా, వేర్వేరు సమూహాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించింది. సమాజంలోని భిన్న భాగస్వామ్యపక్షాలను సమన్వయం చేసుకుంటూ సమష్టిగా చర్యలు తీసుకుంటేనే బాల్యవివాహ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయటం వీలవుతుందని పేర్కొంది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచటం, బాల్య వివాహాలు జరుగుతుంటే వాటిని అడ్డుకోవటానికి వీలుగా పోలీసు తదితర దర్యాప్తు సంస్థలకు వెంటనే సమాచారం అందించే వ్యవస్థలను ఏర్పాటు చేయటం, పోలీసులకు శిక్షణనివ్వటం తదితర చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. బాల్యవివాహాలు జరిపించిన వ్యక్తులు, కుటుంబాలపై నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం అవసరమేగానీ.. వాటికన్నా బాల్యవివాహాలను నిరోధించటం, బాలలను సంరక్షించటానికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దర్యాప్తు సంస్థలకు సూచించింది. సదరు చట్టం, అది విధించే శిక్షలపైన కూడా ప్రజల్లో ప్రచారం చేయాలని తెలిపింది. కాగా.. బాల్య వివాహాలకు సంబంధించి కేంద్రం తన వైఖరిని వెల్లడిస్తూ.. పర్సనల్ చట్టాల కన్నా బాల్య వివాహ నిరోధక చట్టమే పైచేయిగా ఉండాలని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అంశానికి సంబంధించిన బిల్లు పార్లమెంటు పరిశీలనలో ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

కీలక విజయం

సుప్రీం తీర్పుపై 'సేవ'తోపాటు పలు స్వచ్ఛందసంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. బాల్యవివాహం అనే సామాజిక దురాచారంపై జరుగుతున్న యుద్ధంలో ఇది కీలక విజయమని పేర్కొన్నాయి. 2030 నాటికి దేశంలో బాల్యావివాహాలను పూర్తిగా అడ్డుకునే లక్ష్యంతో 200కిపైగా స్వచ్ఛందసంస్థలు 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' అనే ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి.

ఇకపై అన్ని బెంచ్‌ల విచారణలు ప్రత్యక్ష ప్రసారం

న్యూఢిల్లీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ సర్వోన్నత న్యాయస్థానం చరిత్రలో మరో అధ్యాయం మొదలు కాబోతుంది. ఇప్పటి వరకు రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణను మాత్రమే ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సుప్రీంకోర్టు ఇకపై అన్ని ధర్మాసనాల ముందు నిత్యం జరిగే కేసుల విచారణలను సయితం ప్రత్యక్ష ప్రసారం(లైవ్ స్ట్రీమింగ్) చేయాలని భావిస్తోంది. శుక్రవారం ప్రయోగాత్మకంగా అన్ని ధర్మాసనాల ఎదుట జరిగిన విచారణలను లైవ్ స్ట్రీమ్ చేసి పరిశీలించింది. వీటిని అధికారిక యూట్యూబ్ చానెల్‌లో కాకుండా కోర్టు కోసం ప్రత్యేకంగా రూపొందించిన సొంత అప్లికేషన్ అయిన బీటా వెర్షన్ యాప్ ద్వారా ప్రసారం చేసింది. లోటుపాట్లను సమీక్షించిన తరువాత పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానుంది. రాజ్యాంగ ధర్మాసనం విచారించే కేసులు అదీ ప్రాముఖ్యం ఉన్న వాటినే ప్రత్యక్ష ప్రసారం చేస్తుండగా దాన్ని మరింతగా విస్తరించాలని ప్రతిపాదించింది. పారదర్శకత ఉండాలన్న ఉద్దేశంతో 2018లో ఇచ్చిన కీలక తీర్పులో సుప్రీంకోర్టు లైవ్ స్ట్రీమింగ్‌కు అనుమతి ఇచ్చింది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ పదవీ విరమణ చేసిన రోజున ఆయన నేతృత్వంలోని ధర్మాసనం నిర్వహించిన కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.


బినామీ చట్టం రూల్స్‌పై తీర్పును తిరగదోడిన సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 18: బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టంలోని రెండు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమంటూ గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం తిరగదోడింది. కేంద్రం విజ్ఞప్తి మేరకు ఆ తీర్పుపై జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం సమీక్షకు అనుమతించింది. బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం-1988 సవరించని నిబంధనల్లోని సెక్షన్లు 3 (2), 5 రాజ్యాంగ విరుద్ధమని మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2022 ఆగస్టులో తీర్పునిచ్చింది. అయితే ఆ నిబంధనల చెల్లుబాటును కోర్టులో ఎవరూ సవాల్ చేయలేదని.. తీర్పును సమీక్షించాల్సిన అవసరముందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తాజాగా కోర్టు దృష్టికి తెచ్చారు.

డేరా బాబా కేసులపై స్టే తొలగింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 18: దైవ దూషణకు పాల్పడ్డారంటూ డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్‌పై నమోదైన కేసుల విచారణపై ఉన్న స్టేను ఎత్తివేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. గురుగ్రంథ్ సాహిబ్‌ను అవమానపరచడంతో పాటు, దైవదూషణకు పాల్పడ్డారంటూ ఆయనపై 2015లో మూడు కేసులు నమోదయ్యాయి. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా పంజాబ్‌లోని ఫరీద్‌కోట్, బెహబాల్ కలాన్‌ల్లో జరిగిన ప్రదర్శనలు హింసకు దారి తీయడంతో ఇద్దరు మరణించారు కూడా. ఈ కేసుల విచారణ జరగకుండా ఈ ఏడాది మార్చి నెలలో పంజాబ్-హరియాణా హైకోర్టు స్టే ఇచ్చింది. దీనిని ఎత్తివేయాలని కోరుతూ పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది.

లోకం తీరు



అదృశ్యమైన వారి కేసు మినహా మిగిలిన కేసుల విచారణ

- ఈశా యోగా కేంద్రం వ్యవహారంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఉన్న ఈశా యోగా కేంద్రం వ్యవహారంలో ఇద్దరు మహిళలు అదృశ్యమైన కేసును మూసివేసిన సుప్రీంకోర్టు.. మిగిలిన ఫిర్యాదులపై పోలీసులు విచారణ చేపట్టవచ్చని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. తన ఇద్దరు కుమార్తెలను ఈశా కేంద్రంలో నిర్బంధించారంటూ మాజీ ప్రొఫెసర్ ఎస్.కామరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ ఈషా కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఈ నెల 3వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం.. సవివరంగా నివేదిక దాఖలు చేయాలని తమిళనాడు పోలీస్‌శాఖను ఆదేశించింది. దీంతో కోయంబత్తూరు జిల్లా ఎస్పీ కార్తికేయన్ నేతృత్వంలోని పోలీసులు 23 పేజీలతో కూడిన నివేదిక దాఖలు చేశారు. యోగా కేంద్రంలో ఆరుగురు అదృశ్యమైనట్టు కేసులున్నాయని, అందులో ఐదు కేసుల్ని ఉపసంహరించుకోగా, మరో కేసు మాత్రం పెండింగ్‌లో ఉందని నివేదికలో పేర్కొన్నారు. అలాగే మరో ఏడు కేసులు నమోదు చేయగా, వాటిల్లో ఒక కేసు విచారణలో ఉందని వివరించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం మరోమారు విచారణ జరగ్గా.. ఈశా కేంద్రం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ.. మాజీ ప్రొఫెసర్ కుమార్తెల వయసు 42, 39 వుందని, వారి ఇష్టప్రకారమే యోగా కేంద్రంలో ఉంటున్నారని వివరించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ పిటిషన్‌ను మూసివేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈశా కేంద్రంపై ఉన్న ఇతర కేసులు విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది.

గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయండి



- కేంద్రానికి స్టాలిన్ డిమాండ్
- రాష్ట్ర గేయంలోని 'ద్రవిడ' పదాన్ని ఉద్దేశపూర్వకంగా పలకలేదని ఆరోపణ

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్‌ను వెంటనే రీకాల్ చేయాలని సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ రాష్ట్ర గేయంలోని 'ద్రవిడ' అనే పదాన్ని ఉద్దేశ పూర్వకంగానే పలకలేదని ఆయన ఆరోపించారు. "గవర్నర్ మీరు ఆర్యులా? ద్రవిడ అనే పదాన్ని తొలగించి రాష్ట్ర గేయాన్ని ఆలపించడం తమిళనాడు చట్టాలకు విరుద్ధం. ఆ చట్టాలను గౌరవించని, ఇష్టానుసారం ప్రవర్తించే వ్యక్తి గవర్నర్ పదవిలో కొనసాగేందుకు అర్హుడు కాదు. దేశంలో నివసిస్తున్న వివిధ జాతులు, మతాలకు చెందిన ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా గవర్నర్ ప్రవర్తించారు" అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ద్రవిడియన్ అలర్జీతో బాధపడుతున్న గవర్నర్ జాతీయ గీతంలో ద్రవిడ పదాన్ని తొలగించాలని కోరుతారా? ఉద్దేశపూర్వకంగా తమిళనాడును, తమిళనాడు ప్రజల మనోభావాలను కించపరుస్తున్న గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రీకాల్ చేయాలి" అని ముఖ్యమంత్రి కోరారు. ఇదిలా ఉండగా, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీ మాసోత్సవాలు జరపడమెందుకని స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోదీకి శుక్రవారం లేఖ రాశారు. శుక్రవారం ఉదయం మద్రాస్ దూరదర్శన్ స్వర్ణోత్సవాలతో పాటు హిందీ మాసోత్సవాన్ని నిర్వహించడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విభిన్న భాషలకు నిలయమైన భారతదేశంలో హిందీ భాషకు ప్రత్యేక స్థానం ఇవ్వడం, హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో హిందీమాసోత్సవాలను నిర్వహించడం ఆయా రాష్ట్రాల్లోని మాతృభాషలను, ఇతర భాషలను కించపరచడమే అవుతుందని లేఖలో పేర్కొన్నారు.

పన్నూ హత్యకు భారతీయుల కుట్ర



డబ్బులిచ్చి అంతమొందించాలని చూశారు

- రా మాజీ అధికారి వికాస్ యాదవ్ ప్రథమ నిందితుడు.. ఆయనకు నిఖిల్ గుప్తా సహకారం
- ఇద్దరూ కలసి 'హిట్‌మ్యాన్'తో బేరం
- అమెరికా న్యాయశాఖ అభియోగాలు

న్యూఢిల్లీ, అక్టోబరు, 18: ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ హత్యకు భారత్‌కు చెందిన పరిశోధన, విశ్లేషణ విభాగం (రా) మాజీ అధికారి వికాస్ యాదవ్ కుట్ర పన్నారని, అతనే ప్రథమ నిందితుడు అని అమెరికా న్యాయశాఖ తాజాగా అభియోగాలు మోపింది. గతంలో న్యూయార్క్ కోర్టుకు సమర్పించిన అభియోగపత్రంలో వికాస్ యాదవ్‌ను సీసీ-1గా పేర్కొంది. తాజాగా కోర్టుకు సమర్పించిన అభియోగపత్రంలో వికాస్‌కు మరో భారతీయుడు నిఖిల్ గుప్తా కూడా సహకరించారని తెలిపింది. వీరిపై కిరాయికి హత్య, కిరాయి హత్యకు కుట్ర, మనీ లాండరింగ్ కింద అభియోగాలు నమోదు చేసింది. నేరారోపణ రుజువైతే వీరికి నలభై ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసులో వికాస్ యాదవ్ ఉనికిని గురువారం బహిర్గతం చేసిన యూఎస్ న్యాయశాఖ అతడు పరారీలో ఉన్నాడని పేర్కొంది. వికాస్, నిఖిల్ కలసి భారత మూలాలు కలిగిన అమెరికా పౌరుడిని ఈ నేలపై హత్య చేయడానికి కుట్ర పన్నారని అభియోగాలు మోపింది. హత్య కోసం నిఖిల్ గుప్తాను వికాస్ యాదవ్ గత ఏడాది మే నెలలో నియమించుకున్నట్లు అమెరికా ప్రాసిక్యూటర్లు భావిస్తున్నారు. ఆ అభియోగపత్రంలో వికాస్ యాదవ్ భారత విదేశాంగ నిఘా సర్వీస్ ఉద్యోగి నని, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ హోదాలో సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, ఇంటెలిజెన్స్ విభాగాలను పర్యవేక్షించేవాడినని, సీఆర్‌పీఎఫ్‌లో కూడా పనిచేశానని, యుద్ధ విమానాల శిక్షణ కూడా తీసుకున్నానని చెప్పుకొన్నాడని పేర్కొన్నారు. అయితే దీనిని భారత ప్రభుత్వం మాత్రం నిర్ధారించలేదు. కానీ వికాస్ యాదవ్ మిలిటరీ డ్రస్‌లో ఉన్న ఫొటోను ఒకదానిని అభియోగపత్రానికి జత చేశారు. అలాగే ఒక కారులో కూర్చుని ఇద్దరు వ్యక్తులు అమెరికా డాలర్లు మార్చుకుంటున్న మరో ఫొటోను కూడా కోర్టుకు సమర్పించారు. నిఖిల్ గుప్తా, వికాస్ యాదవ్ తరఫున పనిచేసే మూడో నిందితుడు, ఇంకా గుర్తించాల్సిన 'హిట్‌మ్యాన్'కు కారులో ఆ డబ్బు ఇస్తున్నట్లు అభియోగాల్లో పేర్కొన్నారు. పన్నూను అంతమొందిస్తే గుజరాత్ కోర్టులో గుప్తాపై ఉన్న క్రిమినల్ కేసును విత్‌డ్రా చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది. ఈ హత్యకు సంబంధించి వికాస్, నిఖిల్ కలసి అండర్ కవర్ ఫెడరల్ ఏజెంట్ 'హిట్‌మ్యాన్'ను కలిసి లక్ష డాలర్లకు బేరం కుదుర్చుకున్నారని, దానిలో భాగంగా గతేడాది జూన్‌లో 15 వేల డాలర్లు అడ్వాన్స్‌గా ఇచ్చారని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వస్తారనగా ఈ డీల్ జరిగిందని, ఆ తర్వాత కొద్ది రోజులకే కెనడాలో మరో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య జరిగిందని తెలిపారు. జూన్‌లోనే పన్నూపై హత్యాయత్నం జరిగిందని ప్రాసిక్యూటర్లు తెలిపారు. మోదీ పర్యటన సమయంలో కానీ, పర్యటన ముగిసిన వెంటనే కానీ హత్య చేయవద్దని హిట్‌మ్యాన్‌కు గుప్తా సూచించాడని, అయితే జూన్ 18న నిజ్జర్ హత్య తర్వాత వారి ప్లాన్ మారిపోయిందని ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఇక నిరీక్షించాల్సిన అవసరం లేదని జూన్ 20న హిట్‌మ్యాన్‌కు గుప్తా చెప్పినట్లు యూఎస్ అధికారులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం గుప్తా న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో అమెరికా కస్టడీలో ఉన్నాడు.

వికాస్ ప్రభుత్వ ఉద్యోగి కాదు

అభియోగాలు నమోదైన వెంటనే భారత ప్రభుత్వం ప్రతిస్పందించిందని, వికాస్ యాదవ్ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగి కాదని, ఈ కేసు విషయంలో భారత సహకారానికి ప్రాసిక్యూటర్లు సంతృప్తిగా ఉన్నారని అమెరికా ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. అమెరికా అభియోగాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, సంబంధిత శాఖలు దీనిని ఇప్పటికే పర్యవేక్షిస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.



వికాస్ యాదవ్

భారత్‌లో 23.4 కోట్ల పేదలు

- ప్రపంచంలోనే అత్యధికం
- ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక వెల్లడి



ఐరాస, అక్టోబరు 18: ప్రపంచవ్యాప్తంగా 110 కోట్ల మందికిపైగా ప్రజలు ఇంకా తీవ్రమైన పేదరికంలోనే జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన 'గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పోవర్టీ ఇండెక్స్-2024' నివేదికలో వెల్లడించింది. 23.4 కోట్ల మందితో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పాకిస్థాన్, ఇథియోపియా, నైజీరియా దేశాలు ఉన్నాయి. మొత్తం పేదల్లో సగానికి పైగా(58.4 కోట్లు) 18 ఏళ్లలోపు చిన్నారులు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పేదల్లో 83.2% మంది ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లోనే ఉన్నారని నివేదిక గుర్తించింది. మొత్తం పేదల్లో 83.7% మంది గ్రామాల్లోనే ఉన్నారని నివేదిక చెప్పింది. ఇళ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్తు, వంట గ్యాస్, పోషకాహారం లేమి తదితర అంశాలపై 2012-23 మధ్య అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా ఐరాసకు చెందిన యూఎన్‌డీపీ మరో సంస్థ ఓపీహెచ్ఐతో కలిసి ఈ నివేదికను రూపొందించింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 2023లో అధికంగా దేశాల్లో అంతర్గత ఘర్షణలు, పలు దేశాల మధ్య యుద్ధాలు నెలకొన్నాయని, దీని వలన 11.7 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవాల్సి వచ్చిందని నివేదిక తెలిపింది. మొత్తం 110 కోట్ల మంది పేదల్లో ఘర్షణలు, యుద్ధాలు, అశాంతియుత పరిస్థితులు నెలకొన్న రీజియన్లలో 40 శాతం(45.5 కోట్లు) ఉన్నారని వెల్లడించింది.

దేశం	పేదల సంఖ్య
భారత్	23.4 కోట్లు
పాకిస్థాన్	9.3 కోట్లు
ఇథియోపియా	8.6 కోట్లు
నైజీరియా	7.4 కోట్లు
కాంగో	6.6 కోట్లు

సిన్వర్‌ది వీరమరణం

- తమ చీఫ్ మృతిని ధ్రువీకరించిన హమాస్
- సిన్వర్ యోధుడని కీర్తించిన ఇరాన్ అధ్యక్షుడు

చనిపోవడానికి ముందు తీవ్ర గాయాలతో కుర్చీలో ఉన్న సిన్వర్



చివరి క్షణాల వీడియో వైరల్

టెల్ అవీవ్, గాజా, అక్టోబరు 18: దక్షిణ గాజాలో ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడిలో తమ చీఫ్ యాహ్యా సిన్వర్ మృతి చెందినది నిజమేనని హమాస్ మిలిటెంట్ గ్రూప్ స్పష్టం చేసింది. సిన్వర్ ఇజ్రాయెల్‌పై చివరిదాకా పోరాడి అమరుడయ్యాడని హమాస్ గ్రూప్ డిప్యూటీ చీఫ్ ఖలీల్ అల్ హయ్య కీర్తించారు. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కూడా సిన్వర్‌ను యోధుడిగా కీర్తిస్తూ నివాళులర్పించారు. మరోవైపు, హమాస్ కనుక ఆయుధాలను వదిలి తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను విడుదల చేస్తే గాజాలో యుద్ధం రేపే ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. సిన్వర్ మృతితో యుద్ధం ముగింపు దశ ఆరంభమైందన్నారు. బందీలను అప్పగించకపోతే హమాస్ ఉగ్రవాదులను వేటాడి హతమారుస్తామన్నారు. అయితే, బందీలను విడుదల చేయబోమని హమాస్ స్పష్టం చేసింది. గాజాలో యుద్ధం ఆపి ఇజ్రాయెల్ బలగాలు పూర్తి స్థాయిలో వెనక్కు వెళ్లడంతో పాటు జైళ్లలో మగ్గుతోన్న పాలస్తీనియన్లను విడుదల చేసేదాకా తమ పోరాటం కొనసాగుతుందని తెలిపింది.

యాహ్యా సిన్వర్ చివరి క్షణాల వీడియో వైరల్ అయింది. ఐడీఎఫ్ బలగాలు ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశాయి. తన దగ్గరకు వస్తున్న డ్రోన్‌పై సిన్వర్ తన చేతిలోని కర్రను విసురుతున్న దృశ్యాలు ఇందులో ఉన్నాయి. కర్ర విసరడాన్ని ఇజ్రాయెల్‌పై చివరిక్షణంలో కూడా పోరాడినట్లుగా సిన్వర్ సమర్థకులు అభివర్ణిస్తున్నారు. కాగా, ఇజ్రాయెల్ ట్రైనీ సైనికులే సిన్వర్‌ను హతమార్చారు. బుధవారం వారు దక్షిణ గాజాలో ఉగ్రవాదుల కోసం గాలిస్తుండగా ఓ భవనం నుంచి ఉగ్రవాదులు దాడి చేశారు. దీంతో సైనికులు డ్రోన్ల సాయంతో ప్రతిదాడి జరిపారు. బాంబులను ప్రయోగించారు. అప్పుడే సిన్వర్ హతమయ్యాడు.

డిపాజిట్‌దార్లకు డబ్బు చెల్లించని హీరాగోల్డ్ ఎం.డీ బెయిల్ రద్దు

» సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): స్కీముల పేరుతో డిపాజిట్లు సేకరించి మోసం చేశారన్న కేసులో హీరాగోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ నౌహీరా షేక్‌కు ఇచ్చిన బెయిల్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు రద్దు చేసింది. గతంలో కోర్టుకు ఇచ్చిన హామీ మేరకు డిపాజిట్‌దార్లకు సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకొంది. ఈ కేసుపై ఈ ఏడాది ఆగస్టు 23న ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణలోపు రూ.580 కోట్లు సమీకరించుకుని డిపాజిట్ దారులకు తిరిగి చెల్లిస్తామని ఆ సందర్భంగా నౌహీరా షేక్ తరపు న్యాయవాది హామీ ఇచ్చారు. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. దాన్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. కానీ, డిపాజిట్ దార్లకు సొమ్ము చెల్లించలేదని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దాంతో బెయిల్ రద్దు చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

కులగణనకు అన్ని పార్టీలు సహకరించాలి

» కిషన్ రెడ్డి, కోదండరాం, కూనంనేనిలతో జాజుల శ్రీనివాస్ గౌడ్ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరగబోయే కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించి బీసీ కులాల లెక్కలు తేలడానికి తమ వంతుగా అండగా నిలబడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వివిధ రాజకీయ పార్టీలను కోరారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, శాసనమండలి సభ్యు లు, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులతో జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బీసీ ప్రతినిధుల బృందం భేటీ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమగ్ర కులగణన అంశంపై ఈ నెల 20న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న అఖిలపక్ష పార్టీల సమావేశానికి హాజరుకావాలని ఈ సందర్భంగా జాజుల వారికి విజ్ఞప్తి చేశారు. సమగ్ర కులగణనకు రాష్ట్రంలో తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ఈ కులగణన ఉపయోగపడేలా తాము సంపూర్ణంగా సహకరిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. అఖిలపక్ష పార్టీల సమావేశానికి తాము సంపూర్ణ మద్దతు తెలపడమే కాకుండా ఆ సమావేశానికి హాజరు అవుతున్నట్లు ప్రొఫెసర్ కోదండరాం, కూనంనేని సాంబశివరావు తెలిపారు.

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్ మృతులు 31కాదు.. 38 మంది: ఐజీ ప్రకటన

చర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్, దంతెవాడ సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 4న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 38 మంది మావోయిస్టులు మృతి చెందారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ పేర్కొన్నారు. మొదటగా 31 మంది మృతదేహాలు లభించాయని, తర్వాత మరో ఏడు మృతదేహాలను అడవిలో గుర్తించినట్టు తెలిపారు. మృతదేహాలను వారి బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అందరిపై రూ.2.62 కోట్ల రివార్డు ఉందన్నారు.

సోనియా పుట్టిన రోజు నాటికి రుణమాఫీ పూర్తి

» 7,500 చొప్పున రైతు భరోసా త్వరలోనే పంపిణీ

» వచ్చే బడ్జెట్‌లో రైతు కూలీలకు నిధుల కేటాయింపు

» రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: తుమ్మల

వికారాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పుట్టిన రోజు (డిసెంబరు 9) నాటికి ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణ మాఫీని పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గతంలో ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో దేశ వ్యాప్తంగా రూ.70 వేల కోట్ల మేర రుణమాఫీ చేశారని, ఆ తర్వాత సీఎం రేవంత్ ఒకే సారి రూ.31వేల కోట్లు మాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో శుక్రవారం నిర్వహించిన మర్పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ త్వరలోనే ఎకరాకు రూ.7500 చొప్పున రైతు భరోసా అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ రైతు కూలీలకూ నిధులు కేటాయిస్తామన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు మంత్రి పదవి వస్తే బాగుండేదని వికారాబాద్ ప్రజలు కోరుకున్నారని, కానీ.. ఇప్పుడు సీఎంతో సహా మొత్తం మంత్రివర్గమంతా ఆయన అధీనంలోనే ఉందని గుర్తు చేశారు. స్పీకర్‌కు కోపం వస్తే మామూలుగా ఉండదని, ఆయన దగ్గర మంత్రివర్గం మొత్తం ఒళ్ల దగ్గర పెట్టుకుని ఉంటుందని వ్యాఖ్యానించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తయితే వికారాబాద్ ప్రాంతం సస్యశామలం అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యానవన, కూరగాయ పంటలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి అని, రైతులు పామాయిల్ సాగుపైనా దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం లక్షల కోట్లు వెచ్చించి ఇతర దేశాల నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నామని, ఆ పరిస్థితి మారాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయినా హామీల అమలుకు సీఎం రేవంత్ కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలన్నీ పూర్తి స్థాయిలో అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్


సింగరేణి ఓసీపీలతో దినదిన గండం!

భూపాలపల్లి జిల్లాలో ప్రభావిత ప్రాంత ప్రజల ఇక్కట్లు.. భారీ పేలుళ్లతో ఇళ్లకు బీటలు.. అనారోగ్య సమస్యలు


» ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్టించుకోని యాజమాన్యం

» చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి వేడుకోలు

భూపాలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లాభాలే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ)ల కారణంగా పరిసర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. లక్ష్యానికి మించి బొగ్గును ఉత్పత్తి చేస్తున్న సింగరేణి అధికారులు.. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను అస్సలు పట్టించుకోవట్లేదు. పేలుళ్ల కారణంగా వెలువడుతున్న దుమ్ము ధూళి, కార్బన్‌మోనాక్సైడ్ లాంటి విష వాయువులు పీలుస్తూ వేలాది మంది ప్రజలు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. పరిమితికి మించి మందుపాతరలు వినియోగిస్తుండడంతో పేలుళ్ల ప్రకంపనలకు పరిసరాల్లోని ఇళ్ల గోడలు బీటలు వారి క్రమంగా శిథిలమైపోతున్నాయి. భూపాలపల్లి జిల్లా పరిధిలో మొత్తం 3 ఉపరితల గనుల నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తుండగా.. ఇందులో 2 సింగరేణి యాజమాన్య నిర్వహణలో ఉన్నాయి. మరొకటి తాడిచర్ల ఓపెన్‌కాస్టు ప్రాజెక్టును ప్రైవేటు యాజమాన్యం నిర్వహిస్తోంది. భూపాలపల్లి పట్టణానికి సమీపంలో ఓసీపీ-2 ప్రాజెక్టును ప్రారంభించిన 2017 నుంచి ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 230 ఇళ్లకు పగుళ్లు వచ్చి కూలే పరిస్థితికి చేరాయి. పేలుడు ధాటికి భారీ శబ్దాలతో పాటు పలుమార్లు రాళ్లు, బొగ్గు పెళ్లలు ఇళ్లపై పడిన సందర్భాలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓసీపీ-2ను నిర్వహిస్తున్నట్లు ఇక్కడికి వచ్చిన ఉన్నత స్థాయి సింగరేణి డైరెక్టర్ల బృందం గతంలోనే తేల్చింది. జనావాసాలకు, ఓసీపీకి మధ్య కనీసం 500 మీటర్ల దూరం ఉండాల్సి ఉండగా.. కానీ ఓసీపీ-2కు శాంతినగర్‌కు మధ్య 98 మీటర్లు మాత్రమే ఉందని ఆ బృందం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టును ప్రారంభించకముందే నిబంధనల మేరకు లక్షలాది మొక్కలు నాటాల్సి ఉంది. కానీ కాలనీలకు, ఓసీపీకి మధ్య వందల సంఖ్యలో మొక్కలు కూడా నాటకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఆయా కాలనీల్లో కనీసం 6 నెలలకు ఒక్కసారైనా హెల్త్ క్యాంపులు నిర్వహించాల్సి ఉండగా.. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటివరకు గడిచిన 7 ఏళ్లలో హనుమాన్‌నగర్‌లో ఒక్కసారి మాత్రమే క్యాంపు నిర్వహించారు.



శాంతినగర్ కాలనీకి అతి సమీపాన ఉన్న ఓసీపీ-2



పేలుళ్లకు దెబ్బతిన్న ఇంటి గోడ

ఓసీపీ-3 పరిసరాల్లోనూ..

గణపురం మండలంలోని మాధవరావుపల్లి సమీపంలో చేపట్టిన ఓసీపీ-3 ప్రాజెక్టు పరిసరాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఈ ప్రాజెక్టు చుట్టూ 10 గ్రామాలుండగా.. అందులో 5 గ్రామాలు పరుశురాంపల్లి, ధర్మరావుపేట, బస్వరాజుపల్లి, నగరంపల్లి, కొండాపూర్‌లపై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక్కడ కూడా పగుళ్లతో ఇళ్లు కూలిపోయేదశకు చేరుతున్నాయనే ఆందోళన ప్రజల్లో కన్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు ప్రభావిత గ్రామాల ప్రజలు పలుమార్లు విన్నవించినా ఏ మాత్రం మార్పులేదు. దీంతో ఓసీపీలపై పర్యావరణ శాఖతో సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మూసీ ప్రతిపాదనలు అఖిలపక్షం ముందు పెట్టండి: సీపీఎం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మూసీ నది ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటన సమంజసంగా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే మూసీ నదిపై ఒక నిర్ణయానికి వచ్చిందని, దాని అమలుకు సంబంధించిన సూచనలు మాత్రమే అడుగుతుందని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, దాని ప్రక్షాళన విషయంలో ఎవరికి భిన్నాభిప్రాయం లేదని, ఆ పేరు మీద ప్రభుత్వం ఏం చేయబోతుందోనన్నదే అసలు విషయం అని పేర్కొన్నారు. ఇతర పార్టీల కార్యాచరణ అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రణాళిక వంటి వివరాలను పార్టీలకు ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం సలహాలు తీసుకోవడం సమంజసం అని తెలిపారు. ఏకపక్ష ధోరణి సరైనది కాదని, ప్రభుత్వ ప్రతిపాదనలు రాజకీయ పార్టీలకు అందజేసి, అధ్యయనానికి తగిన సమయం ఇచ్చి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది.

జీవో నంబరు 29 రద్దు చేసి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించండి : సీపీఎం

జీవో నంబరు 29ని రద్దు చేసి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాలని సీపీఎం డిమాండ్ చేసింది. జీవో నంబరు 55 ప్రకారమే ప్రధాన పరీక్షలు నిర్వహించాలని శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్యాయం జరుగుతుందని ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులతో లాఠీ ఛార్జీ చేయించడాన్ని ఆయన ఖండించారు. ప్రస్తుతం అమలు చేయాలనుకుంటున్న జీవో 29 ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థిని జనరల్ కోటా కింద పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణిస్తే రిజర్వ్ కోటా అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జీవో 29 రద్దు చేసి గ్రూప్-1 మెయిన్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

చిక్కుల్లో మహారాష్ట్ర సీఎం కుమారుడు

» నిషేధాజ్ఞలున్న ఉజ్జయిని ఆలయ గర్భగుడిలో పూజలు

» విపక్షాల భగ్గు, విచారణకు ఆదేశం

ముంబై, అక్టోబరు 18: ఎన్నికల ముందు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు ఎంపీ శ్రీకాంత్ షిండే వివాదంలో చిక్కుకున్నారు. గర్భగుడి ప్రవేశం నిషేధం ఉన్న ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఆయన భార్యతో కలిసి పూజలు నిర్వహించారు. నిషేధాజ్ఞలున్నా గర్భగుడిలోకి సీఎం కుమారుణ్ని అనుమతించడంపై తీవ్ర దుమారం రేగడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఏడాది కాలంగా గర్భగుడిలోకి వెళ్లడంపై నిషేధం ఉంది. అయితే గురువారం సాయంత్రం కళ్యాణ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీకాంత్ షిండే... ఆయన భార్య, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. దీంతో విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. దర్శనం కోసం సామాన్యులు గంటల కొద్దీ 'క్యూ'లో నిలబడి వేచి చూస్తుంటే వీఐపీలు మాత్రం నిషేధం ఉన్నా సరే ప్రవేశిస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని కాంగ్రెస్ విమర్శించింది.

రెండో టర్బైన్ మరమ్మతు పనులు ప్రారంభం

» సాగర్ జలవిద్యుత్ కేంద్రానికి జపాన్ బృందం

» మరమ్మతులకు రూ.2.5 కోట్ల అంచనా వ్యయం

నాగార్జునసాగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని రెండో నెంబర్ టర్బైన్ మరమ్మతు పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జపాన్ నుంచి వచ్చిన ఇంజనీర్ల బృందం మరమ్మతుకు గురైన టర్బైన్‌ను పరిశీలించింది. గత నవంబరు 10న ఈ టర్బైన్ మర్మమతులకు గురైంది. దాదాపు ఏడాదిగా మరమ్మతుల సంగతిని అధికారులు పట్టించుకోవడం లేదు. జెన్‌కో అధికారుల నిర్లక్ష్యంపై 'జల విద్యుత్‌పై జెన్‌కో నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో శుక్రవారం కథనం కూడా ప్రచురితమైంది. జపాన్ నుంచి వచ్చిన ముగ్గురు మెకానికల్ ఇంజనీర్ల బృందం టర్బైన్లను, జనరేటర్లను పరిశీలించింది. రెండో నంబరు టర్బైన్ రోటర్ స్పైడర్ విరిగి టర్బైన్ తిరగకుండా ఆగిపోయిందని గుర్తించింది. మరమ్మతు పనులకు రూ.2.5 కోట్లు ఖర్చు అవుతందని అంచనా వేశామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రాంతాలను గుర్తించాలి

» ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఆంధ్రప్రదేశ్‌ను కోరింది. ఈమేరకు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీపీఏ లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టుతో ముడిపడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని సుప్రీంకోర్టు 2022 సెప్టెంబరులో కేంద్ర జలశక్తి శాఖను ఆదేశించిన విషయం విదితమే. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రేడు వాగుల ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడి, ఆయా నదుల వరద నీరు సక్రమంగా ప్రవహించకుండా ముంపు పెరుగుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేయడం... అప్పటికే జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ)లో వేసిన కేసులోనూ ముంపు ప్రాంతాలను గుర్తించాలని ఆదేశాలు వెలువడిన విషయం విదితమే. ఇక 2021 ఏప్రిల్ 17వ తేదీ నుంచి 29వ తేదీ దాకా ముంపు ప్రాంతాల గుర్తింపునకు సంయుక్త సర్వే జరిగింది. ఆ సర్వే ఆధారంగా తెలంగాణ అధికారులతో సమన్వయం చేసుకొని, ముంపు ప్రాంతాలను వెంటనే గుర్తించాలని పీపీఏ ఏపీని ఆదేశించింది.

సుజాతను కోర్టులో హాజరుపర్చాలి

» పౌరహక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత అలియాస్ మైనా బాయిను పోలీసులు వెంటనే కోర్టులో హాజరుపరచాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. సుజాతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రచారం జరుగుతోందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. మావోయిస్టు అగ్రనేతకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా, ఆమెపై ఎలాంటి కేసులు ఉన్నా వెంటనే కోర్టులో హాజరుపర్చాలన్నారు. ఈమేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత అరెస్టుపై పోలీసులు శనివారం అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కమిటీ సభ్యురాలు కావడంతో డీజీపీ జితేందర్ ఈ వివరాలు వెల్లడించనున్నారని సమాచారం.

మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆబిడ్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 33 జిల్లాల మీసేవ నిర్వాహకులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా భైర శంకర్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ మొయిద్, కార్యదర్శిగా షేక్ షఫీ, కార్యనిర్వాహక సభ్యుడిగా గుంత శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మీసేవ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నవంబరు-4న రవీంద్రభారతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంచింగ్‌గా కుళ్లిన చికెన్!

బేగంపేటలోని ఓ చికెన్ సెంటర్‌లో 700 కిలోల పాడైపోయిన చికెన్ స్వాధీనం

» బార్లు, కల్లు కాంపౌండ్లు, పర్మిట్‌రూంలకు సరఫరా

హైదరాబాద్ సిటీ/బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చికెన్ కర్రీ, చికెన్ ఫ్రై, చికెన్ 65.. ఇలా చికెన్‌తో చేసిందేదైనా ఓ పట్టుపడదామని అనుకోని మాంసపు ప్రియులు ఉంటారా? కానీ చికెన్ సెంటర్‌లో కొనేటప్పుడు గానీ, బయట చికెన్‌తో చేసిన రకరకాల వెరైటీలు తినేటప్పుడు గానీ జాగ్రత్త.. మాంచి వాసనతో రుచికరంగా అనిపించే ఆ చికెన్ మిమ్మల్ని అనారోగ్యంపాలు చేసినా చేయొచ్చు. ముఖ్యంగా మంచింగ్ కోసం చికెన్ వెరైటీలను ఎంచుకొనే మద్యం ప్రియులైతే మరింత జాగ్రత్తగా ఉండాలి సుమా!! ఎందుకంటే.. రోజుల తరబడి నిల్వ ఉంచడంతో పూర్తిగా కుళ్లిపోయి.. కంపు కొడుతున్న కోడిమాంసాన్ని అమ్ముతున్నారు చికెన్ సెంటర్ నిర్వాహకులు! అమ్ముడు పోగా మిగిలిన చికెన్‌ను రసాయనాలు చల్లి రిఫ్రిజిరేటర్లలో రోజుల తరబడి నిల్వ ఉంచుతున్నారు. పాడైపోయిన ఆ చికెన్‌ను తక్కువ ధరకు బార్లు, కల్లు కాంపౌండ్లు, పర్మిట్ రూంలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతున్నా వండే క్రమంలో దండిగా మసాలాలు దట్టిస్తే మద్యం మత్తులో గుర్తించకుండా మందుబాబులు ఆవురావురుమంటూ లాంగించేస్తారనే గట్టి నమ్మకం బార్లు, కల్లు కాంపౌండ్, పర్మిట్ రూంల నిర్వాహకులది! జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ, ఎస్‌వోటీ పోలీసులు కలిసి శుక్రవారం బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లోని బాలయ్య చికెన్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 700 కిలోలకు కుళ్లిపోయిన చికెన్, ఎముకలు, చికెన్ వేస్ట్ లభ్యమైంది. ఆ సెంటర్‌లోకి వెళ్లిన అధికారులు.. రిఫ్రిజిరేటర్ తెరవగానే దుర్వాసన రావడంతో ఆశ్చర్యపోయారు. నిల్వ ఉంచిన చికెన్, ఇతర పదార్థాలకు దుర్వాసన రాకుండా రసాయనాలు కలిపి సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఆ దుకాణం సీజ్ చేసి దాదాపు 700 కిలోల చికెన్‌ను, కోడి ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సమయంలో.. ఆ చికెన్‌ను కొనేందుకు పర్మిట్ రూంలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులు రాగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బయటి మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు వస్తుండటంతో బార్లు, మద్యం దుకాణాల వద్ద ఉండే పర్మిట్ రూమ్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. ఏడాది క్రితం ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో బాలయ్య చికెన్ సెంటర్ ఏర్పాటుచేశారు. గతంలో రసూల్‌పురాలో దుకాణం ఏర్పాటుచేసి కుళ్లిన చికెన్ సరఫరా చేస్తుండగా అధికారులు సీజ్ చేశారు. దీంతో మరో ప్రాంతంలో చికెన్ సెంటర్ ఏర్పాటుచేసి అదే దందా చేస్తున్నట్లు తెలిపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న కుళ్లిన చికెన్

ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ ఫస్ట్

» టి-హబ్‌తో 8 అంతర్జాతీయ సంస్థల ఒప్పందాలు : శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐటీ ఎగుమతుల వృద్ధిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు రూ.2.68 లక్షల కోట్లకు చేరాయని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే వృద్ధిరేటు 11.2 శాతంగా నమోదైందన్నారు. జీసీసీ ఇన్నోవేషన్ సమిట్ శుక్రవారం టీ-హబ్‌లో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ఐటీ ఎగుమతుల వృద్ధిలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీ) పాత్ర అత్యంత కీలకమన్నారు. హైదరాబాద్‌లో ఉన్న అనేక అంతర్జాతీయ, జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే జీసీసీలను నెలకొల్పాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పలు ఐటీ కంపెనీలు ఇప్పటికే తమ క్యాంపస్‌లను ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాయని, వీటి సంఖ్య త్వరలో పెద్దఎత్తున పెరగనుందని తెలిపారు. జీసీసీ ఇన్నోవేషన్ సమిట్‌లో భాగంగా 8 జాతీయ, అంతర్జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టి-హబ్‌తో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందులో మెడ్‌ట్రానిక్, కెనడాలోని టొరంటో బిజినెస్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), సమిట్ కన్సల్టింగ్ సర్వీసెస్, ట్రాన్సిషన్ వీసీ, ఫియూజీ, న్యూ రిలిక్, పేయూ ఉన్నాయి. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణభాగం పర్యవేక్షణకు 'పీఐయూ'

» త్వరలో డీపీఆర్ కన్సల్టెంట్ నియామకం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణభాగం నిర్మాణానికి సంబంధించి అలైన్‌మెంట్ సహా అన్ని పనుల పర్యవేక్షణకు 'ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్'(పీఐయూ) ఏర్పాటు కానుంది. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని తన ఆధ్వర్యంలోనే నిర్మించాలని భావిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఐఏఎస్ అధికారులతో ఇప్పటికే ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. దక్షిణభాగం రహదారి అలైన్‌మెంట్, ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు నిర్మించాల్సిన రేడియల్ రోడ్ల అలైన్‌మెంట్ల తయారీ బాధ్యత ఆ కమిటీకి అప్పగించింది. ఈ క్రమంలోనే అన్ని అంశాలను పర్యవేక్షించేందుకు పీఐయూను ఏర్పాటు చేయాలని ఆ కమిటీ నిర్ణయించినట్టు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఔటర్ రింగు రోడ్డు ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు కూడా అప్పట్లో పీఐయూను ఏర్పాటు చేశారు. ఓఆర్‌ఆర్ నిర్మాణం మొత్తాన్ని పీఐయూనే పర్యవేక్షించింది. ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం విషయంలోనూ పీఐయూ అంతే కీలకంగా పని చేస్తుందని కమిటీ యోచన. ఈ పీఐయూలో ఒక ప్రాజెక్టు మేనేజర్, చీఫ్ ఇంజనీర్(సీఈ), డిప్యూటీ ఇంజనీర్(డీఈ), సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ), ఒక మేనేజర్, ఒక అకౌంటెంట్ సహా అవసరమైన సిబ్బంది ఉండనున్నారు. ఇక దక్షిణ భాగానికి సంబంధించిన రహదారి నిర్మాణం, మార్గమధ్యలో నిర్మించే వెహికల్ అండర్ పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్, జంక్షన్ల వివిధ అంశాలన్నిటినీ తేల్చేందుకు ఓ డీపీఆర్ కన్సల్టెంట్‌ను నియామించాలని ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయించింది. ఇందుకు త్వరలోనే టెండర్లు ఆహ్వానించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ఫోర్త్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవేల్లో అధిక భాగం ఈ మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతమున్న రూట్ మ్యాప్ ప్రకారం ఈ రహదారి చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డిలోని ఉత్తర భాగం రహదారికి అనుసంధానం కానుంది.

మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇరవై మంది అధికారులు శుక్రవారం ఉదయం రెండు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. ఈడీ అధికారులు ముడా ఆఫీసులోకి ఇతరులెవ్వరినీ అనుమతించలేదు. 20మందికి పైగా సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తొలి అడుగు..!

పాకిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సుకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకావడం ఒక విశేషమైన పరిణామం. దాదాపు పదేళ్ళ తరువాత భారతవిదేశాంగమంత్రి పాకిస్థాన్‌లో కాలూనిన సందర్భం ఇది. షాంఘై సహకార సంస్థ సదస్సుకు పాకిస్థాన్ అతిథ్యం ఇస్తున్నది కనుక, ఈ విస్తృత వేదికలో భాగస్వామిగా, ఆ సదస్సులో పాలుపంచుకోవడానికి మాత్రమే ఆయన వెడుతున్నారు తప్ప పాకిస్థాన్‌తో రాసుకుపూసుకొనేదేమీ ఉండదని ప్రయాణానికి ఎంతో ముందుగానే జైశంకర్ పక్షాన ఆయన మంత్రిత్వశాఖ ఓ మాట చెప్పింది కూడా. ఆయన ప్రయాణం, పెద్దలతో భేటీలు దె□క్షికవ్యవహారం కాకపోవచ్చును కానీ, ఉభయదేశాల మధ్యా గడ్డకట్టుకొనిపోయిన దౌత్యసంబంధాల్లో కాస్తంత సానుకూలమైన మార్పు తీసుకురావడానికి ఆయన పర్యటన పరోక్షంగా ఉపకరించవచ్చు. సదస్సు సందర్భంగా పాకిస్థాన్‌తో విడిగా ఎటువంటి మంతనాలు, చర్చలూ ఉండవని మనం తేల్చేయడమూ, అటు పాకిస్థాన్ కూడా అదే తరహాలో దె□క్షిక చర్చలు ఉండవంటూ స్పందించడం ఒక విధంగా వాతావరణాన్ని సానుకూలం చేసింది. అన్ని అనుమానాలు, శషబిషలు పక్కనబెట్టి చక్కగా పలకరించుకొని, చేయీచేయీ కలుపుకొని, కాస్తంత నవ్వుకోవడానికి ఈ పరిస్థితి అవకాశం ఇచ్చింది.

వాతావరణం బాగా ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో, వేరొక అవసరం చేత పొరుగుదేశానికి ప్రయాణం కట్టవలసివచ్చినా కూడా దానినుంచి మిగతావారు ఊహించేదీ ఎక్కువే ఉంటుంది. అందువల్ల, ఈ పర్యటనకు ఏ విలువా లేదని ఉభయులూ ముందుగానే తేల్చేస్తే ఆ మేరకు ఆశతో పాటు, ప్రమాదం కూడా తగ్గుతుంది. దౌత్యసంబంధాలను కాస్తంత చక్కదిద్దుకోడానికి కొంతకాలంగా తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇది మరీ అవసరం. అంతవరకూ సంబంధాలు అద్భుతంగా ఉన్నాయని కాదు కానీ, జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు నిర్ణయం రెండు దేశాల మధ్యా అతిపెద్ద అగాధాన్ని సృష్టించింది. ఢిల్లీలో తన హైకమిషనర్‌ను ఉపసంహరించుకొని, తనదేశంనుంచి మనవారిని వెళ్ళగొట్టి, వాణిజ్యసంబంధాలను సైతం తెగదెంపులు చేసుకొని చాలా హడావుడి చేసింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి ఆ అధికారాలన్నీ దక్కితేనే తననుంచి ఓ మాట, ఓ పలకరింపు ఆశించాలని స్పష్టంచేసింది. మనకు మరింత దూరంగా పోయి, దె□క్షిక చర్చలను కాదనుకున్నది ఆ దేశమే.


ఈ పరిస్థితుల మధ్య, వెళ్ళిన పనేదో చూసుకొని రావడం తప్ప, జయశంకర్ పర్యటనలో ఏవో విశేషాలు, అనూహ్యమైన మలుపులూ ఉంటాయని ఎవరూ ఆశించలేదు. తన ప్రసంగంలో ఉగ్రవాదం గురించి, దానిని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ తదితర దేశాల గురించి తాను చెప్పదల్చుకున్నదేదో జైశంకర్ కూడా కుండబద్దలు కొట్టేశారు. పొరుగుదేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గుర్తించి గౌరవించుకోవడం నేర్చుకోమంటూ చైనా, పాకిస్థాన్‌కు గట్టిగానే చీవాట్లు వేశారు. ఉభయదేశాల మధ్యా దూరాన్ని పెంచుతున్న ఉగ్రవాదంతో నిజాయితీగా పోరాడాలంటూ పాకిస్థాన్‌కు హితవు చెప్పారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) మరింత విస్తరించాలనీ, హైవేలు, ఓడరేవులు, రైల్వేలైన్లతో ఆసియా నుంచి ఆఫ్రికావరకూ అంతా కళకళలాడిపోవాలని పాకిస్థాన్ ప్రధాని చైనాను ఆకాశానికి ఎత్తేస్తే, దానికి పూర్తి భిన్నమైన, విరుగుడు వ్యాఖ్యలు జైశంకర్ చేశారు.

ఆర్థికం, వాణిజ్యం, పర్యావరణం తదితర అంశాలపట్ల ఆయా ప్రభుత్వాల అధికారిక వైఖరులు ఎలా ఉన్నప్పటికీ, ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇటీవల ప్రతీసందర్భంలోనూ, అన్ని అంతర్జాతీయవేదికలమీదా ఆయన కశ్మీర్ ఊసులేకుండా ప్రసంగాలు చేయలేదు. అలాగే, విందు సందర్భంలో ఆయన జైశంకర్‌తో కాస్త ఎడంగా కొద్దిసేపు ముచ్చటించడం, పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగమంత్రులు కూడా సుదీర్ఘసమయం మాట్లాడటం వంటివి జరిగాయి. మరోవైపు, ఎస్సీవో సదస్సుకోసం పాకిస్థాన్ వెళ్ళిన భారతదేశ పాత్రికేయులతో పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్, ఆయన కుమార్తె మరియం నవాజ్ ప్రత్యేకంగా భేటీ కావడం, జైశంకర్ పర్యటనను తొలి అడుగుగా అభివర్ణించడం విశేషం. భారతజర్నలిస్టులతో వారిరువురూ భేటీ కావడంపై పాకిస్థాన్ మీడియా సంస్థలు భిన్నంగా స్పందించాయి కూడా. సహకార సంస్థ సదస్సుకు భారతప్రధాని నరేంద్రమోదీ వచ్చివుంటే ఎంతో బాగుండేదని నవాజ్ షరీఫ్ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్య కూడా అందరినీ ఆకర్షించింది. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే అయినప్పటికీ, ఉభయదేశాల మధ్యా ఉన్న ఉక్కబోత వాతావరణాన్ని కాస్తంత ఉపశమింపచేసేందుకు ఉపకరిస్తాయి.

సంఘ్ శతాబ్ది వేళ భగవత్ మాట

మోహన్ భగవత్‌కు చిత్రమైన సమయ భావం ఉన్నది. ఆయన ఉపన్యాసాలు వెలువరించడం అరుదు. అయితే ఉపన్యసించడానికి ఆయన ఎంపిక చేసుకునే రోజు, సందర్భం ప్రశస్తమైనవి. తన భావాలను వ్యక్తం చేసేందుకు ఆయన వాడే మాటలు శ్రేష్ఠమైనవి. నేను ఆయన ఉపన్యాసాలను ఆంగ్లానువాదంలో మాత్రమే చదివాను. చాలా మంది ఆయన అభిప్రాయాలతో తీవ్రంగా విభేదిస్తారు. నాకూ వాటితో ఏ మాత్రం ఏకీభావం లేదు. ఏమైనా భగవత్ ముఖ్యంగా 2014 అనంతరం వెలువరిస్తున్న ఉపన్యాసాలు సంఘ్ శ్రేణులనే కాదు, ఇతరులనూ ఆకట్టుకుంటున్నాయనడంలో ఎవరికీ మరో అభిప్రాయం లేదు.

భగవత్ ఉపన్యాసాలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధికార వాణిగా సర్వత్రా గుర్తింపు ఉన్నది. అందుకు ఆ సంస్థ స్వభావమూ, నిర్మాణ విలక్షణతతో పాటు సర్ సంఘ్‌చాలక్‌గా భగవత్ సర్వోన్నత ప్రాధాన్యమే కారణం. భగవత్‌కు సంఘ్‌లో తిరుగులేని అధికారమున్నదని అందరూ విశ్వసిస్తారు. కనుక ఆయన ఉపన్యాసాలను, ముఖ్యంగా ఇటీవలి కాలంలో అందరూ గంభీరంగా ఆలకిస్తున్నారు, వాటి గురించి నిశితంగా ఆలోచిస్తున్నారు.




▪ పి. చిదంబరం

'పళని' పలుకు

జూన్ 2024లో లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రకటించిన కొద్ది రోజులకే మోహన్ భగవత్ ఒక ఉపన్యాసం వెలువరించారు. ఆ ప్రసంగంలోని ప్రధానాంశం: 'అహంకారాన్ని విడనాడి వినయ విధేయతలతో ప్రవర్తించాలి'. లోక్‌సభ ఎన్నికల అనంతరం అది ఆయన మొదటి బహిరంగ ఉపన్యాసం. అందులో ఆయన ఇలా అన్నారు: అబద్ధాలతో కూడిన, నిందాపూర్వక భాషను ఉపయోగించిన ఎన్నికల ప్రచార ప్రసంగాలు రాజకీయ పార్టీలు పాటించాల్సిన మర్యాదలను పూర్తిగా ఉల్లంఘించినవే అవుతాయి; మీ ప్రత్యర్థి మీ శత్రువు కాదు. అతడు ఒక విరుద్ధ దృక్పథానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. శత్రువుగా కాక ప్రతిపక్ష అభ్యర్థిగా భావించాలి. ప్రతిపక్ష భావాలు, అభిప్రాయాలను కూడా తప్పక పరిగణనలోకి తీసుకోవాలి; ఒక నిజమైన స్వయం సేవకుడు హుందాగా ప్రవర్తిస్తాడు. ప్రత్యర్థికి మర్యాద ఇచ్చి మర్యాద పుచ్చుకుంటాడు. 'నేను ఈ పని చేశాను' అన్న అహంకారం అతడికి ఏ కోశాన ఉండదు, ఉండకూడదు. నరేంద్ర మోదీని, ఆయన ఎన్నికల ప్రచార సరళిని దృష్టిలో ఉంచుకునే భగవత్ ఈ ప్రసంగం చేశారని ఆనాడు అందరూ భావించారు.

జూలై 2024లో వెలువరించిన మరొక ఉపన్యాసంలో ఆయన ఈ సుప్రసిద్ధ వ్యాఖ్యలు చేశారు: 'ఒక వ్యక్తి తొలుత ఒక మహా మనిషి కావాలనుకున్నాడు, ఆ తరువాత ఒక దేవుడు అవ్వాలని ఆశించాడు; పిదప ఒక భగవాన్‌గా లోకులు తనను పూజించాలని కోరుకున్నాడు'. తాను అందరిలా జైవికంగా జన్మించలేదని నరేంద్ర మోదీ స్వయంగా చెప్పుకున్న గొప్పలను నిర్ద్వంద్వంగా నిరాకరించడమే కాదూ భగవత్ వ్యాఖ్యలు? తల్లి గర్భధారణ, గర్భావధి (గర్భధారణ నుంచి శిశు జననందాకా సమయం), ప్రసవం అనే సహజ ప్రక్రియలకు తాను అతీతుడినని, పరాత్పరుడు తనను నేరుగా 'సృష్టించాడు' అని భావించారా? అలా అయితే మోదీ ఒక పరిధి మించి మాట్లాడారని భగవత్ తన వ్యాఖ్యలతో స్పష్టంగా సూచించినట్టు అనుకోవచ్చు.

విజయదశమి (అక్టోబర్ 12, 2024) రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన 100వ సంవత్సరంలోకి ప్రవేశించింది. ఆ సందర్భంగా మోహన్ భగవత్ తన మూడవ సుప్రసిద్ధ ఉపన్యాసాన్ని వెలువరించారు (టైమ్స్ ఆఫ్ ఇండియా, ఇండియా టైమ్స్.కామ్ అనువదించి నివేదించిన ఆ ప్రసంగ పాఠాన్ని మాత్రమే నేను చదివాను) ఆ ఉపన్యాసం నాకు ఆశాభంగం కలిగించింది, అయితే ఆశ్చర్యపరచలేదు. భగవత్ ఆ ఉపన్యాసంలో వ్యవస్థిత ఆరెస్సెస్ భావజాల వైఖరులకు మళ్లీ మళ్లారు. ఆయన ఆ ఉపన్యాసంలో ధర్మం, సంస్కృతి, వ్యక్తిగత సౌశీల్యం, జాతీయ వ్యక్తిత్వం ధర్మ విజయం, మంగళప్రదమైన భవిష్యత్తు, నైతికత, స్వాభిమానం, ఆత్మగౌరవం ఇత్యాది మాటలు ధారాళంగా వాడారు. హమాస్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధం గురించి పరోక్షంగా సూచించారు. అయితే ఆ మారణకాండలో 43 వేల మంది హతమయ్యారన్న విషయాన్ని ప్రస్తావించలేదు; అలాగే జమ్మూ–కశ్మీర్ ఎన్నికల గురించి కూడా. అయితే కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపనే లేదు; మణిపూర్ విషయానికి వస్తే అక్కడి పరిస్థితులు 'ఆందోళన' కలిగిస్తున్నాయని మాత్రమే ముక్తసరిగా పేర్కొన్నారు.



భగవత్ ఉపన్యాసాలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధికార వాణిగా సర్వత్రా గుర్తింపు ఉన్నది. అందుకు ఆ సంస్థ స్వభావమూ, నిర్మాణ విలక్షణతతో పాటు సర్ సంఘ్‌చాలక్‌గా భగవత్ సర్వోన్నత ప్రాధాన్యమే కారణం. భగవత్‌కు సంఘ్‌లో తిరుగులేని అధికారమున్నదని అందరూ విశ్వసిస్తారు. కనుక ఆయన ఉపన్యాసాలను, ముఖ్యంగా ఇటీవలి కాలంలో అందరూ గంభీరంగా ఆలకిస్తున్నారు.

భగవత్ ప్రసంగంలోని మిగతా అంశాలన్నీ మోదీ తరహా ఉపన్యాస ధోరణిలో ఉన్నాయి: భారత్ ఎలా శక్తిమంతమైన జాతిగా ఎదిగింది, మన విశ్వ సౌభ్రాతృత్వ ఆదర్శాన్ని ప్రపంచం ఎలా అంగీకరించింది, భారత్ పేరు ప్రతిష్ఠలు, ప్రభావ ప్రాబల్యాలు అంతర్జాతీయంగా నిరంతరం ఎలా పెరుగుతున్నాయో భగవత్ ప్రస్తావించారు. మరిన్ని విషయాలు కూడా భగవత్ పేర్కొన్నారు. భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయని, ఉదారవాద దేశాలుగా పేరు పొందిన పాశ్చాత్య రాజ్యాలు ఇతర దేశాలపై దాడి చేసేందుకు, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను చట్టవిరుద్ధంగా లేదా హింసాత్మక మార్గాలలో కూలగొట్టేందుకు వెనుకాడడం లేదని, అబద్ధాల ఆధారంగా భారత్ యశోవైభవాన్ని కళంకితం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నాయని భగవత్ అన్నారు. తన తీవ్ర ఆరోపణలకు భగవత్ ఎలాంటి సాక్ష్యాధారాలు చూపలేదు. బంగ్లాదేశ్ గురించి ప్రస్తావిస్తూ ఆ దేశంలో హిందువులపై నిష్కారణంగా క్రూర దాడులు చేస్తున్నారని ఆయన అన్నారు. హిందువులతో సహా అన్ని మైనారిటీ మత వర్గాల భద్రత ప్రమాదంలో పడిందని ఆయన అన్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమ చొరబాట్లు పెరుగుతున్న పర్యవసానంగా జనాభాపరమైన అసమతౌల్యతలు ఏర్పడుతున్నాయని అన్నారు. ఉపన్యాసం ముగింపులో మోదీ మాదిరిగానే భగవత్ కూడా ఇలా అన్నారు: 'అసంఘటితంగా ఉండడం వల్ల బలహీనపడతామని, దుష్టుల దాడులు, దౌర్జన్యాలకు గురికావలసి వస్తుందనే పాఠాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులు అందరూ నేర్చుకోవాలి'. ఆధునిక రాజకీయ పరిభాషను ఉపయోగించడంలో ఆరెస్సెస్ నైపుణ్యం సాధించినట్టు భగవత్ ఉపన్యాసం విశదం చేసింది. డీప్ స్టేట్, కల్చరల్ మార్క్సిస్ట్, ఫాల్ట్ లైన్స్, ఆల్టర్‌నేటివ్ పాలిటిక్స్ మొదలైన మాటలు, భావనలను ఆయన ఉదారంగా వాడారు. 'అర్బన్ నక్సల్స్', 'తుక్డే తుక్డే గ్యాంగ్' అనే మాటలను ఆయన ఎందుకనో విడిచిపెట్టారు.

మొత్తం మీద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ తమ విభేదాలు తొలగించుకుని కలసికట్టుగా ముందుకు సాగేందుకు సంకల్పించుకున్నట్టు కనిపిస్తుంది. నరేంద్ర మోదీ ప్రకటనలు, చర్యలను ఆక్షేపించి ఆయనను నిగ్రహించేవారు ఎవరూ లేకపోతే జరిగేదేమిటి? ఆయన తన అధికారాన్ని మరింత విచక్షణారహితంగా ఉపయోగించేందుకు, ప్రతిపక్షాలను ఛిన్నాభిన్నం చేసేందుకు; ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అసమానతలు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, సామాజిక అణచివేత, మతతత్వ ఘర్షణలు, అన్యాయాలకు దారితీసిన తన విధానాలను మరింత ధైర్యంగా అమలుపరిచేందుకు ఆయన సాహసిస్తారు. గత పదేళ్ల మోదీ పాలనను మరింత తీవ్రస్థాయిలో చవిచూసేందుకు సర్వసన్నధంగా ఉండండి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

'గంధర్వ' లోక మలయమారుతాలు


వృత్తిపరమైన వాగుడుకాయ (సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా లాభదాయమైన ఔద్యోగిక వ్యవహారం)కు ఎదురయ్యే సంకటాలలో ఒకటి ఉపన్యాసాన్ని వెలువరించిన అనంతరం స్వీకరించే కానుకలు. ఈ కానుకలు చాలా బరువుగా ఉండడం కద్దు. అయితే అవి చాలవరకు నిరుపయోగకరమైనవి. ఉదాహరణకు అతిథేయి సంస్థ పేరు, లోగో ముద్రించి ఉన్న ఫలకాలు. అప్పుడప్పుడు పుష్పగుచ్ఛం మొదలైన సౌందర్యాత్మక కానుకలు లభిస్తాయి. అయితే ఉపన్యాసం వెలువరించింది బెంగళూరు కాక ఇతర ప్రదేశాలలో అయితే ఆ పువ్వులు ఇంటికి రాకముందే వాడిపోతాయి.

మూడు దశాబ్దాలుగా వివిధ వేదికలపై ఉపన్యాసాలు వెలువరిస్తున్న నాకు చాలా అరుదుగా లభించిన ఒక విలువైన, నా మనస్సుకు అమితంగా నచ్చిన కానుక నేను చదువుకున్న ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి లభించింది. 2000 సంవత్సరం నాటి సందర్భమది. ఏ విషయంపై ఉపన్యసించానో నాకు ఇప్పుడు గుర్తులేదు. అయితే ఉపన్యాసం అనంతరం ఆతిథేయి నుంచి లభించిన కానుక ఏమిటో ఇప్పటికీ నాకు బాగా గుర్తు ఉన్నది. ఆ కానుక ఇప్పటికీ నావద్ద భద్రంగా ఉన్నది. అది కుమార్ గంధర్వ సంగీతపు ఎనిమిది వాల్యూమ్‌ల సీడీ సెట్. ఆ కానుకను ఆ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అనిత రామ్‌పాల్ స్వయంగా ఎంపిక చేశారు. 1970ల్లో ఆమె, నేను ఢిల్లీ వర్సిటీ విద్యార్థులం. అప్పుడప్పుడు తన బాయ్‌ఫ్రెండ్ (ఆ తరువాత భర్త) అయిన భౌతిక శాస్త్రవేత్త వినోద్ రైనాతో కలిసి సంగీత కచేరీలకు నేను హాజరవుతుండడం ఆమెకు బాగా తెలుసు.

అప్పట్లో మేము వెళ్లిన గాన కచేరీలలో ఒకటి కుమార్ గంధర్వది. ఆయన తన భార్య వసుంధర కొమ్కలితో కలిసి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు మండి హౌస్ సమీపంలోని ఫిక్కి ఆడిటోరియంలో ఆ సంగీత కచేరి జరిగినట్టు నాకు గుర్తు. దాదాపు రెండు గంటలపాటు కుమార్ గంధర్వ స్వరకల్పన చేసిన భజన్‌లు, జానపద గేయాలను ఆ భార్యాభర్తలు మధురంగా గానం చేశారు. అద్భుతం, సంపూర్ణంగా అద్భుతం ఆ వీనుల విందు. ఆడిటోరియం చివరివరుసలో కూర్చున్నప్పటికీ కుమార్ గంధర్వ లోకోత్తర గాన మాధుర్యం నన్ను బాగా పరవశుడిని చేసింది. ఆ పరవశత్వం ఎన్నటికీ మరువలేనిది.

అనితా రామ్‌పాల్ నాకు కానుకగా ఇచ్చిన సీడీలలో ఆ రోజు కుమార్ గంధర్వ గానం చేసిన భజన్‌లు మరికొన్ని ఇతర కృతులు ఉన్నాయి. మనోహరమైన జోడ్ రాగాల గానం కూడా వాటిలో ఉన్నది. కవితాత్మక హమీర్, గ్రాండ్ శంకర రాగాలలో గానం చేసిన ఖయాల్స్ కూడా ఉన్నాయి. కుమార్ గంధర్వ రాగ నంద్‌లో అద్వితీయంగా గానం చేసిన రాజన్ అబ్కో ఆ రె మొదలైన బండిష్‌లూ వాటిలో ఉన్నాయి. ఇప్పుడు చాలా అరుదుగా విన్పించే పత్మాంజరి రాగంలో గానం చేసిన 15 నిమిషాల ఖయాల్ నొకదాన్ని ప్రత్యేకంగా మళ్లీ మళ్లీ వింటుంటాను.

నాకు కానుకగా లభించిన ఆ సీడీలను ఒక దశాబ్దం పాటు ఇంటి వద్ద పదే పదే వింటుండేవాణ్ణి. 2010లో కాబోలు ఐ పాడ్‌ను కొనుక్కున్న తరువాత వాటిని ఆ అధునాతన సాధనంలో భద్రపరిచాను. సుదూర విమాన ప్రయాణాలలో వాటిని వింటూ సుఖంగా విహరిస్తుంటాను. ఆ సీడీలలో సుప్రసిద్ధ నిర్గుణ్ భజన్‌లు ఉన్నప్పటికీ కుమార్ గంధర్వ స్వయంగా స్వరకల్పన చేయనప్పటికీ ఆయనకు అజరామర కీర్తిని సమకూర్చిన జమునా కినారే మోరాగావ్ వాటిలో లేదు.



కుమార్ గంధర్వ గాన శ్రవణానందంలో ఓలలాడుతూ నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. అజరామరమైన ఆయన సంగీతం నా అంతిమ క్షణాల దాకా నాతో సహవాసం చేస్తుంది. నేను ఈ భవబంధాల నుంచి విముక్తమై సుదూర తీరాలకు పయనమయినప్పుడు దయాశీలుడు అయిన స్నేహితుడో లేదా ప్రేమాస్పదుడయిన కుటుంబ సభ్యుడో, కుమార్ గంధర్వ లోకోత్తర మాధుర్యంతో గానం చేసిన జమునా కినారే మోరాగావ్ నాదాలు నా వీనుల్లో ప్రతిధ్వనించేలా శ్రద్ధ చూపగలరని ఆశిస్తున్నాను, చూపాలని ఆకాంక్షిస్తున్నాను.

కుమార్ గంధర్వ గానంతో నాకు ఆత్మీయాను బంధం ఉన్నది. అయితే జమునా కినారేతో నా అనుబంధం ప్రత్యేకమైనది, వ్యక్తిగతమైనది. డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో నేను పుట్టి పెరిగాను. నా తల్లిదండ్రుల గృహం ఆ సంస్థ ప్రాంగణం ఉత్తర దిక్కున చివరలో ఒక కొండపై టాన్స్ అనే నదీ దృశ్యాలు స్పష్టంగా కనిపించే చోట ఉన్నది. ఆ నది పశ్చిమ దిక్కుగా సాగి అసన్‌తో సంగమించి ఆ తరువాత మరింత పశ్చిమంగా మరికొన్ని మైళ్లు ప్రవహించి యమునా నదిలో కలుస్తుంది. క్షమార్హమైన అతిశయోక్తితో జమునా కినారే మోరాగావ్ పాట నా బాల్యంలో అంతర్భాగంగా ఉన్న టాన్స్ నది గురించేనని చెప్పుకోవడానికి సందేహించను. యమున ఉపనది తీరాన నేను పుట్టిన ప్రదేశం ఉన్నది. సెలవు రోజుల్లో మా కుటుంబం వ్యాహ్యాళికై ఆ నదీతీరానికి వెళ్లేది. ఆ నది కొండల నుంచి మైదాన ప్రాంతంలోకి దిగే ప్రదేశంలో పావోంట సాహిబ్ అనే పవిత్ర సిక్కు మత ఆరాధనా మందిరం ఉండేది. ఆ గురుద్వారా నా బాల్య స్మృతులలో ప్రధానమైనది.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

కుమార్ గంధర్వ గానం చేసిన జమునా కినారే యు ట్యూబ్‌లో అందరికీ అందుబాటులో ఉన్నది. నేను ఏదైనా క్లిష్టమైన సమావేశాలకు వెళ్లే ముందు ఆ పాటను తప్పక వింటాను. అప్పుడప్పుడు కుమార్ గంధర్వ కుమారుడు ముకుల్ శివపుత్ర గానం చేసిన జమునా కినారేను కూడా వింటుంటాను. గంభీరమైన గానమది. ముకుల్ జై జయవంతి, కేదార్, ఖమాజ్ రాగాల ఆలాపన కూడా నాకు బాగా ఇష్టం.

ఈ శరదృతువు ఆరంభంలో జమునా కినారేను ప్రత్యక్షంగా విన్నాను. తండ్రి ప్రతిభను పుణికిపుచ్చుకున్న కుమార్ గంధర్వ కుమార్తె కలాపిని కొమ్కలి గాన మాధురి అది. తండ్రి శత జయంత్యుత్సవాలలో భాగంగా బెంగళూరులో ఆమె పాట కచేరి జరిగింది. ఆ రాగ సుధా స్రవంతికి ముందు, జీవిత వివిధ దశలలోను, విభిన్న సందర్భాలలోను కుమార్ గంధర్వ ఛాయా చిత్రాల సె□ షో నిర్వహించారు. నన్ను అమితంగా ఆకట్టుకున్న, భావోద్వేగానికి లోనుచేసిన ఛాయా చిత్రం 1991లో ధార్వాడ్‌లో మల్లికార్జున్ మన్సూర్‌తో కుమార్ జీ ఉన్న బొమ్మ.

బాంబే కర్ణాటకగా పిలవబడే ప్రాంతం (ఈ సీమ సాంస్కృతిక రాజధాని ధార్వాడ్)లో ఒక దశాబ్దంన్నర కాలంలో ఒకరి తరువాత ఒకరు పుట్టిన ఐదుగురు మహాగాయకులలో మన్సూర్ ఒకరు. ఆయనే అందరి కంటే పెద్దవాడు. ఆ సంగీత ప్రతిభామూర్తుల బృందంలో అందరికంటే చిన్నవాడు కుమార్ గంధర్వ. మిగతా ముగ్గురు గంగూబాయి హంగల్, భీమ్‌సేన్ జోషి, బసవరాజ్ రాజగురు. ఒకసారి కుమార్‌జీ ముందుగా తెలుపకుండా మన్సూర్ గృహానికి వెళ్లారు. సంగీతంలో తన సమస్కంధుడు అయిన కుమార్ గంధర్వ తన 'పెద్దన్న'ను చివరిసారి చూడడానికి వచ్చి ఉంటాడని మల్లికార్జున్‌జీ భావించారు. కుమార్‌జీ కంటే మన్సూర్ వయస్సులో చాలా పెద్దవాడు. పైగా నిరంతరాయంగా సిగరెట్‌పై సిగరెట్ కాల్చే ధూమపాన ప్రియుడు. ఆ మహాగాయకుల మధ్య ఈ చివరి సమావేశ మనంతరం కొద్ది రోజులకే కుమార్ గంధర్వ మరణించారు. మల్లికార్జున్ మన్సూర్ పరితాపానికి అంతులేకపోయింది. ఆయన్ను ఊరడించడం ఎవరికీ శక్యం కాలేదు. నా తమ్ముడు నా కంటే ముందే వెళ్లిపోయాడు అని మన్సూర్ రోదించారు (ఆ తరువాత కొద్ది నెలలకే మన్సూర్ కూడా మరణించారు).

కలాపిని కొమ్కలి తన గాన కచేరీని తండ్రి భీమ్ పలాసి రాగంలో స్వరకల్పన చేసిన మూడు కృతులతో ఆరంభించారు. భీమ్ పలాసి ఒక గంభీర, వైదుష్య వైభవోపేత రాగం. కలాపిని గానం ఆ రాగ గుణ విశేషాలకు సముచిత ఉదాత్తత కల్పించింది. ఆ తరువాత, తండ్రి కుమార్ గంధర్వ స్వయంగా సృష్టించిన జోడ్ రాగాలలో ఒకటైన శ్రీ కల్యాణ్‌లో కొన్ని కృతులను గానం చేశారు. ఆ తరువాత మాల్వా జానపద గేయాన్ని ఆమె ఆలాపించారు. బాంబేలో సంగీత శిక్షణ పొందిన కన్నడిగుడు అయిన కుమార్ గంధర్వ ఆరోగ్య కారణాల రీత్యా కొన్ని సంవత్సరాల పాటు మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో నివసించారు.

కలాపిని గాన మాధురిని ఆస్వాదిస్తూ కచేరి ముగిసే లోగా ఆమె జమునా కినారే మోరాగావ్‌ను కూడా ఆలపిస్తే బాగుండునని అనిపించింది. ఆ మధుర గీతాన్ని కుమార్ గంధర్వ తనయ నోట వినాలనే ఉత్సుకత నాలో కలిగింది. ఇదే నేను నా యవ్వన కాలంలో అయితే నా 'ఫర్మాయిష్' (అభ్యర్థన)ను పెద్దగా అరుస్తూ చేసేవాణ్ణి లేదా ఒక కాగితం మీద రాసి పంపేవాణ్ణి. అయితే ఇప్పుడు ఇంత వయస్సులో అలా చేయడానికి వెనుకాడాను. పెద్దరికంతో వ్యవహరించాలి కదా. కనుక మౌనంగా ఉండిపోయాను. అయితే కలాపిని, తన తండ్రి కుమార గంధర్వ పేరు ప్రతిష్ఠలతో ముడివడి ఉన్న ఆ సుప్రసిద్ధ గీతాలాపనతో తన గాన కచేరిని ముగించారు (నేనే కాదు, అక్కడ ఉన్న శ్రోతలలో అత్యధికులు ఆ పాటను వినాలని ఆరాటపడుతున్నారనే విషయం బహుశా ఆమె గ్రహించే ఉంటారు).

జమునా కినారే మోరాగావ్‌ను తన తండ్రి శైలిలో ఆమె గొప్ప ఓజస్సుతో గానం చేశారు. ఆమె పాడుతుండగా అరమోడ్పు కళ్లతో కూచుండిపోయాను. నా మనస్సు నా బాల్యంలోకి పరుగెత్తింది. నాకు చిరపరిచితమైన అడవులు, యమునా తీర సుందర ప్రాంతాలు, పొడవైన, విశాల బాటలు మదిలో మెరిసాయి. మరుసటి రోజు ఉదయం యు ట్యూబ్‌కు వెళ్లాను. 'కుమార్ గంధర్వ/ వసుంధర కొమ్కలి భజన్ కన్సర్ట్ న్యూ ఢిల్లీ 1978' అని టైప్ చేశాను. ఆశ్చర్యకరంగా ఆ లింక్ లభించింది. ఆనాడు నేను వెళ్లిన కచేరీనే అది. 110 నిమిషాల పాటు సాగిన గాన ఉత్సవమది. అందులో 19 పాటలు ఉన్నాయి. దిగ్విజయ్ పాటిల్ అనే సంగీత రసికుడు సమకూర్చిన లింక్ అది. ఆ కచేరి 20 ఆగస్టు 1978న జరిగిందని కూడా ఆ లింక్ పేర్కొంది. అది కచ్చితమైన తేదీ. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా నా చివరి సంవత్సరం మొదటి నెలలో ఆ కచేరి జరిగింది. ఈ లింక్‌తో పాటు కుమార్ గంధర్వ ఇతర రికార్డింగ్‌లు కూడా నేను తరచు యు ట్యూబ్‌లో వింటుంటాను. ప్రొఫెసర్ అనితా రామ్‌పాల్ నాకు కానుకగా ఇచ్చిన ఎనిమిది సీడీలు ఇప్పటికీ నా ఐ పాడ్ నుంచి నన్ను ఆనందపరుస్తున్నాయి.

కుమార్ గంధర్వ గాన శ్రవణానందంలో ఓలలాడుతూ నేను వృద్ధాప్యంలోకి ప్రవేశించాను. అజరామరమైన ఆయన సంగీతం నా అంతిమ క్షణాల దాకా నాతో సహవాసం చేస్తుంది. నేను ఈ భవబంధాల నుంచి విముక్తమై సుదూర తీరాలకు పయనమయినప్పుడు దయాశీలుడు అయిన స్నేహితుడో లేదా ప్రేమాస్పదుడయిన కుటుంబ సభ్యుడో, కుమార్ గంధర్వ లోకోత్తర మాధుర్యంతో గానం చేసిన జమునా కినారే మోరాగావ్ నాదాలు నా వీనుల్లో ప్రతిధ్వనించేలా శ్రద్ధ చూపగలరని ఆశిస్తున్నాను, చూపాలని ఆకాంక్షిస్తున్నాను.

తిరుమలలో టైమ్‌స్లాట్‌ను తప్పక పాటించండి

తిరుపతి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి ఆగస్టు 16న వెళ్లాను. మర్నాడు ఉదయం 11 గంటలకు టైమ్ స్లాట్ టోకెన్ దొరికింది. ముందుగానే భక్తులను లోపలికి అనుమతించమని కొత్త ఈవో ఆదేశాలు ఉన్నందున 10.30కు వెడితే అనుమతించారు. 11 గంటల తరువాత టైమ్ స్లాట్ ఉన్నవారిని అనుమతించలేదు. లోపలికి వెళ్లిన దగ్గర నుంచి క్యూలైన్‌ను అనేకసార్లు ఆపారు. ఎందుకో తెలియదు. 11.45కి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో కూర్చోబెట్టారు. తరువాత అన్నప్రసాదం పంపిణీ చేశారు. 1.30కి దర్శనానికి వదిలారు. 2.45కి స్వామివారి దర్శనం అయింది. తిరిగి సెప్టెంబర్ 16న మళ్లీ దర్శనానికి వెళ్లాను. 11 గంటలకు టైమ్ స్లాట్, 10 గంటలకు ఎటిసి క్యూ లైన్ వద్దకు చేరుకున్నాను. ఈసారి 11.30 వరకు అనుమతించలేదు. తరువాత టైమ్ స్లాట్ చెక్ చేయకుండా అందరినీ అనుమతించారు. దీంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఒక్క నెలలోనే ఇలా నిబంధనలకు ఎందుకు తిలోదకాలు ఇచ్చారో తెలియదు. దర్శనం యథాప్రకారం మధ్యాహ్నం 2.45 గంటలకే అయింది. ఆగస్టులో వెళ్లినప్పుడు లాకర్ ఇచ్చారు. ఎలాంటి ప్రశ్నలూ వేయలేదు. సెప్టెంబర్‌లో వెళ్లినప్పుడు గట్టిగా మాట్లాడితే గాని లాకర్ ఇవ్వలేదు. చివరికి విసుక్కుంటూ ఇచ్చారు. అధికారులెంత మారినా కింద పనిచేసే ఉద్యోగులను మార్చలేకపోతున్నారు. వారిలో రాను రాను సేవాభావం తగ్గిపోతోంది.

టైమ్ స్లాట్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. ఒక గంట ముందో, అర గంట ముందో మాత్రమే క్యూలైన్‌లోకి వదలాలి. అలాగే 11, 12 గంటలు టైమ్ స్లాట్ వాళ్లకి అన్నప్రసాదం లైన్‌లో పంపిణీ చేయకుండా వారికి త్వరితగతిన దర్శనం చేయించగలిగితే, వారు తరిగొండ వెంగమాంబ కేంద్రంలో అన్నప్రసాదం స్వీకరిస్తారు.

డిస్‌ప్లే బోర్డుల గురించి ఈఓ పెద్ద పెద్ద ప్రకటనలు చేశారు. ఎటిసి టైమ్ స్లాట్ ఎంట్రీ వద్ద ఒక డిస్‌ప్లే బోర్డు పెట్టారు. కాని దానిలో ఎలాంటి వివరణా లేదు. శ్రీవారిమెట్టుకు వెళ్లడానికి టీటీడీ వారు ఫ్రీ బస్‌లు నడుపుతున్నారు. అలాగే ఆర్టీసీ వారు కూడా నడుపుతున్నారు. ఇవి ఎప్పుడు ఎక్కడి నుండి బయలుదేరుతాయో ఎలాంటి డిస్‌ప్లే బోర్డులూ లేవు. రైల్వేస్టేషన్ వద్ద ఇలాంటి బోర్డులు ఏర్పాటుచేయాలి. అలాగే శ్రీవారిమెట్టు వద్ద టైమ్ స్లాట్ టికెట్స్ ఇచ్చే కౌంటర్‌ను మెట్లు మొదలయ్యే దగ్గర ఏర్పాటు చేశారు. ఇక్కడ విపరీతమైన రద్దీ ఉంటోంది. దానిని పూర్వపు స్థానంలో అంటే సగం మెట్ల వద్ద ఏర్పాటు చేసి టికెట్ ఇష్యూకు సంబంధించిన వివరాల డిస్‌ప్లే బోర్డును మెట్లు మొదలయ్యే దగ్గర ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అలాగే శ్రీవారిమెట్టుకు వెళ్లడానికి రైల్వేస్టేషన్ నుంచి బస్సులు నడిపితే బాగుంటుంది. ఇక, తిరుమలలో ఫ్రీ బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ ఆగుతాయో కూడా డిస్‌ప్లే బోర్డులు పెడితే బాగుంటుంది. ఈ బస్సులలో కండక్టర్లు ఎప్పుడూ భక్తుల మీద విసుగునే ప్రదర్శిస్తారు.

– చదలవాడ శ్రీరంగప్రసాద్, హైదరాబాద్

మ్యూజియంల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ఉమ్మడి రాష్ట్రంలో మ్యూజియంల అభివృద్ధి అంతా తెలంగాణ ప్రాంతంలోనే ఎక్కువగా జరిగింది. ఆంధ్ర ప్రాంత సాంస్కృతిక అభివృద్ధిలో భాగంగా మ్యూజియంల పురోభివృద్ధి ద్వారా, ఆంధ్రులకు గత వైభవాన్ని భావితరాలకు తెలిపే గురుతర బాధ్యతను గత పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన ప్రాచీన కళాఖండాలు, వ్రాతప్రతులు, తెలంగాణ మ్యూజియం ఆర్ట్ గ్యాలరీలలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శిల్పాలు, వివిధ కాలాల నాటి శాసనాలు ఇంకా ప్రాచీన ఆంధ్రదేశ వారసత్వ సంపదను విభజన చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. దీనికి ముందుగా ఈ ప్రాచీన కళాఖండాలను భద్రపరచడానికి ఆధునిక హంగులతో, నూతన సాంకేతికత కలిగిన మ్యూజియం ఏర్పాటు దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి.

మన రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక మూలలో ప్రాచీన ఆనవాళ్లయిన శిల్పకళాఖండాలు, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు లభ్యమవుతున్నా, వాటిని భద్రపరచి ఒకచోటుకు చేర్చడానికి నిధులు లేక రాష్ట్ర పురావస్తు విభాగం వాటి మీద శ్రద్ధ పెట్టడం లేదు. మన రాష్ట్రంలో 13 మ్యూజియంలు అరకొర వసతులతో, సిబ్బందితో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాఖ అలాగే పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా రాష్ట్రంలోని మ్యూజియంలలో వివిధ రకాలైన కార్యశాలలు, సెమినార్లు, ఉచిత ప్రదర్శనశాలలు, ఫోటో ఎగ్జిబిషన్లు నిర్వహించాలి. అలాగే పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు, అతిథి ఉపన్యాసాలు, ఆయా ప్రత్యేక దినాలలో వివిధ రకాల కార్యక్రమాలను ప్రోత్సహించాలి. ఇంకా స్థానిక ప్రజల ఆచార వ్యవహారాలు, ప్రభుత్వం గుర్తించిన సంస్కృతీ సంప్రదాయకమైన కొన్ని వేడుకలను కూడా క్రమం తప్పకుండా నిర్వహించాలి. గత ప్రభుత్వం ఈ కార్యక్రమాలను అటకెక్కించింది.

ప్రస్తుతం విజయవాడలోని బాపూ మ్యూజియం, విశాఖ మ్యూజియం, అరకులోని గిరిజన మ్యూజియం, తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీ వేంకటేశ్వర మ్యూజియం మొదలైనవి నూతన సాంకేతికత ద్వారా ఆంధ్రుల గత వైభవ ప్రాచీనతను తెలిపే ఆయా విశేషాలతో శిక్షకులైన సాంస్కృతిక గైడ్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం మరింత శ్రద్ధ తీసుకోవాలి. మానవ వనరుల అభివృద్ధి, పురావస్తు, దేవాదాయ, యువజనుల సర్వీస్ వంటి శాఖలను సమన్వయం చేసుకొని రాష్ట్ర పర్యాటక శాఖ మ్యూజియాల అభివృద్ధికి తన వంతు ప్రోత్సాహాన్ని అందించాలి. అంతేకాకుండా రాష్ట్రానికి వివిధ జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా కృషి చేయాలి. విశాఖపట్నంలో సబ్ మెరైన్ మ్యూజియంను, కళింగ ఆంధ్ర చారిత్రక వైభవాన్ని భావితరాలకు తెలియజేయడం కోసం విశాఖ మ్యూజియం నిర్వహణకు అవసరమైన నిధులను కేటాయించి, సరికొత్త హంగులతో ఆధునీకరించి, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి. నూతన జిల్లాలలో కూడా మ్యూజియాలను స్థాపించడం వల్ల ఆ ప్రాంత గత చరిత్ర విశిష్టతను యువతకు, భావితరాలకు తెలియజేయడం సులభమవుతుంది. రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధిని పెంపొందించడంలో పర్యాటక, సాంస్కృతిక రంగం పాత్ర మరువలేనిది. ఈ రంగాల ద్వారా యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్రంలోని అన్ని మ్యూజియాలను ఆధునీకరించాలి. స్థానిక చారిత్రక అవశేషాలను, గత వైభవ చిహ్నాలను సేకరించి నూతనంగా ఏర్పడిన జిల్లా క్రేంద్రాలలో మ్యూజియాలు నెలకొల్పి ప్రజలలో సాహిత్య సాంస్కృతిక స్పృహను పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేయాలని చరిత్రకారులు, పరిశోధకులు, విద్యార్థులు, సాహితీవేత్తలు, పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తుందని ఆశిద్దాం.

– డాక్టర్ గోవిందు సురేంద్ర, స్థపతి, చరిత్ర అధ్యాపకులు

పీడితుల పిల్లనగ్రోవి అరుణోదయ నాగన్న

ఒక గాయకుడు ఎందుకు పాడతాడు? పాటలు ప్రత్యేకంగా ఒక గొంతుని కోరుకుంటాయా? పాటలు ఎలా పలుకుతాయి? ఎవరు రాసినా, కన్నతల్లి గర్భంలా ఎవరు మోసి జన్మనిచ్చినా, పాట పెరిగి పెద్దదై జీవించేది గాయకుడి గొంతులోనే. పసితనాన్ని, బాల్యాన్ని, యవ్వనాన్ని, వృద్ధాప్యాన్ని, మరణాన్ని, ఆపై అమరత్వాన్ని పలికించేది ఆ గొంతు తడితోనే.




నాగన్న గాయకుడు. అరుణోదయ పాటలు కోరుకున్న ఆత్మీయ గొంతుక. నాగన్న గొంతు పీడితుల పిల్లన గ్రోవి. నాగన్న ఎన్నో పాటలని ప్రాణప్రదంగా పలికించాడు. లాలిగా, జోలగా, లయగా, గోదావరి లోయగా, పోరుగా, నక్సల్బరీ హోరుగా, ఎరుపు దిక్కుగా, నెత్తుటి జెండాగా, అడవి మల్లెగా, వేకువజాము పల్లెగా, అరుణోదయ బాటగా పాడుతూనే ఉన్నాడు.

పాటలు ఎన్నో కదా! ఒక గాయకుడు ఎన్నిసార్లు తన కోసం పాడుకుంటాడు? తన కోసం కొన్ని, జనం కోసం కొన్ని, తన జన కోసం మరికొన్ని పాడుకుంటాడా? ఏమో! తెలియదు. కాని, పాట ఏదైనా గాయకుడి గొంతులో ఒక దృశ్యం ఉంటుంది. పక్షిలా, పక్షుల గుంపుల్ని మోస్తున్న మహా వృక్షంలా గాయకుడు కదులుతూ, మెదులుతూ కనిపిస్తాడు. ఒంటరిగా, తుంటరిగా, ముసి ముసిగా, మసి మసిగా, కన్నీళ్ళలా, కాలిపోతున్నట్టు, గాలి ఆగి పోతున్నట్టు ఉంటాడు. దగ్గరగా వస్తాడు. కళ్ళ మీదికొచ్చి, మసకబార్చి రెప్పపాటులో దూరమవుతాడు. మనసులో భావాలని, భావోద్వేగాలని తాకి కొత్త సముద్రాల్ని సృష్టిస్తాడు. సప్త స్వరాల ఆరోహణ–అవరోహణల కెరటాలుగా వినిపిస్తాడు.

నాగన్న గాన కెరటం. నాజర్‌లా, కానూరి తాతలా, అరుణోదయ రామారావులా మన మనసులో కూర్చొని గుండెల్ని కెలుకుతుంటాడు. "కొమ్మల్లో రెమ్మల్లో కమ్మంగా పాడేటి నల్లాని ఓ కోయిలమ్మ, నల్ల నల్లాని నా కోయిలమ్మ" అంటూ వెంటపడతాడు. పాట వెంట పాట. నాగన్నది పాటల జీవితం. నాగన్న గొంతు పాటల ప్రవాహం! ఆ ప్రవాహం అడవిలా చిక్కగా ఉంటుంది. అమరత్వంలా రమణీయంగా ఉంటుంది. నాగన్నకు ఆయన గొంతు ఒక ఆభరణం. రాజకీయ విశ్వాసం, నిర్మాణ నిబద్ధత ఆయనకు అవార్డులు. విప్లవ ఆరాటం, పోరాటం ఆయన వ్యక్తిత్వం. నాగన్న అస్తిత్వానికి పునాది ఆయన తోడబుట్టిన మధుర స్వరం. పీడిత ప్రజల విముక్తి ఆయన స్వప్నం. ఆ స్వప్నాన్ని సజీవంగా ఆలపించే అరుణోదయ నాగన్న జీవితం ధన్యం.

– లెల్లే సురేష్

(నేటి సాయంత్రం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో అరుణోదయ నాగన్నకు సుద్దాల హనుమంతు జాతీయ పురస్కార సత్కార సభ)



నేడు తడిచెత్త నిర్వహణపై సాంకేతిక ప్రదర్శన

బల్దియా ఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి




వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) వారి సహకారంతో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం ములుగురోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో తడిచెత్త నిర్వహణపై సాంకేతిక ప్రదర్శన నిర్వహిం చనున్నట్టు బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం బల్దియా కార్యాల యంలో విలేకరులతో మాట్లాడారు. బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై రాష్ట్రాల నుంచి పది కంపె నీలు తడి చెత్త నిర్వాహణ కార్యక్రమంలో పాల్గొంటున్నాయన్నారు. చెత్తను ఎరువుగా మార్చే పద్ధతులపై ఇక్కడ ప్రయోగాత్మకంగా వివరిస్తారన్నారు. బల్క్ వేస్ట్ జనరేట్ అవుతున్న హోటళ్లు, హాస్టల్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి అవగాహన కల్పిస్తామన్నారు. నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను వేస్టేజ్ కాకుండా ఎరువుగా మార్చే మెళకువలు చెప్పడం జరుగుతుందన్నారు. నగరంలోని ప్రజలు కూడా హాజరు కావచ్చని వెల్లడించారు. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు పాల్గొంటారని రాజారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో శానిటేషన్ వి భాగం అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న యువకుడు
- భార్యాభర్తల మధ్య గొడవలు.. పోలీసులు న్యాయం చేయడం లేదని మనస్తాపం
- పాలకుర్తిలో ఘటన

6

- ఆర్థిక ఇబ్బందులకు తోడు వి ద్యార్థుల ఆందోళనలతో కేయూ సతమతం
- కొత్త వీసీ ప్రతాప్‌రెడ్డికి సమస్యల స్వాగతం
- ప్రక్షాళనపై అందరిలోనూ ఆశలు



ఎన్నో వివాదాలు మరెన్నో సమస్యలు

వివరాలు : 8 లో..

రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరున్న వరంగల్ కాకతీయ యూనివర్సిటీని ప్రస్తుతం ఎన్నో వివాదాలు చుట్టుముట్టాయి. ఎన్నడూ లేని విధంగా కొన్నేళ్లుగా అనేక సమస్యలు తలెత్తున్నాయి. ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాక.. వచ్చిన నిధులు సక్రమంగా వినియోగం అవక అప్రదిష్టను మూటగట్టుకుంటోంది. వీటికి తోడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు వేధిస్తున్నాయి. ఉద్యోగులకు జీతాలు కూడా సరైన సమయంలో ఇవ్వలేదని దుస్థితి నెలకొంది. ఇదంతా ఒక ఎత్తయితే వర్సిటీకి ఇప్పటి వరకు వైస్‌చాన్స్‌లర్లుగా పనిచేసిన ప్రొఫెసర్లు తీవ్ర వివాదాల్లో ఇరుక్కోవడం మరో ఎత్తు. ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిన సాగుతున్న వర్సిటీ నిర్వహణ కీర్తిప్రతిష్టలను దిగజారుస్తోంది. ఇక కంచే చేనుమేసిన చందంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యులను సైతం పక్కాదారి పట్టించి ఉద్యోగులే వర్సిటీ భూముల కబ్జాలకు దిగారు. దీంతోపాటు పరీక్షల విభాగంలో అవకతవకలు, కొత్త కోర్సులరాక, ఉన్న కోర్సుల అప్‌గ్రేడేషన్, ప్రొఫెసర్ల కొరత, కళాశాలలు, హాస్టళ్లలో సమస్యల దరువు తదితర సమస్యలు చుట్టుముట్టిన వేళ కొత్త వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆయన హయాంలోనైనా కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన జరగుతుందని అందరూ ఆశిస్తున్నారు.

\- కేయూ క్యాంపస్



కేయూ వీసీగా ప్రతాపరెడ్డి

- 13వ వైస్‌చాన్స్‌లర్‌గా నేడు బాధ్యతల స్వీకరణ
- మరో రెండు వర్సిటీలకు వీసీలుగా కేయూ ప్రొఫెసర్లు
- తెలంగాణ వర్సిటీకి యాదగిరిరావు, మహాత్మాగాంధీ వీసీగా అల్తాఫ్‌హుస్సేన్

8



మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించాలి

- అక్రమాలకు పాల్పడే డీలర్లపై చర్యలు తీసుకోవాలి
- దిశ సమావేశంలో ఎంపీ బలరాంనాయక్

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రణాళిక ప్రకారం ప్రజల కోసం అమలు చేసే పథకాల గురించి అవగాహన కల్పించడంతో పాటు అవి అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన వారికి ఉన్నతి కింద శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించి జిల్లా లక్ష్యాన్ని సాధించిన అధికారులను అభినందించారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు వెంటనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలన్నారు. సివిల్ సప్లై ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ జరగాలని, బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే రేషన్‌షాపు డీలర్లపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని ఎంపీ ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో పైపులైన్‌లో లీకేజీలు అధికంగా ఉండి నగరవాసులకు కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. నర్సంపేటలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వద్ద యూపీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా వరంగల్ జిల్లాకు లక్షల ఎకరాల్లో సాగు నీరందించనున్న దృష్ట్యా పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

అనంతరం నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ పథకం కింద రూ. 944.67 కోట్ల వ్యయంతో 108 అభివృద్ధి పనులు చేపట్టగా 49 పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగతా 59 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. స్మార్ట్ సిటీ పనుల గడువు జూలై నాటికి ముగుస్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గడువును 2025 మార్చి వరకు పెంచడంపై కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు లేని ప్రభుత్వ పాఠశాలలను రేషనలైజేషన్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్. నాగరాజు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మునిసిపల్ చైర్ పర్సన్లు గుంటి రజిత, అంగోత్ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు సన్నద్ధం కావాలి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో నిర్వహించే గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. గ్రూప్స్ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబరు 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణ కోసం జిల్లాల్లో చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మౌళిక వసతులున్నాయో లేవో పరిశీలించాలని, ఈ ప్రక్రియ ఒక్క రోజులో పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల ధృవీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లాల్లో పరీక్షా పత్రాల, ఇతర ముఖ్యమైన సామాగ్రి భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలను గుర్తించాలన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 83 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 మంది సీనియర్ జిల్లా స్థాయి అధికారులను నియమించడం జరిగిందని, పరీక్షా కేంద్రాలు పరిశీలించి వెంటనే అప్‌లోడ్ చేస్తామన్నారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంజీఎంలో ఊడిపడిన పైకప్పు పెచ్చులు

ఊడిన పై కప్పు పెచ్చులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం ఆస్పత్రిలోని అంకాలజీ విభాగంలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం అంకాలజీ వార్డులోని భవనం పై పెచ్చులు ఒక్కసారిగా ఊడి కింద పడ్డాయి. ఈ సమయంలో రోగులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ వార్డులో పని చేసే సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా, పురాతన కాలం నాటి బిల్డింగ్ కావడంతో పెచ్చులు ఊడి పడ్డాయని సిబ్బంది భావిస్తున్నారు.

నీటి లభ్యతకు సమస్య లేదు

- 'తుపాకుల గూడెం' ఎత్తు తగ్గింపుపై నీటిపారుదలశాఖ డివిజన్-2 ఈఈ జగదీశ్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ములుగు, అక్టోబరు, 18(ఆంధ్రజ్యోతి): తుపాకుల గూడెం బ్యారేజీ ఎత్తు తగ్గింపుతో దేవాదుల ప్రాజెక్టు వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య ఉండదని నీటిపారుదల శాఖ డివిజన్-2 ఈఈ వి.జగదీశ్ స్పష్టం చేశారు. బ్యారేజీలో 80మీటర్ల ఎత్తులో నీటి నిల్వ చేయడం వల్ల ఇచ్చంపల్లి ఆనకట్ట వరకు నీరు విస్తరించి ఉంటుందని, దేవాదుల వద్ద 9మీటర్ల నీరు నిల్వ ఉంటుందని వెల్లడించారు. 'తుపాకులగూడెంపై తకరారు' శీర్షికన ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఈమేరకు లేఖను పంపారు. రూ.2121 కోట్లతో తుపాకులగూడెం బ్యారేజీకి 2017లో అప్పటి ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చిందని, రూ.1624.83 కోట్లకు ఒప్పందం జరగ్గా 83మీటర్ల ఎత్తుతో 59గేట్లతో బ్యారేజీ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. వన్యప్రాణ సంరక్షణ, పర్యావరణ, అటవీశాఖ అనుమతులు తీసుకున్నామని, తెలంగాణ భూభాగంలో ముంపునకు గురవుతున్న భూములకు భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 2021 ఆగస్టు 31న బ్యారేజీ డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి



సమర్పించామని, హైడ్రాలజీ, పవర్, సీఎస్ఎంఆర్ఎస్, ఖర్చు అంచనా శాఖల అనుమతులు కూడా వచ్చాయని వివరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు గురించి ఆరాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపిందని, రెండు రాష్ట్రాల ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ముంపు ప్రాంతాలను అంచనా వేశామని, ఈవిషయంలో ఇరు ప్రభుత్వాల నడుమ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో తుపాకులగూడెం బ్యారేజీలో నీటి నిల్వను 83మీటర్ల నుంచి 80మీటర్లకు తగ్గించడానికి అంగీకరించడం జరిగిందని తెలిపారు. దీంతో ఛత్తీస్‌గఢ్ వైపున భూభాగంలో నీరంతా నదీ గర్భంలోనే నిల్వ ఉంటుందని, భూములు ముంపునకు గురికావని స్పష్టంచేశారు. ఈ క్రమంలో భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని ఈఈ వెల్లడించారు.

నష్కల్ నుంచి హసన్‌పర్తికి రైల్వే బైపాస్‌లైన్

కాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడిజిల్లాలో బైపాస్ రైల్వే ట్రాక్ నిర్మించడానికి రైల్వే శాఖ సిద్ధమైంది. నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు బైపాస్ రైల్వే ట్రాక్‌ను నిర్మించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. ఇందుకు గాను భూమిని సేకరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్. వెంకన్న, హనుమకొండ ఆర్డీవో ఎన్. వెంకటేష్‌లకు కేంద్ర రైల్వే శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ నెల 16 నుంచి భూసేకరణ పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ బైపాస్ రైల్వే లైన్ జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై కరుణాపురం, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి, ధర్మసాగర్, ఉనికిచర్ల, దేవన్నపేట, మడిపల్లి, జయగిరి గ్రామాల మీదుగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ వరకు ఆ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నారు. 24.5.5 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ ట్రాక్‌పై ప్యాసింజర్ రైళ్లకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు ప్రస్తుతానికి కేవలం గూడ్స్ రైళ్లను మాత్రమే ఈ ట్రాక్ మీదుగా నడిపించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

రాయపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు మధ్య దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపర్తిలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులో, కాట్రపెల్లిలో ఐకేపీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా వారు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను రాజులుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. సన్న వడ్లను తెచ్చిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో రాజీపడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఈదుకంటి రవీందర్‌రెడ్డి, మచ్చ రమేష్, కొనుగోలు కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

వరంగల్ జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాలు...

కలెక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యశారద స్పష్టం చేశారు. వానా కాలం 2024-25 సీజన్‌లో 2,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో సన్నరకం 1,61,201, దొడ్డు రకం 78,799 మెట్రిక్‌టన్నుల ధాన్యం రైతులు తెచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు ధాన్యాన్ని కల్లాల వద్దే ఆరబెట్టి కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. తాలు, తప్పా, మట్టి పెడ్డలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ. 2,320, గ్రేడ్ బీ రకం ధాన్యానికి రూ. 2,300 క్వింటా చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం జారీ చేసి జీవో 27ప్రకారం సన్న రకం వడ్లు 33 రకాలున్నాయని, వాటిలో పొడవు 6మి.మీ, కంటే తక్కువ నిష్పత్తి 2.5 మి.మీ కంటే ఎక్కువ, వెడల్పు 2 మి.మీ మించకుండా ఉన్నవాటికి మాత్రమే రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుత అంచనా ప్రకారం 13 రకాల సన్న వడ్లు ఉన్నట్లు అంచనా వేశామని తెలిపారు. అన్నదాతలు ప్రభుత్వం నిబంధనలు పాటించి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదర్శ లా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రం లోని ఆదర్శ లా కళాశాలలో లాసెట్ ఎంట్రెన్స్ సాధించినవారికి స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ప్రతిభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా ఎంట్రెన్స్ సాధించి అర్హత గల అభ్యర్థులు ఈనెల 17 నుంచి 26 వరకు ఆన్‌లైన్ అడ్మిషన్ కోసం అప్లై చేసి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను వేరిఫై చేయించుకొని ప్రిన్సిపాల్ వద్ద రశీదు పొందాలన్నారు.

కాంట్రాక్టు డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి పూరిగుట్ట, పరకాల లో ఉన్న బస్తీ దవఖానాలలో ఖాళీగా ఉన్న రెండు డాక్టర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో రూ.52వేల వేతనంతో నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన డాక్టర్స్ కాలనీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నా రు. ఎంబీబీఎస్ డిగ్రీ కలిగి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టరై 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు.

రాష్ట్ర బ్యాడ్మింటన్ కోచ్‌గా రమేష్ ఎంపిక



వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఈనెల 20 నుంచి 25 వరకు జాతీయ స్థాయిలో నిర్వహిం చనున్న సబ్ జూనియర్స్ అండర్-15, 17 బ్యాడ్మింటన్ పోటీ లలో పాల్గొననున్న తెలంగాణ బ్యాడ్మింటన్ జట్టు తరఫున కోచ్‌గా హనుమకొండకు చెందిన కూరపాటి రమేష్ వ్యవ హరించనున్నట్లు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పుల్లెల గోపీచంద్ తెలిపారు. ప్రస్తుతం కూరపాటి రమేష్ హను మకొండ డీఎస్ఏ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్‌లు రమేష్‌ను అభినందించారు.

25, 26న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహించను న్నట్లు డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ తెలి పారు. మొదటి విడతగా 25న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్ బాల్, కరాటే, లాన్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్ విభాగాల్లో పోటీలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. 26న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్ క్రీడాంశాలతో పాటు వరంగల్ ఓసిటీలో జూడో పోటీలు ఉంటాయని ఆయన వెల్లడించారు. క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కళాశాలల ప్రిన్సిపల్స్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో పాటు ఒక్కో కళాశాల నుంచి ఒక్కో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన ఐదుగురు క్రీడాకారులను ఈ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు శ్యాంప్రసాద్ సెల్ నంబర్లు: 98492 10746 రమేష్, 99633 36559 శంకర్, 80084 69219 విష్ణువర్ధన్, 7386469301 జీవన్, 9440529916 ప్రశాంత్, 9949271564 అఫ్జల్, 9010002889 లింగమూ ర్తి, 9495392299 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రంగశాయిపేట ఏడీఈగా చంద్రమౌళి

శంభునిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ రంగశాయిపేట సబ్‌స్టేషన్ ఏడీఈగా పి. చంద్రమౌళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్పీడీసీఎల్‌లో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా చంద్రమౌళి రంగశాయిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా రంగశాయిపేట కాలనీల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కర్నె రవీందర్, ఆధ్వర్యంలో కాలనీల బాధ్యులు ఏడీఈ చంద్రమౌళికి ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్ కాలనీ అధ్యక్షుడు పొలుసాని సుభాష్‌రావు, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

» పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న యువకుడు » ఐదుగురిపై కేసు » జనగామ జిల్లా పాలకుర్తిలో ఘటన





పాలకుర్తిలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన సంఘాలు, బాధితుడు శ్రీనివాస్ కుటుంబసభ్యులు, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీనివాస్

పాలకుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన యువకుడు పోలీస్‌స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. మంటల్లో కాలుతున్న యువకుడిని పోలీసులు కాపాడేందుకు యత్నించగా, పోలీసులు సైతం గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని కొండాపురం శివా రులోని మేకలతండాకు చెందిన లాకావత్ యాకూబ్, మంగ్రిల కుమారుడు శ్రీనివాస్‌కు ఇదే మండలంలోని నర్సింగపురంతండాకు చెందిన భూక్య భాను, శాంతిల కూతురు సరోజ(రాధిక)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. కొంతకాలం పాటు వారి కాపురం సవ్యంగానే సాగగా సరోజ గర్భం దాల్చింది. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆ తర్వా త సరోజ పుట్టింటికి వెళ్లగా ఈనెల 16న భాను, శాంతి దంపతులు తమ కుమార్తె సరోజను జనగామలోని చం పక్ హిల్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న శ్రీని వాస్ ఆస్పత్రికి చేరుకొని కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యపై చేయి చేసుకున్నాడు. అత్త, మామలను దూషించాడు. దాంతో సరోజ అదేరోజు తన భర్త శ్రీనివా స్‌పై పాలకుర్తిలో ఫిర్యాదు చేసింది. ఆ మరుసటి రోజైన 17న శ్రీనివాస్ పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు రాగా సరోజను ఎందుకు కొట్టావంటూ ఆమె బంధువులు శ్రీనివాస్‌ను చితకబాదారు. ఈ ఘటన తర్వాత అక్కడి నుంచి వెళ్లిన శ్రీనివాస్ శుక్రవారం రాధిక బంధువులపై కేసు పెట్టాడు. దాంతో పాటు తన భార్యను కాపురానికి పంపించాలని కోరినందుకు తనపై అత్త వారి తరఫు బంధువులు దాడి చేసి కొట్టారని, పోలీసులు తనకు న్యాయం చేయడం లేదంటూ పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకొని నిప్పటించు కుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఎస్సై సాయిప్రసన్నకు మార్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కాపాడేందుకు యత్నించారు. తీవ్ర గాయాల పాలైన శ్రీనివాస్‌ను వెంటనే పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తర లించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధి తుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనను కొట్టిన వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, తనకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేకనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని పేర్కొన్నాడు.

గిరిజన సంఘాల ఆందోళన

బాధితుడు శ్రీనివాస్‌ను కొట్టిన వారిపై చర్యలు తీసుకోక పోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాలకుర్తి ఎస్సై సాయిప్రసన్నకుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ గిరిజన సంఘాలు, బాధితుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఘటన స్థలానికి చేరుకొని అందుకు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

ఐదుగురిపై కేసు నమోదు

లాకావత్ శ్రీనివాస్‌ను కొట్టిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి మహేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బాదితుడు శ్రీనివాస్‌ను కొట్టిన వారిలో టీఎస్‌కేతండాకు చెందిన గుగులోతు హుస్సేన్, మంగ్లీ, నర్సింగపు రంతండాకు చెందిన భూక్య మహేష్, వినోద్, చిక్కిలపై కేసు నమోదు చేసినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వహించొద్దు

» వరంగల్ కలెక్టర్ సత్యశారద

» గురుకుల, కేజీబీవీల్లో ఆకస్మిక తనిఖీలు



రాయపర్తిలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

రాయపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్యం పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ సత్య శారద హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను, మండలంలోని తిర్మలా యపెల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆక స్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్లాస్ రూములు తిరు గుతూ విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. భోజన వసతిని పరిశీలించి, వంటకాల నాణ్యతను తెలుసుకున్నారు. గురుకులంలో వంటకాల్లో నాణ్యత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పులి హోర రుచి చూసి ఉప్పు కూడా సరిగ్గా వేయరా అంటూ ప్రశ్నిం చారు. ఫిర్యాదుల బాక్సుల్లో ఫిర్యాదులు లేకపోవడంతో 800 మంది విద్యార్థినిలు ఎలాంటి సమస్యలు లేవా అన్నారు. అనంతరం కలె క్టర్ మాట్లాడుతూ విద్యార్థినిలకు రుచికరమైన భోజనం అందించ డంతో పాటు నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వి ద్యార్థుల సమస్యలపై కేజీబీవీలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సును తీసి అందులోని ఫిర్యాదులను చదివారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పోషకాహారం లోపించకుండా చూసుకోవా లన్నారు. వసతి గృహాల్లో నెలకొన్ని సమస్యలపై నివేదిక అందిచా లని ఆదేశించారు. విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యార్థినిలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిపై దాడి చేస్తుండగా ఆపడానికి మరో ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. ముగ్గురిపై దాడికి పాల్పడి హత్యాయత్నం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఇంతె జార్‌గంజ్ ఎస్సై వెంకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత గురువారం అర్ధరాత్రి ఒంటిగంటకు పోలెపాక బాబు ఒక వ్యక్తిని గిర్మాజీపేటలో ఆపి డబ్బులు డిమాండ్ చేశాడు. ఇవ్వకపోవడంతో దాడి చేస్తుండగా గమనించిన మరో ఇద్దరు వ్యక్తులు ఆపడానికి ప్రయత్నించారు. ఆ ముగ్గురిపై దాడి చేసి పారిపోయా డు. బాధితులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పర్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 25 మంది వాహనదారులకు శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆ వాహనదారులకు రూ.32,900 జరిమాన విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఆరుగురికి రూ. 7,800 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

అబ్జర్వేషన్ హోమ్‌కు బాలురు

వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ఏడుగురు బాలురు బైక్ డ్రైవింగ్ చేస్తుండగా ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. శుక్ర వారం బాలురపై జువైనల్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా, వారిని ఒకరోజు అబ్జర్వే షన్ హోమ్‌కు తరలించాలని కోర్టు ఆదేశాలతో శుక్రవారం అబ్జర్వేషన్ హోమ్‌కు తర లించినట్లు సీఐ తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలి

» జిల్లా సంక్షేమ అధికారి జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయంతి

వడ్డెపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అవకాశాలను అందిపు చ్చుకొని దివ్యాంగులు ముందుకు సాగాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లి క్రాస్ రోడ్డు లోని ప్రభుత్వ దివ్యాంగుల బాలుర సదనంలో నాగసాయిచంద్ర హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నూగూరి చంద్రమోహన్, కోర్ కమి టీ సభ్యుల సహకారంతో సదనంలోని దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలతో పాటు వారికి కావల్సిన ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జయంతి మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాకారంతో దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, దివ్యాంగుల సదనం పర్యవేక్ష ణాధికారి లక్ష్మీకాంతరెడ్డి, సిబ్బంది రవికృష్ణ, వీరభద్రం, అరుణకుమారి, సుమలత, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పి. రాజుతో పాటు కోర్ కమిటీ సభ్యులు పొడిశెట్టి విష్ణువ ర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

» వరంగల్ జిల్లా కల్లెడలో ఘటన



కల్లెడలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు కుమార్

పర్వతగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సం ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం లోని కల్లెడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కల్లెడకు చెందిన బాల్లె కుమార్(39) కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భార్య సునీతతో కలిసి ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి తన భార్యను పత్తి చేను వద్ద దింపాడు. అనంతరం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటారు వేస్తున్న తరుణంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన భార్య వెంటనే స్థానికులకు సమాచారం అందించగా అప్పటికే కుమార్ మృత్యువాత పడ్డాడు. భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విషాదంలో కుటుంబం..

విద్యుదాఘాతంతో మృతిచెందిన బాల్లె కుమార్‌కు భార్య సునీతతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. శుక్రవారం కుమారుడి 12వ జన్మదినం కావ డంతో సాయంత్రం సరదాగా గడపాలని తల్లిదండ్రులు భావించారు. కానీ, విధి ఆడి న వింత నాటకంలో కుమారుడి బర్త్ డే రోజే తండ్రి మరణంతో ఆ కుటుంబంలో వి షాదం నెలకొంది.

నవంబరులో కమ్యూనిస్టు కమిటీ జాతీయ సమావేశాలు

గిర్మాజిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యూ), ఆర్ ఎంపీఐల ఆధ్వర్యంలో ఏర్పడిన కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ జాతీయ సమావేశాలు నవంబరు 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. శుక్రవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశం చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, హక్కుల కార్యకర్త సాయిబాబా, ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందిన పాలస్తీనా పౌరుల కోసం మౌనం పాటించి నివాళులర్పించారు.సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, గోనె కుమారస్వామి, హంసారెడ్డి, సుధాకర్, సుకన్య, తుకారాం నాయక్, నర్రా ప్రతాప్, బాపురావు, మాస్ సావి త్రి, మురళి, జబ్బార్, శ్రీనివాస్, వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

» వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



కడిపికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ కడిపికొండలోని సూర్య కుటీర్‌లో కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు లకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వడం కోసం రూ. 25 వేల కోట్లు సమకూర్చినట్లు స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా సన్నరకం, దొడ్డు రకం వడ్ల కోసం వేర్వేరు కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేశామన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. 43 లక్షల మంది రైతులకు రూ. 31 వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, పాక్స్ చైర్మన్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రైతుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి హనుమ కొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడు తూ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లు కు చేరేవరకు పర్యవేక్షణపై ఫిర్యాదుల పరిష్కా రానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా అధికారులకు విధులు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా 7330751364 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

కళాకారుల విగ్రహాలనే ఏర్పాటు చేయాలి

» టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్

వడ్డెపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రం లోని కాళోజీ కళా క్షేత్రంలో కళాకారుల విగ్రహాలనే ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావే శంలో ఆయనతో పాటు ఎస్ఐఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్ మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆడిపాడిన కళాకారులు, తెలంగాణ కళారూపాలను కాపాడిన కళాకారులను గుర్తించి గౌరవించా ల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. గద్దర్, చుక్కా సత్తయ్య, మిద్దె రాములు, చిందు ఎల్లమ్మ, గూడ అంజయ్య, బెల్లి లలిత, సాయిచంద్, ఎర్ర ఉపాధి, వరంగల్ శంకర్, వరంగల్ సారంగపాణి, నేరెళ్ల వేణుమా ధవ్ వంటి ఎంతో మంది కళాకారులను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ. 100 కోట్లతో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం కళకు సంబంధం లేని వ్యక్తుల పేర్లతో ఉండడం ఆమోదయోగ్యం కాదన్నారు. కళాకారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 28న హనుమకొండలో నిర్వహించే సదస్సుకు ప్రొఫెసర్ కంచె ఐలయ్య హాజ రవుతున్నారని తెలిపారు. ప్రజలు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసమావేశంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేరిపో తుల వంశీకృష్ణ, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు నాగారం మణితేజ, ప్రధాన కార్యదర్శి తాటికాయల బన్నీ, దాసరి భరత్, నేనావత్ సాయికుమార్, జయంత్, భరత్, మిట్టపల్లి వర్షిత్, జీవన్ తదితరులుపాల్గొన్నారు.

వైభవంగా జిల్లాస్థాయి కళోత్సవ పోటీలు


వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక చదువులు విద్యార్థులకు అత్యంత ఒత్తిడికి గురి చేస్తున్నాయని, వారు తమకు ఆసక్తి గల ఒక కళను ఎంచుకొని అభ్యాసం చేస్తే ఉత్తమ ఫలితాన్ని సాధిస్తారని హనుమకొండ డీఈవో వాసంతి అన్నారు. డైట్ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా కళోత్సవాలను ఆమె ప్రారంభించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో విజేతలైన 68 పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులకు ఓరల్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, డాన్స్ థియేటర్ ఆర్ట్స్, స్టోరీ టెల్లింగ్ వంటి ఆరు అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, హనుమకొండ ఎంఈవో కుర్ర రమేశ్, శైలజ, సుదర్శన్‌రెడ్డి, వల్సపైడి, డైట్ సిబ్బంది సోమయ్య, వెంకట్రాయ్య, రఘు, గైడ్ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో వాసంతి

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారు లను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన కమిషన్ సభ్యులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, లీలాదేవి, రాంబాబునాయక్, డీసీపీ రవీందర్‌తో కలిసి ల్యాండ్, అట్రాసిటీ కేసులు, వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరగా పరి ష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. నమోదైన కేసుల విషయంలో త్వరితగ తిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో రోల్ ఆఫ్ రిజర్వేషన్ కట్టు దిట్టంగా పాటించాలని ఆదేశించారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశా లల్లో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజన వసతి, సౌకర్యాలు, బెస్ట్ అవైల బుల్ స్కూల్స్‌పై చైర్మన్ సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జిల్లా ఎస్సీ బీసీ సంక్షేమ అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, మానిటరింగ్ కమి టీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం హనుమకొండలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబారెడ్డి తెలిపారు. నక్కలగుట్ట పరిధిలో ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు గోకుల్‌నగర్, వికాస్‌నగర్, అశోక్‌కాలనీ, భవానీనగర్, ఇందిరకాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా వడ్డెపల్లి, మడికొండ, రాంపూర్, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పేర్కొన్నారు.

ఏసీపీని కలిసిన కేయూ విద్యార్థి నేతలు



దేవేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్టూడెంట్స్ యూనియన్ నేతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోలీస్‌శాఖ ఉత్కృష్ట సేవా పతకం సాధించినందుకు కేయూ స్టూడెంట్స్ యూనియన్ నేతలు హనుమకొండలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ స్టూడెంట్ నేత గుగులోత్ రాజునాయక్, అశ్విన్ రాథోడ్, ప్రిన్సిపాల్ యాకుబ్‌నాయక్, వీరునాయక్, బోజ్యనాయక్, బోడ నరసింహా నాయక్, కరణ్ నాయక్, రాంనగర్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంపునకు విద్యార్థి ఎంపిక

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరు జలహల్లి ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంపునకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల స్టూడెంట్ సాయిచందన్ ఎంపికై శిక్షణ పూర్తిచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో సాయిచందన్ మర్యాదపూర్వకంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిశారు. క్యాంపులో సిల్వర్ మోడల్‌ను సాధించిన సాయి చందన్‌ను రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో కో ఎడ్యుకేషన్ ఇంజనీంగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ, డాక్టర్ సీహెచ్. రాధికారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ బి. అనిల్‌కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అజర హాస్పిటల్‌లో అవేర్‌నెస్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న డాక్టర్ శివసుబ్రహ్మణ్యం

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అజర ఆస్పత్రిలో ఏసీఏపీ-2024 ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్పిటల్స్ ఇన్ఫెక్షన్‌లను ఎలా నివారించాలి, రోగి భద్రతను పెంపొందించడం, దానిని ఏ విధంగా అమలు చేయాలనే అంశాలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అజర హాస్పిటల్ ఎండీ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిశుభ్రత, ఏఎంఆర్ యాంటి మైక్రోబియల్ రెసిస్టన్స్, అంటు వ్యాధుల నుంచి రక్షణ లాంటి అంశాల పై అవగాహన కల్పించారు. అజర హాస్పిటల్‌కు వచ్చే రోగులను ఇన్ఫెక్షన్ నుంచి రక్షించడంలో, రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో అజర హాస్పిటల్ ముందుంటుందని డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మైక్రో బయాలాజిస్ట్ డాక్టర్ శ్రీదేవి, అజర హాస్పిటల్ ఇంటెన్సివ్స్ డాక్టర్ షఫియుద్దీన్, వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని వివిధ హాస్పిటల్స్‌లోని డాక్టర్లు, నర్సులు హాజరయ్యారు.

రేపటి ప్రొ కబడ్డీ టోర్నమెంట్ జెర్సీ టీషర్టు ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఈనెల 19న నిర్వహించనున్న ప్రొ కబడ్డీ టోర్నమెంట్ జెర్సీ టీ షర్టులను శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వర్సిటీ పరిపాలన భవనంలో ఆవిష్కరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రొఫార్మ ఆవిష్కరణ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కావాల్సిన ప్రొఫార్మను జర్నలిస్టు సంఘం నాయకులు శుక్రవారం బల్దియా కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు రాంచందర్, మట్ట దుర్గాప్రసాద్ మాట్లాడారు. వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం టీయూడబ్ల్యూజె ఐజేయూ జిల్లా శాఖ పక్షాన మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్కింగ్ జర్నలిస్టుల నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఈనెల 21 వరకు తాము ఇచ్చే ఫార్మాట్ పత్రంలో పూర్తి వివరాలు నింపి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు విజయరాజ్, వెంకన్న, బొల్ల అశోక్, ఆడెపు సాగర్, శ్రీధర్, బాలాజీ నాయక్, సురేష్, అజయ్, వెంకన్న, సతీష్, కుమార్, అమీర్, శంకర్, కృష్ణ, శ్రీనివాస్, బాబర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై 200 మంది కళాకారులు

- 'నూరేళ్ల నా ఊరు' గేయకావ్యం గాయకుల ఎంపిక

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూ రోడ్డులోని శారద గార్డెన్స్‌లో శుక్రవారం 'నూరేళ్ల నా ఊరు గేయకావ్యం' గాయకుల ఎంపిక కార్యక్రమం జరిగింది. సుమారు 200 మంది కళాకారులు హాజరై వారి ప్రతిభను పరీక్షించుకున్నారు. అద్భుతమైన పల్లె గొంతుల ఎంపికకు న్యాయ నిర్ణేతగా సీనియర్ కళాకారుడు వరంగల్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. హనుమకొండ నగరంలో చాలా కాలం తర్వాత ఎక్కువ మంది కళాకారులు హాజరై కళా ప్రతిభను ప్రదర్శించారన్నారు. రాష్ట్రంలో కళాకారులకు కొదవ లేదని, ఇన్ని గొంతుల ఒకే వేదికపై ఆలపించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ కళాకారుడు గిద్దె రాంనర్సయ్య మాట్లాడుతూ.. నేటి సమాజానికి ప్రతిభ కలిగిన కళాకారులు అవసరమని అన్నారు. కవి యోచన మాట్లాడుతూ.. యావత్ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లా నుంచి చాలా మంది కళాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు గొల్కొండ భిక్షపతి, రేల కుమార్, బుల్లెట్ వెంకన్న, వెన్నెల శ్రీనాథ్, దారా దేవేందర్, జుపాక శివ, వాంకుడోతు రమేష్, సంజీవ, తాళ్ల సునీల్, వై. రాజు, జనగామ వసంత, చైతన్య, కొయ్యాడ సంధ్య, రాణి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, కళాకారులు

ఉద్యోగాలను మాలలకు దోచిపెడుతున్న సీఎం

- ప్రభుత్వంపై మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలి
- ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

కాళోజీ జంక్షన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మదిగల ఉద్యోగావకాశాలను సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు దోచిపెడుతున్నాడని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు చేసిన సుదీర్ఘ పోరాట ఫలితంగా ఆగస్టు 1న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వర్గీరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అదే రోజున అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ దేశంలోనే మొదటి సారిగా చేసి మాదిగలకు న్యాయం చేసే రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని ప్రగల్భాలు పలికారని అన్నారు. కానీ మాలల ఒత్తిడికి తలొగ్గి కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మాదిగల ఉద్యోగాలను మాలలకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి మాలలతో కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 26న వరంగల్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహిస్తున్నట్లు కుమార్ మాదిగ తెలిపారు. వర్గీకరణ అమలు చేయకుండా టీచర్ ఉద్యోగాల నియామకాలు చేపట్టడంతో 1100 ఉద్యోగాలు మాదిగలు నష్టపోయారని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న కాపు, నాయకులు బొడ్డు దయాకర్ మాదిగ, కొయ్యడ మల్లేశ్ మాదిగ, మంద రాజు మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, జన్ను దినేష్ మాదిగ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సుభాష్ మృతి తీరనిలోటు



సుభాష్‌కు నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' బీఎం రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ రాజేష్, బ్యూరో రాజనారాయణ, జర్నలిస్టులు

బాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయుడు నాయకపు సుభాష్ గౌడ్ అకాల మృతి పాత్రికేయలోకానికి తీరనిలోటని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వర్దినేని రఘుపతిరావు, బ్యూరోచీఫ్ తడుక రాజ్‌నారాయణ, ఎడిషన్ ఇన్‌చార్జ్ కె.రాజేష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని 'ఆంధ్రజ్యోతి' సిటీ కార్యాలయంలో సుభాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రఘుపతిరావు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిజంలో సుభాష్ విలువలకు కట్టుబడి పనిచేశాడని, అలాంటి వ్యక్తి ఆకాలమృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ షరీఫ్, గ్రేటర్ వరంగల్ సిటీ రిపోర్టర్లు పాల్గొన్నారు.

సుభాష్‌గౌడ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



హసన్‌పర్తి : ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 హన్మకొండ జిల్లా కార్యదర్శి నాయకపు సుభాష్‌గౌడ్ కుటుంబాన్ని శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుభాష్‌గౌడ్ జర్నలిస్టు లోకానికి ఆదర్శమూర్తి అని కొనియాడారు. ఎమ్మెల్యే వెంట జర్నలిస్టు నాయకులు బీఆర్.లెనిన్, గాడిపల్లి మధు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, బొడిగ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బూర సారంగపాణి, వీసం సురేందర్‌రెడ్డి, శివరాం, కుమార్, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పీడీఎస్ రైస్ పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 : అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా చిట్యాలకు చెందిన జన్నె వెంకటేశ్ ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో పట్టుకొని విచారణ నిమిత్తం హనుమకొండ పోలీసులకు అప్పగించారు.

యాచకుడి మృతి



హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియం ఎదుట యాచకుడు శుక్రవారం మృతి చెందినట్లు హనుమకొండ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. సతీష్ తెలిపారు. సుమారు 60 నుంచి 70 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని యాచకుడు స్టేడియం ఎదుట ఉన్న డీవైడర్‌పై పడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి సమాచారం లేదని సమాచారం తెలిసిన వ్యక్తులు సెల్ నంబర్ 87126 85113/ 87126 85002 లో సంప్రదించాలన్నారు. ప్రస్తుతం మృతదేహాన్ని ఎంజీఎం మర్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

ఖిలావరంగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శివనగర్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. నిత్యం వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిబ్బందితో శుక్రవారం గుంతలను రెడీ మిక్స్‌తో పూడ్చారు. ఈ సందర్భంగా వాహనదారులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

గిర్మాజిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా, సామాజిక మాధ్యమాలు, మహిళలపై లైంగిక వేధింపులు, సైబర్ క్రైమ్‌లపై బాలికలు అప్రమత్తంగా ఉంటూ వాటి బారిన పడకుండా ఉండాలని వరంగల్ సీపీ మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ సీఐ వెంకన్న సూచించారు. శుక్రవారం వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ శరద్రుతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సోషల్ మీడియా పరిచయాలపై బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు తల్లిదండ్రులు, పోలీసు టోల్‌ఫ్రీ నెంబర్లు 100, 1930, 1098 లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంభునిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ అన్నారు. డివిజన్‌లోని ఎంఎం నగర్, గిరిప్రసాద్ నగర్ కాలనీల్లో విద్యుత్ వినియోగంపై ఏఈ నలిమెల రవి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద లకు అందిస్తున్న సబ్సిడీ విద్యుత్ మీటర్లను కార్పొరేటర్ సువర్ణ అందించారు. పేదలకు రూ. 920 లకే విద్యుత్ మీటర్లను అందిస్తుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మన్ రఘు, సయ్యద్ షబ్బీర్, సింగారపు ఏలియా, శ్రీను, రాజు, జగన్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కరీమాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. కీర్తన ఎంపికైనట్లు హెచ్ఎం జి.ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కాగా నగరంలోని ఏనుమాముల ఇన్‌ఫాంట్ జీసస్ హైస్కూల్లో నేటి నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కీర్తనను హెచ్ఎం ప్రభాకర్, పీఈటీ సృజన, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

దీప్తికి కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ విభాగంలో హనుమకొండకు చెందిన కె. దీప్తి చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ ఎం. జగదీశ్వర్ పర్యవేక్షణలో 'ఎఫిషియెంట్ వైర్‌లెస్ ఫోగ్ నెట్‌వర్క్స్ మేనేజ్‌మెంట్ బై సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ నెట్‌వర్కింగ్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను దీప్తికి పీహెచ్‌డీని ప్రకటిస్తున్నట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా గురువారం హైదారాబాద్‌లో నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో దీప్తి వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్‌వీ. పురుషోత్తమ్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాను స్వీకరించారు. దీప్తి ప్రస్తుతం ఎస్సార్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఏవోగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌కుమార్



డీఎంహెచ్‌వోకు రిపోర్టు చేస్తున్న రాజేష్‌కుమార్

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు హనుమకొండ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవోగా (పరిపాలన అధికారి) కోల రాజేష్‌కుమార్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవికి రిపోర్టు చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలితాదేవి, సిబ్బంది రాజేష్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో వి.అశోక్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఫాతిమా, హెచ్ఈఓ యాదానాయక్, ఉత్తమ్, పద్మ, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరోధకంపై అవగాహన సదస్సు

కాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట భారత ఆహారసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సోమిడిలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మేనేజర్‌లు మోహనకృష్ణ, సునీల్, రవికుమార్‌లు పాల్గొని మాట్లాడారు. అవినీతిని ఎలా నిరోధించాలని, వాటి వెబ్‌సైట్‌ల వాడకంపై అవగాహన కల్పించి చైతన్యపరిచారు. అనంతరం అవినీతి నిరోధంపై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ సిబ్బంది అనిల్, జగదీశ్, ఐతరాజు, హరికృష్ణ, కార్తీక్, సాయికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలని డీటీకి వినతి

కాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : న్యూ శాయంపేటలోని 579 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ శుక్రవారం కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రణయ్‌కుమార్‌కు సీపీఎం కాజీపేట మండల ఇన్‌చార్జి ఓరుగంటి సాంబయ్య వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రంలో గతంలో అప్పటి కలెక్టర్ వాకాటి కరుణ ఇదే ప్రభుత్వ భూమిలో సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేసి భూమిని రక్షించారని అధికారులతో పేర్కొన్నారని తెలిపారు. తర్వాత భూకబ్జాదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమిని ఆక్రమించారన్నారు. ఈ భూమిని తిరిగి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని రక్షించాలని ఆయన పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం నాయకులు జంపాల రమేశ్, కళకోట విమల, డి. గోజు లక్ష్మి, భూక్య రాజేశ్వరి ఉన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన రెజ్లర్లు సత్తా చాటి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైయ్యారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ కోచ్‌తో పాటు జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన గణేష్, సాయివర్ధన్‌లను డీవైఎస్‌వో అశోక్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ బాలుర గ్రీకో రోమన్ 63 కేజీల విభాగంలో గణేష్, ఫ్రీస్టైల్ 92 కేజీల విభాగంలో సాయి వర్ధన్ స్వర్ణ పతకాలు సాధించడంతో జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అదే విధంగా ఫ్రీస్టైల్ 86 కేజీల విభాగంలో అన్విత్, గ్రీకో రోమన్ 82 కేజీల విభాగంలో చరణ్‌లు రజిత పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చి సత్తా చాటారన్నారు.ఈ సందర్భంగా రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి ఎ. గోపాల్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ మృతి

- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



రవీందర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ప్రదీప్‌రావు

కరీమాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, వరంగల్ నగర మాజీ డిప్యూటీ మేయర్, ఎంబాడి రవీందర్(63) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. నగరంలోని అండర్ రైల్వే గేటు ప్రాంతం పెరుకవాడకు చెందిన రవీందర్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ సీనియర్ నేతగా ఎదిగారు. కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్, వరంగల్ నగర మాజీ డిప్యూటీ మేయర్‌గా నగర ప్రజలకు సేవలందించారు. కాగా ఆయన మృతిపై పలువురు రాజకీయ నాయకులు రవీందర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డ్ పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం, మాజీ డిప్యూటీ మేయర్ కక్కె. సారయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ మేయర్ గుండా ప్రకాష్, టీ వీరన్న, కరాటే ప్రభాకర్, డాక్టర్ హరిరమాదేవి, కాంగ్రెస్ లీగల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, కార్పొరేటర్లు పోశాల పద్మ, గుండేటి నరేందర్, నాయకులు రాజనాల శ్రీహరి, లక్ష్మణ్, మేడిది మధుసూదన్, శ్రీనివాస్, జిలుకర వీరస్వామి, నరేందర్, రాజు, వెంకన్న, విశ్వనాథ్‌కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

శంభునిపేట : మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ అంతిమ యాత్రలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటీవ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా నాయకులు కర్నె రవీందర్ పాల్గొన్నారు. రవీందర్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సీనియర్ న్యాయవాది మృతికి బార్ సంతాపం

వరంగల్ లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది వి. జగన్మోహన్‌రావు మృతికి వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్లు సంతాపం తెలియజేశారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలోని అంబేద్కర్ భవన్‌లో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురువారం అనారోగ్యంతో న్యాయవాది జగన్మోహన్‌రావు మృతి చెందడంపై న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఆయన మరణం న్యాయవాద వృత్తికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల ప్రధాన కార్యదర్శులు లాడె రమేష్, ముదసిర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవరావు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంబీఎస్‌సీ కులాలపై పాలకుల వివక్ష

- హక్కుల పోరాట సమితి రాష్ట్ర నేత నర్సింహస్వామి



పబ్లిక్ గార్డెన్‌లో నిరసన దీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంబీఎస్‌సీ కులాల నేతలు

వడ్డెపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మోస్ట్ బ్యాక్‌వర్డ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్(ఎంబీఎస్‌సీ) కులాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించకుండా గత పాలకులు వివక్షను కనబరిచారని, వారి ఆర్థికాభివృద్ధి కోసం వెంటనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఎంబీఎస్‌సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రికోవెల నర్సింహస్వామి మితయ్యల్‌వార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ త్రికోవెల భిక్షపతి మితయ్యల్‌వార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును యథాతదంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. 2011 జనాబా లెక్కల ప్రకారం కాకుండా ఎస్సీ కులాల జన గణన తర్వాతే ప్రస్తుత జనాబా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని అన్నారు. ఎస్సీ ఉప కులాల నిరుద్యోగులకు 70 శాతం సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకు ష్యూరిటీ లేకుండా మంజూరు చేయాలని కోరారు. ఎంబీఎస్‌సీ ఉప కులాలకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 21న హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో చేపట్టే నిరసన దీక్షకు వేలాదిగా తరలి రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఎస్సీ 57 ఎంబీఎస్‌సీ కులాల జిల్లా మహిళా కన్వీనర్ కోకిల సౌజన్య, ఉమ్మడి జిల్లా నాయకులు సురేష్, గడ్డం దామోదర్, ప్రణయ్, రంజిత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2351	2080
పల్లికాయ (సూక)	6100	4500
పల్లికాయ (పచ్చిది)	4750	4000
కందులు	7212	6000
పెసళ్లు	6450	4052
పత్తి	7000	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	11199	10000
పసుపు (గోల)	10029	10000
తేజ మిర్చి	12500	10000
తేజ ఏసీ	17500	12000
వండర్‌హాట్ ఏసీ	16000	13000
యూఎస్341ఏసీ	16000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

కాడెడ్లు.. కనుమరుగాయె..

- వ్యవసాయంలో కానరాని కర్రనాగళ్లు, ఎద్దులబండ్లు
- యాంత్రీకరణతో అదను తప్పుతున్న వ్యవసాయం

నర్మెట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒక నాడు కాడెడ్లు, కర్రనాగళ్లతో కళకళలాడిన కర్షక లోగిళ్లు నేడు కళ తప్పాయి. కాయకష్టంతో సిరులు పండించిన కాడెడ్లు కనుమరగయ్యాయి. నేలలో నుంచి రత్నాలు పండించిన నాగళ్లు దూలాలెక్కుతున్నాయి. పుట్లకొద్ది ధాన్యాన్ని ఇంటికి చేర్చిన ఎద్దులబండ్లు మూలన మూలుగుతున్నాయి. ఫలితంగా పశువులు, ధాన్యపు బస్తాలతో కళకళలాడల్సిన అన్నదాతల ఇళ్లు కళ తప్పిపోయాయి. కంటి రెప్పలా కాపాడుకున్న ఎడ్లన్నీ కండ్లల్లో మెరుస్తున్నాయి. కర్రనాగళ్లతో దున్నిన నేల తల్లిని కర్రు నాగళ్లు దున్నే కాలం వచ్చింది. ఎడ్లు లేని ఎవుసం చేస్తూ అచ్చిరాని యాంత్రిక యుగంలో యంత్రాలతో దున్నకాలు సాగిస్తున్నారు. ఎద్దు ఏడిసిన ఎవుసం, రైతు ఏడిసిన రాజ్యం నిలబడదనేది జగమెరిగిన సత్యం. యాంత్రీకరణ కారణంగా సంప్రదాయ పంటలు పోయి అన్నదాతలు అప్పుల పాలై ఉన్నదంత తెగనమ్ముకుంటున్నారు. పొట్టకూటి కోసం తాతముత్తాల నుంచి వచ్చిన పంట భూములను, పసిడి సొమ్ములను తాకట్టు పెడుతున్నారు. ఉదాహరణకు నర్మెట మండలంలోని పదిహేడు గ్రామాల్లో సుమారు 25 వేల వరకు జనాభా ఉండగా అన్ని గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారే. పూర్వ కాలం నుంచి ప్రతి ఇంటికి ఎంతో కొంత భూమి ఉంది. ఎకరం మొదలుకొని 15 లేదంటే 20 ఎకరాలున్న రైతులు కూడా ఉన్నారు. నాడు ఈ భూములు సాగు చేయాలంటే ఎద్దుల జోడు తప్పనిసరి. కొందరి ఇళ్లలో అయితే మూడు నాలుగు ఎద్దుల జతలుండేవి. అలాంటి ఇప్పుడు కాడెడ్లు కలిగిఉన్న రైతుల సంఖ్యను వేళ్లమీద లెక్క పెట్టొచ్చు. గతంలో పొలం దున్నడం, నాట్లు వేయడం, కుప్ప కొట్టడం, పంట అనంతరం వచ్చిన ధాన్యాన్ని ఇంటికి చేర్చడం ఇలా ప్రతి ఒక్కటి ఎద్దులు, నాగళ్లు, బండ్ల ఆధారంగానే జరిగేవి. ఎక్కడైన పెళ్లి, పేరంటాలు, బంధువుల వద్దకు వెళ్లాలన్నా ఎడ్ల బండ్ల పైనే వెళ్లేవారు. ఇప్పుడు అంతా యాంత్రికమైంది. పొలం దున్నేందుకు ట్రాక్టర్లు, నాట్లు వేసేందుకు, కలుపు తీసేందుకు, పంట నూర్పిడికి మిషన్లు వచ్చాయి. చివరకు పురుగుల మందులను కూడా యంత్రాలతోనే పిచికారి చేసే పరిస్థితికి వచ్చింది.



మూలన పడ్డ ఎడ్ల బండి కమ్ములు



మూలన పడ్డ ఎద్దుల బండి పట్టాలు

కనిపంచని పండగల కళ..

ఒకప్పుడు ఉగాది, దసరా, సంక్రాంతి పండుగ వచ్చిందంటే రైతులంతా తమ ఎద్దులు, పశువులను చెరువులకు తీసుకెళ్లి వాటిని శుభ్రంగా కడిగి పోటీ పడిరంగులు చల్లి అలంకరించే వాళ్లు. రంగు రంగు కాగితపు తోరణాలు, మామిడి, కొబ్బరి, అరటి ఆకుల తోరణాలతో ఎద్దులబండ్లను అలంకరించి గ్రామాల్లో తిప్పేవారు. దేవాలయాలు, పుణ్యక్షేత్రాలను చుట్టూ ప్రదక్షిణలు చేయించే వారు. కానీ ఇప్పుడివేమీ లేవని నాటి తరం వరం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్మెటలో పొగాకు పంటలో కాడెడ్లతో గొర్రు తోలుతున్న రైతు

కదిలిస్తే కన్నీరే..

గ్రామాల్లో రైతన్నలను కాడెద్దుల గురించి కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. గతంలో తమ జీవనాధారం కాడెడ్లేనని, వాటితో పొలాలు దున్ని, కుప్పలు నూర్చి, బండ్లపై పంటను ఇంటికి చేర్చుకునే వారమని గుర్తు చేసుకుంటున్నారు. రాను రాను వర్షాలు పడక, సరిపడా మేత లేక, వాటిని ఉపవాసం ఉంచలేక అమ్ముకున్నాం. దానికి తోడు కూలీల కొరత. యంత్రాలు రావడం కూడా కారణమని చెబుతున్నారు.

ఎడ్లున్నప్పుడే ఎవుసం బాగుండే

- ప్రజ్ఞాపురం కనకయ్య, నర్మెట



ఎడ్లున్నప్పుడు వ్యవసాయం అదనుమిద జరిగేది. కాడెడ్లు పోయి యంత్రాలు వచ్చినా ఏ పని అదనుమిద జరగడం లేదు. కాడెడ్ల వ్యవసాయంతో భూసారంతో పాటు పంట ఉత్పత్తి బాగా ఉండేది. యంత్రాలు వచ్చినప్పటి నుంచి దున్నకాలు మాత్రమే త్వరగా జరుగుతున్నాయే తప్ప పంట అంతరకృషి మాత్రం అదునుగా లేదు. యంత్రాలతో పెట్టుబడి పెరిగింది. రైతు మీద మరింత భారం పడుతోంది. రైతు శ్రమైక జీవనంలో కాడెడ్లు ఇమిడి ఉండేవి. నేడు అవి కనుమరుగయ్యాయంటే బాధేస్తోంది.

ఎన్నో వివాదాలు.. మరెన్నో సమస్యలు..

ఆర్థిక ఇబ్బందులకు తోడు విద్యార్థుల ఆందోళనలతో కేయూ సతమతం

కొత్త వీసీ ప్రతాప్‌రెడ్డికి సమస్యల స్వాగతం

ప్రక్షాళనపై అందరిలోనూ ఆశలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా కాకతీయ యూనివర్సిటీకి ఎంతో పేరుంది. అలాంటి వర్సిటీ కొన్నేళ్లుగా పలు వివాదాలు, సమస్యలతో పాటు నిర్వహణ లోపాలు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బ్లాక్ గ్రాంట్ సక్రమంగా రాకపోవడంతో ఉద్యోగులకు జీతాలు సరైన సమయంలో ఇవ్వలేదని దుస్థితిలో ఉంది. వీటితో పాటు వర్సిటీ ఇప్పటి వరకు వైస్‌చాన్స్‌లర్లుగా పనిచేసిన ప్రొఫెసర్లు తీవ్ర వివాదాల్లో ఇరుక్కోవడం, ఎవరికి వారే వారే యమున తీరే అన్న రీతిన వ్యవరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని పరిపాలనా పరంగా వ్యవస్థాగత పరంగా అనేక వివాదాలను సృష్టించారు. చివరకు వర్సిటీలో పనిచేయాలంటే 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అని భయపడేంతగా పరిస్థితి మారింది. వర్సిటీలో శాంక్షన్ పోస్టుల కంటే తక్కువ మంది ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో క్లాస్ వర్క్ సరిగ్గా జరుగక విద్యార్థులు పాఠాలకు నోచుకోవడం లేదు. కోర్సులు పూరైన తరువాత పీహెచ్‌డీ చదువుకుందామంటే అర్హులైన ప్రొఫెసర్లు లేకపోవడంతో పర్యవేక్షకుల కొరత ఏర్పడుతోంది. దీంతో పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇవ్వలేదని పరిస్థితి ఉంది. వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులున్నా వారికి పాఠాలు చెప్పడంతోనే సరిపోతోంది. వర్సిటీలో ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టకపోతే రానురాను ఇబ్బందులు తప్పవు. ఇప్పుడున్న 78 మంది ప్రొఫెసర్లు రిటైరైతే వర్సిటీ భవిష్యత్ పరిస్థితి ఎంటనే ప్రశ్నార్థకంగా మారింది. బోధన సిబ్బందితో పాటు బోధనేతర సిబ్బందిని నియామించాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో శనివారం కొత్త వీసీగా బాధ్యతలు చేపడుతున్న ప్రభాకర్‌రెడ్డి ప్రక్షాళన చేసి వర్సిటీ నిర్వహణను గాడిన పెడతారని అందరూ ఆశిస్తున్నారు.

వర్సిటీ భూముల రక్షణకు చర్యలు..

వర్సిటీ భూముల వ్యవహారం వర్సిటీలో కలకలంగా మారింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులే ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యులను సైతం పక్కాదారి పట్టించి తమకు అనుకూలంగా వర్సిటీ భూములను అందినకాడికి దండుకునే ప్రయత్నాలకు దిగారు. వర్సిటీ ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీతో పాటు వర్సిటీ విద్యార్థి నేతలు, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వర్సిటీ భూముల రక్షణకు చర్యలు చేపడుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి.. ఆ ప్రకారం అధికారంలోకి రాగానే చర్యలు చేపట్టారు. అయితే అడుగుఅడున అధికారుల సర్వేలకు అడ్డుతగులుతూ వివాదాలకు దిగుతున్నారు. వర్సిటీ ప్రహరీ నిర్మాణ పనులు ఎక్కడవక్కడే నిలిచిపోయాయి. వీటితో పాటు వర్సిటీ పోలీస్ స్టేషన్ పక్కన సీఆర్‌పీఎఫ్ క్యాంప్ కోసం కేటాయించిన భూములను పోలీసు అధికారులు దక్కించుకునే ప్రయత్నాలకు దిగారు. దీన్ని విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు అడ్డుకున్నారు.

గత వీసీ తాటికొండ రమేశ్‌పై ఎంక్వైరీలు

మే 21 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా కొనసాగిన తాటికొండ రమేశ్‌పై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. వీటన్నిటిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పోలీసుల ఎంక్వైరీ ముమ్మరంగా సాగుతోంది. ప్రధానంగా వీసీ రమేశ్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని వర్సిటీలో అక్రమంగా డబ్బులు దండుకుని అడ్హక్ ప్రొఫెసర్ల నియామకం, న్యాక్ పేరుతో విచ్చలవిడిగా నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో తనకు ఇష్టం వచ్చిన వారికి సీట్లు ఇచ్చేందుకు నిబంధనలను తుంగలో తొక్కారని తేల్చారు. కేటగిరి-1, 2లో ఇష్టానుసారంగా సీట్లను కేటాయించి ఇన్‌సర్వీస్ వారికి మధ్యవర్తులను పెట్టుకుని వసూళ్లకు పాల్పడ్డారని విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. పీహెచ్‌డీ సీట్లలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో గొడవ చేశారు. దీంతో పోలీసుల విద్యార్థుల పట్టుకుని తీవ్రంగా కొట్టారు. పీహెచ్‌డీ సీట్లు దక్కకపోగా తమపై పోలీసులు అకారణంగా వీసీ రమేశ్ పొద్బలంతో దాడులు చేశారని విద్యార్థులు దూరవిద్య కేంద్రం వద్ద టెంటు వేసుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. అదే విద్యార్థులపై పోలీసుల దాడుల నేపథ్యంలో వర్సిటీలో పెద్ద ఎత్తున గొడవ జరిగింది. అప్పట్లో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను పరామర్శించారు.



ఇతర వివాదాలు, సమస్యలు..

- కేయూ పరీక్షల విభాగం అనేక వివాదాలను ఎదుర్కొంటోంది. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో విద్యార్థులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఏటేటా మారుతున్న పరీక్షల విధానాలల్లో మార్పులతో పరీక్షల విభాగంపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉద్యోగులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పరీక్షల విభాగంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పరీక్షల విభాగంలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులను ఇటీవల విధుల నుంచి తొలగించారు.
- వర్సిటీలోని కొందరు ఉద్యోగులు అసంతృప్తిగా పనిచేస్తున్నారు. ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. గత వీసీ హయాంలో కొందరు రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్‌సీ చెల్లించలేదని వారు ఇప్పటికీ రాష్ట్ర ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ వినతి పత్రాలను ఇచ్చి తమకు కొత్త పీఆర్‌సీని అమలు చేయాలని కోరుతున్నారు.
- యూనివర్సిటీ మెస్‌లు వివాదాల కుంపటిగా మారాయి. మెస్‌లో అస్తవ్యస్త విధానాలు అమలు చేస్తుండంతో అధికారులకు విద్యార్థులు చుక్కలు చూపిస్తున్నారు. కాంట్రాక్టరు నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల పాల కాంట్రాక్టరు నుంచి అక్రమంగా డబ్బుల తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఏఆర్‌ను పట్టుకున్నారు. మెస్‌లను గాడిన పెట్టల్సిన అవసరం ఉంది. భోజనంలో నాణ్యతలేదని విద్యార్థులు నిత్యం ఆందోళనలకు దిగుతున్న సందర్భాలున్నాయి.
- ఏటేటా వర్సిటీలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దానికి అనుగుణంగా నూతన హాస్టళ్ల ఏర్పాటు చేసినప్పటికీ విద్యార్థులకు సరిపోవడం లేదు. ఇటీవల పోతన హాస్టల్స్‌లో విద్యార్థులు తమకు సరైన సదుపాయాలు లేవని ఆందోళనలు చేపట్టారు. రిజిస్ట్రార్‌తో పాటు హాస్టల్స్ డైరెక్టర్‌ను నిర్బంధించారు. పోతన హాస్టల్‌లో పీజీ విద్యార్థిపై ఫ్యాన్ ఊడిపడి గాయాలపాలయ్యారు. విద్యార్థులపై స్లాబ్ పెచ్చులు పడి గాయపడిన సంఘటలున్నాయి.
- వర్సిటీలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు మంచి ఉద్యోగాలు రావాలంటే మంచి కోర్సులను అభ్యసించాల్సిన అవకాశం ఉంది. ఎస్‌ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్నారు.
- విద్యార్థులను క్లాస్‌లకు రప్పించేందుకు పాఠాలు చేప్పించేందుకు పక్కా ప్రణాళికలు లేవు. విద్యార్థులకు, అధ్యాపకులు బయో మెట్రిక్ హాజరును తప్పినిసరి చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. క్లాస్ వర్క్‌లేకపోతే వర్సిటీలో విద్యార్థులు గాడితప్పుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లాస్‌వర్క్ కోసం నూతన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సంస్కరణ తీసుకురావాల్సిన అవసరం వుంది.

కేయూ వీసీగా ప్రతాపరెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్టాత్మకమైన కాకతీయ యూనివర్సిటీ కొత్త వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా.. కేయూకు ప్రతాప్‌రెడ్డిని నియమించారు. సెర్చ్ కమిటీ సిఫార్సులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన కాకతీయ యూనివర్సిటీకి 13వ నూతన వైస్ చాన్స్‌లర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టనుండగా ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్య, ఉద్యోగ ప్రస్థానం

1961 జూన్ 15న జన్మించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో బీఎస్సీ 1981లో డిగ్రీలో డిస్టెషన్, 1983లో ఎంఎస్సీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1988లో ఉస్మానియా వర్సిటీ నుంచి న్యూరో బయోలజీ ఏరియాలో పీహెచ్‌డీ సాధించారు. 1989 జూన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి 1998లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు

పరిపాలన పదవులు..

1989లో ఉస్మానియా వర్సిటీలో ప్రొఫెసర్‌గా నియమితులైన ప్రతాప్‌రెడ్డి 32 బోధన, పరిశోధన అనుభవం ఉంది. అలాగే ఓయూ రిజిస్ట్రార్‌గా డీన్‌గా, ప్రిన్సిపాల్, ఓయూ జంతుశాస్త్ర విభాగం, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్, సీడీసీ ఇన్‌చార్జి డీన్, డైరెక్టర్ అకాడమిక్ డీన్, డైరెక్టర్ అడ్మిషన్స్ డైరెక్టరేట్, జాయింట్ డైరెక్టరైట్ అడ్మిషన్స్, కో ఆర్డినేటర్ ఎడ్‌సెట్-2008లతో పాటు వివిధ పరిపాలన, పరిపాలనేతర హోదాల్లో సమర్థవంతంగా పనిచేశారు.

అకాడమిక్ అచీవ్‌మెంట్స్..

ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో 28 మంది పీహెచ్‌డీలు సాధించారు. 12 యూజీసీ న్యూడిల్లీతో పాటు ఇతర మేజర్ రిసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. 105 పరిశోధనాత్మక వ్యాసాలను ప్రచురించారు.

మరో రెండు వర్సిటీలకు వీసీలుగా కేయూ ప్రొఫెసర్లు

తెలంగాణ వర్సిటీకి యాదగిరిరావు, మహాత్మాగాంధీ వీసీగా అల్తాఫ్‌హుస్సేన్



టి.యాదగిరిరావు, అల్తాఫ్ హుస్సేన్

కాకతీయ యూనివర్సిటీ నుంచి మరో ఇద్దరు ప్రొఫెసర్లు రాష్ట్రంలోని రెండు వర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లుగా నియమితులయ్యారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్‌ఆర్ఎం విభాగం సీనియర్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరి రావు, ఫిజిక్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ ఆ జాబితాలో ఉన్నారు. నిజామాబాద్‌లోని తెలంగాణ వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ యాదగిరి రావు, నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. వీరిలో యాదగిరిరావు సర్వీస్‌లో ఉండగా అల్తాఫ్ హుస్సేన్ ఉద్యోగ విరమణ పొందారు.



కష్టాన్ని మరిచి.. పొలం గట్టే తివాచీ..

ఎండనక.. వాననక.. కాయకష్టం చేస్తుంటారు రైతులు, రైతు కూలీలు. ఉదయాన్నే సద్ది కట్టుకుని పొలం బాట పడతారు. అందరూ కలిసి మాట కలుపుతూ.. పదం పాడుతూ శ్రమిస్తుంటారు. మధ్యాహ్నం సమయంలో పొలం గట్టునే తివాచీగా చేసుకుని ముచ్చట్లు చెప్పుకొంటూ.. బాగోగులు పంచుకుంటూ ఇదిగో ఇలా కష్టాన్ని మరిచి సహపంక్తి భోజనం చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి మల్హర్‌లో శుక్రవారం మధ్యాహ్నం కొందరు మహిళలు అప్పటి వరకు పొలం పనులు చేసి.. పొలంగట్టున ఒక్కటిగా కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ భోజనం చేస్తూ కనిపించారు.

- మల్హర్

కాకతీయ సంస్కృతి, సంపదను భావితరాలకు అందించాలి

- రేచర్ల రుద్రసేనాని విశ్వాసానికి, శౌర్యానికి ప్రతిరూపం రామప్ప
- వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణలో ప్రొఫెసర్లు సుదర్శనరావు, గోవిందరాజు

రామప్ప వెంకటాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటు తెలంగాణ ప్రాంతాన్ని, అటు ఆంధ్ర ప్రాంతాన్ని కలిపి పరిపాలించిన కాకతీయులు కాలం నాటి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని న్యూఢిల్లీ ఐసీహెచ్ఆర్ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ వైసుదర్శనరావు, టూరిజం ప్రొఫెసర్ డాక్టర్ గోవిందరాజు పేర్కొన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణలో శుక్రవారం వారు పాల్గొన్నారు. కాకతీయుల పాలన, సంస్కృతి శ్రేయస్సు అనే అంశంపై మాట్లాడిన వారు.. రేచర్ల రుద్రసేనాని విశ్వాసానికి, శౌర్యానికి ప్రతిరూపం రామప్ప అని, అంతర్జాతీయ పర్యాటక సమాజాన్ని ఆకర్షించేలా రామప్పలో అభివృద్ధి పనులతోపాటు ఇంకా ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. అలాగే ఆర్థిక వ్యవస్థపై టూరిజం అనే అంశంపై ఎన్ఐటీహెచ్ఎం మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరాజు ప్రసంగించారు. అనంతరం వలంటీర్లు రామప్ప పరిసరాల్లోని గొల్లాలగుడి, శివాలయం సందర్శనకు వెళ్లారు. ఈ శిక్షణకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వలంటీర్ల అనుభవాలు వారి మాటల్లో.



శిక్షణలో వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న మాజీ ప్రొఫెసర్ గోవిందరాజు



శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు

రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలి : జ్ఞానకళ, నంద్యాల, ఆంధ్రప్రదేశ్



నేను ఆంధ్రప్రదేశ్ జిల్లా నంద్యాల జిల్లా సిటీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ టూరిజం హాస్పిటాలజీ మేనేజ్‌మెంట్(బీబీఏటీటీఎం) చేస్తున్నా. వరల్డ్ హెరిటేజ్ సంస్థ ఏర్పాటు చేసిన శిక్షణలో భాగంగా రామప్పకు వచ్చా. రామప్పకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఇంత ప్రాచుర్యం పొందిన దేవాలయమని శిక్షణలో తెలుసుకున్నా. ఇక్కడి సాండ్‌బాక్స్ టెక్నాలజీ పూర్వీకుల మేధస్సుని తెలుసుకుని ఆశ్చర్యపోయా. ప్రతీ ఇంట్లో రామప్ప దేవాలయం చిత్రపటం ఉండాల్సిన అవసరం ఉంది.

రామప్ప కళా సంపద అద్భుతం : పూనెం జాన్వి, పర్యాటక విద్యార్థి



మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. నేను కాకతీయ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్ (ఎంఏఎంటీఎం) చేస్తున్నా. నేను ఎప్పుడూ ఇలాంటి అద్భుతమైన కళాసంపద చూడలేదు. శిల్పకళ అమూల్యం, అనిర్వచనీయం. నాకు ఈశిక్షణ భవిష్యత్‌లో చాలా ఉపయోగపడుతుంది.

కళా సంపదపై పరిశోధనలు జరగాలి : ఎస్.సంజయ్, తమిళనాడు



తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నా. నా చిన్నతనంలో కాకతీయ కట్టడాల గురించి ఎవరూ చెప్పలేదు. ప్రొఫెసర్ పాండు రంగారావు ఆధ్వర్యంలో ఇలాంటి శిల్పకళా సంపదపై పరిశోధన చేస్తున్నా. వారసత్వ సంపద పరిశోధనలు చేసేవిధంగా ప్రోత్సాహకాలు అందించాలి. అప్పుడే వాటి గొప్పతనం పుస్తకాల రూపంలో భావితరాలకు అందించగలం. చరిత్ర అనేది భవిష్యత్తుకు మార్గాన్ని చూపిస్తుంది. కాకతీయకాలం నాటి సాంకేతికత నేటి తరానికి ఆదర్శవంతం.

రామప్పకు రావడం అదృష్టం : పసుల రమ్యశ్రీ - జియాలజిస్ట్, వరంగల్



వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జువాలజిస్ట్‌గా చేస్తున్నా. రామప్ప ఆలయంలో నంది, శివలింగాల కోసం బ్లాక్‌స్టోన్ వాడారు. ఇది డోలొరైట్ రాయి అని ఈశిక్షణలో తెలుసుకున్నా. ఈరాయి హార్డ్‌నెస్ 7 ఉంటుంది. ఇలాంటి రాయిని నేను ఎక్కడా చూడలేదు. నా జీవితంలో రామప్ప శిక్షణ మధుర అనుభూతిగా విగిలిపోతుంది. ములుగు జిల్లాలో ఎర్రరాయి ఉండడం వల్ల రామప్ప మొత్తం ఎర్రరాయితో నిర్మించారని తెలుసుకున్నా.

గ్రూప్ డిస్కషన్స్‌తో మేధస్సు పెంపు

డాక్టర్ సూర్యకిరణ్, టూరిజం ప్రమోటర్



వివిధ ప్రదేశాలకు చెందిన పర్యాటక విద్యార్థులు ఒకచోట చేరి అనుభవాలను పంచుకోవడం మేధస్సు ద్వారా పెరుగుతుంది. మరిన్ని నూతన ఆవిష్కరణలకు పునాది అవుతుంది. పరిశోధక విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అనుమానాల నివృత్తి ఆనందంగా ఉంది

జనగాం శ్రీధర్‌రావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు, శిక్షణ కోఆర్డినేటర్



ఈశిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వలంటీర్లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం సంతృప్తికరంగా ఉంది. అనేక విషయాలు కూడా మేము వారి వద్దనుంచి నేర్చుకుంటున్నాం. గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రామప్ప సర్వతో ముఖాభివృద్ధికి ఇలాంటి శిక్షణ దోహదపడుతుంది.

పురాతన ఆంజనేయస్వామి విగ్రహం లభ్యం



లభ్యమైన పురాతన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

న్యూశాయంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ అభయాంజనేయస్వామి కాలనీలోని అభయాంజనేయస్వామి గుడి వెనక ప్రాంతంలో శుక్రవారం పురాతన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం లభ్యమైంది. ఇక్కడ ఉన్న బండరాళ్లను తొలగిస్తుండగా పురాతన విగ్రహం బయటపడినట్లు కాలనీ ప్రజలు తెలిపారు. దీంతో కాలనీకి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అయితే ఈ నెల 12వ తేదీన దసరా పండుగ రోజు రావణాసుర వధ కార్యక్రమం ఈ స్థలంలోనే ఏర్పాటు చేయగా అప్పుడు ఎలాంటి విగ్రహం కనపడలేదని, శుక్రవారం సడన్‌గా విగ్రహం ఎలా బయటపడిందని అభయాంజనేయ స్వామి కాలనీకే చెందిన కొంత మంది ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాల వైఖరి దుర్మార్గం

» బీఆర్ఎస్ హయాంలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు గుర్తు లేదా ?: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మూసీ పునరుజ్జీవం ఇప్పటికిప్పుడు చేపట్టిందేమీ కాదని, వాజపేయి ప్రధానిగా ఉన్నప్పటి నుంచి కొనసాగుతోందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.18వేల కోట్లతో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కొనసాగిందని గుర్తు చేశారు. నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతాన్ని విస్మరించి ముఖ్యమంత్రిపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సమంజసం కాదని సూచించారు. మూసీ పునరుజ్జీవం అంశంలో సీఎం పట్టుదలను అభినందిస్తున్నానని చెప్పారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును నందనవనం పేరుతో 1998-99లోనే అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా హస్తినాపురంలో మూసీ ఆక్రమణదారులకు ఇళ్లు కూడా కేటాయించారని, రూ.350 కోట్లతో నాలుగు ఎస్టీపీలను కూడా నిర్మించారని గుర్తు చేశారు. మంచి పని చేస్తున్నప్పుడు ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. కేటీఆర్ మునిసపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లో భారీ భవనాల నిర్మాణాలకు అనుమతినిచ్చారని, ఆయా భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పోస్తున్నారో హైడ్రా పరిశీలించాలని సుఖేందర్ రెడ్డి కోరారు.

ఖర్గే, రాజగోపాల్ రెడ్డిలతో భట్టి భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిశారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలతో పాటు జార్ఖండ్ ఎన్నికల గురించి కూడా భట్టి ఆయనతో చర్చించారు. భట్టిని జార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పరిశీలకుడుగా నియమించిన విషయం తెలిసిందే. కొద్ది రోజులుగా ఢిల్లీలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కూడా భట్టి సమావేశమైనట్లు సమాచారం. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ దీపావళి లోపు జరిగే అవకాశాల గురించి వారు చర్చించినట్లు తెలిసింది. కాగా, శుక్రవారం జార్ఖండ్ చేరుకున్న భట్టికి రాంచీలో కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ వేతనాలివ్వండి

» విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ వేతనాలను అమలు చేయాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం సభ్యులు శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితులు, వేతనాల చెల్లింపులు, అకాడమిక్ పరిస్థితులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు సంఘం నేతలు తెలిపారు.

ధర్మేంద్ర ప్రధాన్‌తో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర సమావేశమయ్యారు. శుక్రవారం ప్రధాన్ నివాసానికి వెళ్లిన వద్దిరాజు రాష్ట్రానికి సంబంధించిన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లాకు నవోదయ ఉండాలనే నిబంధన ఉందని, దాని ప్రకారం తెలంగాణలో మరో 23 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ప్రారంభించాలని విన్నవించారు. సమస్యలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

కోర్టుకు కేటీఆర్ గైర్హాజరు

» అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ పరువు నష్టం దావా కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోర్టుకు రాకుండా డుమ్మా కొట్టారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం చర్యలు తీసుకోవాలని సురేఖపై వేసిన ఈ కేసులో తన వాంగ్మూలం ఇచ్చేందుకు న్యాయస్థానం ఆదేశాల మేరకు కేటీఆర్ శుక్రవారం నాంపల్లి కోర్టుకు రావాల్సి ఉంది. అయితే, విచారణ సమయానికి అనివార్య కారణాల వల్ల కేటీఆర్ రాలేకపోతున్నారని ఆయన న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఈనెల 23 (వచ్చే బుధవారం)కు వాయిదా వేశారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కేటీఆర్ కోర్టుకు వస్తున్నారని అక్కడ హైడ్రామా నడిచింది. చివరి నిమిషంలో అనూహ్యంగా ఆయన కోర్టుకు రాలేకపోతున్నారని న్యాయవాదాలు తెలపడం చర్చనీయాంశంగా మారింది.

భూ నిర్వాసితుల సమస్యలపై చర్చకు సిద్ధమా?

» హరీశ్‌రావుకు అడ్లూరి సవాల్

రాష్ట్రంలోని భూనిర్వాసితుల సమస్యలపై తనతో చర్చకు సిద్ధమా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణకుమార్ సవాల్ విసిరారు. సీఎల్పీ మీడియా హాల్లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. సిద్దిపేట, గజ్వేల్, చొప్పదండి, ధర్మపురి సహా ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని.. తేదీ, ప్రదేశాన్ని ఆయనే నిర్ణయించాలన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులపై చర్చించేందుకు కేసీఆర్‌ను హరీశ్‌రావు తీసుకువస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి వస్తారన్నారు. మల్లన్నసాగర్‌లో కేసీఆర్, హరీశ్‌రావుల అరాచకాలు అన్నీ, ఇన్నీకావని.. భూ నిర్వాసితుల పాపం ఊరికే పోదని చెప్పారు. పరిహారం అడిగిన రైతులు, నాయకులపై కేసులు పెట్టారని, భూములను బలవంతంగా లాక్కున్నారన్నారు.

బీఆర్ఎస్ నేతలు మూసీ పక్కన ముక్కు మూసుకోకుండా ఉండగలరా?: మల్లు రవి

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో మూసీ నదిని అభివృద్ధి చేసి ఉంటే.. ఈ రోజు ఆ నది పరిస్థితి ఇలా ఉండేదికాదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఆ పార్టీ నేతలు మూసీ పక్కన ముక్కు మూసుకోకుండా ఉండగలరా అని ప్రశ్నించారు. ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నిక ల్లో బుద్ధి చెప్పినా వారు గుణపాఠం నేర్చుకోలేదన్నారు. మూసీ నది పునరుజ్జీవ కార్యక్రమానికి సహకరించాలని ప్రతిపక్ష నేతలను సీఎం రేవంత్‌రెడ్డి కోరారని.. బీఆర్ఎస్ నేతలు సహకరించకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎంను విమర్శించడం అవివేకమని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రాజీవ్ సద్భావనా యాత్ర సంస్మరణ

» కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

» గీతారెడ్డికి సద్భావనా అవార్డు ప్రదానం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ వద్ద గతంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నిర్వహించిన సద్భావనా యాత్రను స్మరించుకుంటూ శనివారం చార్మినార్ వద్ద రాజీవ్ సద్భావనా యాత్ర సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. సంస్మరణ కమిటీ ఆధ్వర్యంలో ఏటా అక్టోబరు 19న ఈ కార్యక్రమం చార్మినార్ వద్ద జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, తదితరులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డును సీఎం రేవంత్‌రెడ్డి ప్రదానం చేయనున్నారు.

బీఆర్ఎస్ నేతలకు సహకరిస్తున్న అధికారులను వదిలిపెట్టేది లేదు: సామా రామ్మోహన్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలకు ఇప్పటికీ సహకరిస్తూ వారి పాపాల్ని కప్పి పుచ్చాలని చూసే అధికారులను ప్రజా ప్రభుత్వం వదిలిపెట్టదని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలను టీపీసీసీ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్ధరాత్రి ఊళ్లను ఖాళీ చేయించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ బాధితులు మరో 20ఏళ్ల పాటు ఆ పార్టీని అధికారంలోకి రానివ్వబోరని చెప్పారు.

మూసీ నిర్వాసితులను ఆదుకుంటాం

స్వచ్ఛమైన గాలి, నీరు, ఉపాధి కల్పిస్తాం .. నిర్వాసితులకు చెక్కుల పంపిణీలో సీతక్క



ప్రజాభవన్‌లో చిన్నారితో ముచ్చటిస్తున్న మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, స్వచ్ఛమైన గాలి, నీరు కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఉన్న ఊరు, ఇళ్లను వదులుకోవాలంటే ఎవ్వరికైనా బాధ ఉంటదని, ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధం వీడదీయలేనిదని మంత్రి సీతక్క అన్నారు. వానొచ్చినా.. వరదొచ్చినా భయంతో బతుకుతున్న పరిస్థితి నుంచి వారిని బయటపడేసేందుకు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. శుక్రవారం ప్రజాభవన్‌లో సీతక్క.. మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాలకు చెందిన 172 మంది మహిళలకు రూ.3.44 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూసీలో చెత్త, మురుగు చేరి దుర్గంధం వస్తోందని, అక్కడే ఉంటూ ఆ గాలి పీల్చుతున్నందున అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత మహిళా సంఘాలకు 17 రకాలు అవకాశాలు కల్పిస్తామని, కుట్టుమిషన్లు అందించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. స్కూల్ డ్రెస్‌లు కుట్టడానికి మూసీ నిర్వాసితులకు ప్రథమ ప్రాధాన్యమిస్తామన్నారు. పిల్లలకు గురుకులలో ఉచితంగా అడ్మిషన్ కల్పిస్తామని హామీనిచ్చారు. బాధిత మహిళలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అందులో రూ. 1.40 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ. 60 వేల రూపాయలు మూడు సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పునరావాసం పొందిన బాధిత కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్వాడీ కేంద్రాలలో ప్రవేశం, అలాగే రెండు పడకల గదుల నిర్మాణం ఉచితంగా అందించామని చెప్పారు. మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల మాట్లాడుతూ... మూసీ నిర్వాసితులకు పిల్లి గుడిసె 2బీహెచ్‌కె కాలనీలో 130 కుటుంబాలకు పునరావాసం కల్పించామని తెలిపారు. కాగా, చెక్కుల పంపిణీ కార్యక్రమం కోసం నిర్వాసితులను ఉదయం 11 గంటలకే ప్రజాభవన్‌కు తీసుకొచ్చారు. కానీ, రెండు గంటలు ఆలస్యంగా కార్యక్రమాన్ని నిర్వహించడంతో నిర్వాసితులు ఇబ్బందులు పడ్డారు.

25 వేల కోట్లు చాలు!

(మొదటిపేజీ తరువాయి)

రూ.25 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు కోసం రూ.లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని ప్రశ్నించారు. 56 కిలోమీటర్ల మేర మూసీ ప్రక్షాళన కోసం కిలోమీటర్‌కు రూ.2700 కోట్ల చొప్పున ఖర్చు పెట్టాలనుకుంటున్నారని విమర్శించారు. ప్రపంచంలోనే ఇది అత్యంత ఖరీదైన ప్రాజెక్టు అవుతుందేమోనని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై కేటీఆర్ కౌంటర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ ప్రక్షాళనకు సుందరీకరణ అనే పేరు తాము పెట్టలేదని, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఆ మాట అన్నారని తెలిపారు. రూ.లక్షన్నర కోట్ల ఖర్చవుతుందని కూడా ముఖ్యమంత్రే స్వయంగా వెల్లడించారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. వాస్తవానికి మూసీ ప్రక్షాళనకు తాము ఎప్పుడో శ్రీకారం చుట్టి ఎన్నో పనులు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. నాలాల ఆధునికీకరణ, ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని, బఫర్ జోన్‌లోని ఇళ్ల జోలికి పోకుండా నదీ గర్భంలో నివసిస్తున్న వారికి మంచి ప్యాకేజీతో తరలించే ప్రణాళిక చేశామని పేర్కొన్నారు. మూసీపై ఇరువైపులా ఎక్స్‌ప్రెస్ వే నిర్మించడం మాత్రమే పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు.

రియల్ ఎస్టేట్‌లా చేస్తున్న రేవంత్..

తాము చేపట్టిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తే తక్కువ ఖర్చులోనే మూసీలో స్వచ్ఛమైన నీరు పారేలా చేయవచ్చునని కేటీఆర్ అన్నారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇవన్నీ వదిలేసి ఒక రియల్ ఎస్టేట్ తరహా ప్లాన్ చేస్తున్నారని విమర్శించారు. దానికోసం రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టాలనుకుంటున్నందునే తాము అభ్యంతరం తెలుపుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని, రాహుల్‌గాంధీకి ఎప్పుడు డబ్బులు అవసరమైనా తెలంగాణ గుర్తొస్తుందని ఆరోపించారు. వాళ్లకు డబ్బుల సంచులు మోసేందుకే ఇలాంటి ప్రాజెక్టులు చేపడుతున్నట్లుగా అనిపిస్తోందన్నారు. 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా కాళేశ్వరం ప్రాజెక్టును తాము రూ.లక్ష కోట్లతో కట్టామని, మూసీ ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు పెట్టి ఎన్ని ఎకరాలకు నీళ్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టును ఒకసారి సుందరీకరణ అని, మరో సారి ప్రక్షాళన అని, ఇంకోసారి పునరుజ్జీవం అని సీఎం రేవంత్ రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని అన్నారు. దానికి అయ్యే ఖర్చును ఒకసారి 50 వేల కోట్లు అని, గజినీలా అది మరిచిపోయి మరోసారి రూ.లక్షన్నర కోట్లు అని అంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి మానసిక స్థితిపై తనకు అనుమానంగా ఉందన్నారు.



పునరుజ్జీవం పేరుతో గ్రాఫిక్స్ వీడియోలు..

మూసీ పునరుజ్జీవం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి అందమైన గ్రాఫిక్స్‌తో కూడిన వీడియోలు ప్రదర్శించారని కేటీఆర్ విమర్శించారు. మూసీకి ఇరువైపులా పెద్ద భవంతులు వస్తున్నట్లు చూపారన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోనే అన్ని బిల్డింగులు వస్తే మరి ప్రత్యేకంగా ఫోర్త్ సిటీ కట్టడం ఎందుకని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చేదాకా మూసీ గురించి ఎవరూ ఆలోచించలేదన్నారు. 2017లో నాటి సీఎం కేసీఆర్ మొదటిసారి మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నదిని బాగుచేయాలని నిర్ణయించారని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో 31 ఎస్టీపీలు (మురుగు నీటి శుద్ధి కేంద్రాలు) నిర్మించే కార్యక్రమం కూడా తమ హయాంలోనే చేపట్టామన్నారు. తాము శనివారం ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని ఒక ఎస్టీపీని సందర్శిస్తున్నామని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీళ్లు తెచ్చి మూసీని ప్రక్షాళన చేసే ప్రణాళికను తమ హయాంలో చేశామని కేటీఆర్ తెలిపారు. మూసీపై 15 చోట్ల బ్రిడ్జీలు నిర్మించాలని, ప్రతి బ్రిడ్జి వద్ద ఒక చెక్ డ్యామ్ నిర్మించి, అక్కడ నిలిచే నీటిలో బోటింగ్ ఏర్పాటు చేయాలనుకున్నామని వివరించారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు సంబంధించి గ్లోబల్ డిజైన్లను ఆహ్వానించి మ్యాపులు రూపొందించామని చెప్పారు. రేవంత్ సర్కారు ఇపుడు కొత్తగా చేయాల్సింది ఏమీ లేదని, తాము చేపట్టిన పనులను కొంచెం ముందుకు తీసుకుపోతే మూసీ ప్రక్షాళన పూర్తవుతుందని అన్నారు. మూసీ కోసం తామే ఇంత చేస్తే.. సీఎం రేవంత్ జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. రూ. 50 లక్షలతో దొరికిపోయిన వ్యక్తి తమను టెర్రరిస్టు కసబ్‌తో పోల్చడం దారుణమన్నారు. రిజువనేషన్ అనే పదానికి సీఎం రేవంత్ తడుముకోకుండా స్పెల్లింగ్ చెబితే తాను రూ.50 లక్షలను ఒక బ్యాగులో పెట్టి ఇస్తానని సవాల్ విసిరారు.

రేవంత్-అదాని జోడీని ఏమందాం?: కేటీఆర్

సీఎం రేవంత్‌రెడ్డిని ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కలవడంపై కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శలు చేశారు. "మోదీ, అదానీల దోస్తానాపై ఏఐసీసీ 'మోదానీ' అంటూ ట్వీట్ చేసిన రోజే తెలంగాణలో అదానీ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ జోడీని ఏమనాలి? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్, అదానీ జోడీని రేవ్దానీ అని, రాగా (రాహుల్‌గాంధీ), అదానీ జోడీని రాగదానీ అని అనవచ్చని వ్యాఖ్యానించారు.

వచ్చే ఎన్నికలనాటికి మూసీ ప్రక్షాళన పూర్తి

» జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ఎమ్మెల్యే, ఎంపీ సీట్లనూ గెలుచుకుంటం

» హుస్సేన్‌సాగర్ ప్రక్షాళననూ చేపట్టాలి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): "2028 ఎన్నికలనాటికి మూసీ నది ప్రక్షాళన పూర్తి చేస్తం. ఆ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలో అన్ని ఎమ్మెల్యే సీట్లను కైవసం చేసుకుంటం. అలాగే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ జీహెచ్ఎంసీ పరిధిలో అన్ని సీట్లను గెలుచుకుంటం. మూసీ ప్రక్షాళనతో 2028నాటికి జీహెచ్ఎంసీ పరిధిలో కాంగ్రెస్ తప్ప వేరే పార్టీ ఉండదు. ఇది రాసిపెట్టుకోండి" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలనాటికి మూసీ నది.. హైదరాబాద్‌కు షాన్‌గా నిలబడనుందని చెప్పారు. మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్, బీజేపీ నేతలకున్న అభ్యంతరమేంటని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన అనేది ఆన్‌గోయింగ్ ప్రాజెక్టు అని, అది ఉమ్మడి రాష్ట్రం నుంచే ఉందన్నారు. పదేళ్ల పాలనలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ ప్రచారానికే పరిమితమైందని, మూసీ నదీ గర్భంలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించి తరలిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్చుకోలేకపోతున్నారన్నారు. "మూసీ నిర్వాసితుల్లో అత్యధికులు ఇప్పటికే ప్రభుత్వం కల్పించిన పునరావాసానికి తరలివెళ్లారు. బఫర్ జోన్లో 12 వేల కుటుంబాలుంటాయి. వారి పునరావాసానికీ చర్యలు తీసుకుంటుంటే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నరు" అని అన్నారు. మూసీ ప్రక్షాళన పట్ల తెలంగాణ ప్రజానీకం హర్షిస్తోందని, తమ ప్రాంతాల్లోని నదులనూ ప్రక్షాళన చేయాలని కోరుతోందని చెప్పారు. హుస్సేన్‌సాగర్ ప్రక్షాళననూ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీలో చేరి కలుషితమయ్యారన్నారు. హైదరాబాద్‌ను ఇస్తాంబుల్ చేస్తానంటూ హౌలా మాటలు మాట్లాడింది కేసీఆర్ అని, సీఎం రేవంత్ ఆయనలా మాట్లాడట్లేదని చెప్పారు. మూసీ నది.. భువనగిరి ప్రజల జీవనది అని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో జగ్గారెడ్డి

మూసీపై రాజకీయాలొద్దు

» నాడు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నేడు రాజకీయం చేస్తారా?

» బీఆర్ఎస్ అబద్ధాలు మానుకోవాలి మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూసీని ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, మూసీని కాపాడుకునే చిత్తశుద్ధి, కమిట్‌మెంట్ ప్రభుత్వానికి ఉందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, చెరువులు, నదులను కాపాడే బాధ్యత మనందరిపై ఉండాలని పేర్కొన్నారు. 2016లో మూసీ రివర్ డెవలప్‌మెంట్ బోర్డ్‌ను జీవో నంబరు7 ద్వారా అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందని, మూసీ రివర్ బౌండరీస్‌ను గత ప్రభుత్వమే నిర్ణయించిందని చెప్పారు. మూసీ ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గత సర్కారే నిర్ణయించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మునిసిపల్‌శాఖ తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని, దానికి డైరెక్షన్ మినిట్స్ కూడా ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు దాన్నే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. మూసీ పక్కన జీవించే ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగదని, ఇది సీఎం రేవంత్ రెడ్డి గ్యారెంటీ అని పేర్కొన్నారు. మూసీని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, రాత్రికిరాత్రే అభివృద్ధి సాధ్యంకాదనేది గుర్తుంచుకోవాలన్నారు. మూసీ నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని హామీ ఇచ్చిన ఆయన పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో 14 గ్రామాలు మల్లన్న సాగర్‌లో మునిగిపోయాయని, భూ నిర్వాసితులకు నాడు ఏం న్యాయం చేశారని దామోదర ప్రశ్నించారు. పోలీసుల జులుం.. లాఠీ చార్జీలు, 144సెక్షన్ విధించినదీ గుర్తుంచుకోవాలన్నారు. వారు తెచ్చిన రెండు భూసేకరణ చట్టాలను కోర్టు కొట్టివేసిందన్నారు. యూపీఏ సర్కారు 2013లో సమగ్ర భూసేకరణ చట్టం తెస్తే దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. జీవో నంబర్ 123 తెస్తే.. ప్రజలు మీపై తిరుగుబాటు చేశారని, కోర్టుకు వెళ్లి ఆ జీవోను రద్దు చేయించుకున్నారన్నారు. రాజకీయమంటే గాలి మాటలు, అబద్ధపు ఆరోపణలు కాదని, ఇకనైనా అబద్ధాలు మానుకోవాలని బీఆర్ఎస్‌కు హితవు పలికారు. తొమ్మిదిన్నరేళ్లలో రియల్‌ఎస్టేట్ ఎలా సాగిందీ.. కార్పొరేషన్ల ఏర్పాటుతో రుణాలు ఎలా తీసుకున్నదీ తమకు తెలుసని దామోదర అన్నారు.

మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసం

» పేదల ఇళ్లను కూల్చేస్తున్న సర్కార్: బీజేపీ

» సుందరీకరణకు వ్యతిరేకం కాదు: కిషన్‌రెడ్డి



గాంధీనగర్‌లో సీవరేజ్ పైపులైన్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవం పేరిట రాష్ట్ర ప్రభుత్వం విధ్వంసం సృష్టిస్తోందని, వేలాది మంది పేదల ఇళ్లను కూల్చివేస్తోందని బీజేపీ ఆరోపించింది. ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తూ మూసీ పరివాహక ప్రాంతంలో ఈనెల 23, 24 తేదీల్లో తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పర్యటించనున్నట్లు తెలిపింది. అనంతరం సమగ్ర నివేదిక రూపొందించి ఈ నెల 27న జాతీయ నాయకత్వానికి నివేదించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదు, హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతతోపాటు రాష్ట్రంలో తాజా రాజకీయాలపై చర్చించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించాలంటే క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని, ఓటరు నమోదు గణనీయంగా పెంచుకోవాలని సమావేశం నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలని నేతలకు ఇన్‌చార్జి బన్సల్ సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు సంస్థాగత కార్యక్రమాల నిర్వహణపై ప్రతి నెలా తాను సమావేశం నిర్వహిస్తానన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా తెలంగాణకు ఎక్కువ సమయం కేటాయించేలా ఆయనకు మిగతా రాష్ట్రాల బాధ్యతలు తగ్గిస్తామని బన్సల్ పేర్కొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిని త్వరలోనే ప్రకటించాలని సమావేశం నిర్ణయించిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. అయితే.. రాష్ట్ర పార్టీలో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో బన్సల్ ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా కొందరు రాష్ట్ర నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు జాతీయ నాయకత్వం దృష్టికి వెళ్లడం, ముఖ్యనేతల మధ్య అభిప్రాయ భేదాల నేపథ్యంలో బన్సల్ ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉంటారని ఆ వర్గాలు అంటున్నాయి.

40 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను కూల్చవద్దు: కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: మూసీ సుందరీకరణను, పునరుజ్జీవ చర్యలను తాము వ్యతిరేకించడంలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మూసీ నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి సుందరీకరణ చేపట్టాలన్నారు. అయితే ఈ పేరుతో పేదల ఇళ్లను కూల్చడం న్యాయం కాదని, మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదలు 30, 40 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీనగర్ డివిజన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగు కోసం రూ.54.50 లక్షల అంచనావ్యయంతో ఏర్పాటు చేయనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను కిషన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకుండా మూసీ సుందరీకరణ, హైదరాబాద్ నగర అభివృద్ధి వీలు కాదన్నారు. జీహెచ్ఎంసీ, మెట్రో వాటర్ వర్క్స్‌కు నిధులు అధికంగా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

అబద్ధాలే ఆశ్చర్యపోయేలా రేవంత్ మాటలు

మూసీ రివర్ ఫ్రంట్‌లో దాగి ఉన్న స్టంట్ ఏంటి?.. పునరుజ్జీవం పేరిట రియల్ దందాను ఒప్పుకోం

» 10 వేల కుటుంబాలకు మేలు జరుగుతుందంటే మూసీ వద్ద 4 నెలలైనా ఉంటా: హరీశ్



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలే ఆశ్చర్యపోయేలా సీఎం రేవంత్‌రెడ్డి మాటలు ఉన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తన రియల్ ఎస్టేట్ కలల్ని గ్రాఫిక్స్‌లో సీఎం చూపించారని విమర్శించారు. రివర్ ఫ్రంట్ వెనుక దాగి ఉన్న స్టంట్ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే మూసీ సుందరీకరణ ప్రారంభమైందన్నారు. ఇప్పుడు మూసీ పునరుజ్జీవనం పేరిట సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శత్రు దేశాలపై దాడి చేసినట్లు పేదల బస్తీలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్టు చేపడతామని చెప్పిన రేవంత్.. ఇప్పుడు మాట మార్చి ఎవరు చెప్పారని దబాయిస్తున్నారని ఆరోపించారు. "తొలుత మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజల సమస్యలు తెలుసుకుందాం. ఆ తర్వాత మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నిర్వాసిత గ్రామాలకు వెళ్లి మా హయాంలో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీద్దాం. ఇందుకు సిద్ధమేనా?" అని రేవంత్‌కు సవాల్ విసిరారు. మూసీ నిర్వాసితులకు గచ్చిబౌలిలో 450 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించి ఇస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. నల్లగొండ ప్రజలపై ప్రేమ ఉంటే మూసీలోకి మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. బెంగళూరు, చెన్నై వరదల్ని చూపించి ఇక్కడ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడం సరి కాదన్నారు. సుందరీకరణ పేరుతో వేల కోట్లు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌లో మీడియా ప్రముఖుల ఇళ్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. 10 వేల మందికి మేలు జరుగుతుందంటే మూడు నెలలు కాదు.. నాలుగు నెలలైనా మూసీ వద్ద ఉంటానని స్పష్టం చేశారు. "ఎమ్మెల్యేగా గెలవకముందే నాకు మంత్రి పదవి ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. ఆ టైంలో నువ్వు టీఆర్ఎస్‌లో నా శిష్యుగా ఉన్నావు. నేను మంత్రి అయినప్పుడు నాతో పాటు డ్యాన్స్ చేశావు. నేను మంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు గన్ పార్కు దగ్గర నా వెనక నిలబడ్డావు. టీవీలో కనిపించేందుకు నిక్కినిక్కి చూశావు. టీఆర్ఎస్ పొత్తుతోనే మొదటి సారి ఎమ్మెల్యే అయ్యావు. సోనియా గాంధీని బలిదేవత అన్న నోటితోనే కాంగ్రెస్ గురించి ఎలా మాట్లాడుతున్నావు? కొంచెమైనా నైతికత ఉందా?" అని ప్రశ్నించారు.

ఆ భయంతోనే మీడియా ముందుకు రాలేదు



అనీ

'తోటి మహిళా కొరియోగ్రాఫర్‌పై జానీమాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడనే విషయం మమ్మల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక అమ్మాయి జీవితంతో ముడిపడి ఉన్న విషయం కావడంతో ఏం మాట్లాడితే ఏమవుతుందో అని అందరం భయపడ్డాం. అందుకే డ్యాన్సర్స్ అసోసియేషన్, కొరియోగ్రాఫర్లు ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేదు' అని టాలీవుడ్ మహిళా కొరియోగ్రాఫర్ అనీ అన్నారు. జానీ మాస్టర్, బాధితురాలి మధ్య ఏం జరిగిందనేది మనకెవరికీ తెలియదు. ఒకవేళ ఆమె ఆరోపణలు నిజమైతే ఆయన్ని కఠినంగా శిక్షించాల్సిందే. కానీ జానీ మాస్టర్ నిరపరాధి అని తేలితే పరిస్థితి ఏమిటి? అలాగే కోర్టు తీర్పు చెప్పేంతవరకూ మనందరం సంయమనం పాటించాలి. జానీ మాస్టర్ దగ్గర నేను మూడేళ్లపాటు అసిస్టెంట్‌గా చేశాను. ఎప్పుడూ ఇబ్బందులు ఎదుర్కోలేదు. బాధితురాలు కొన్నాళ్ల క్రితం వరకూ 'జానీమాస్టర్ నా దేవుడు' అని చెప్పింది. కానీ ఇప్పుడు మాట మార్చి ఆరోపణలు చేసింది. ఆమెను జానీ మాస్టర్ భార్య కూడా ఎంతగానో ప్రోత్సహించారు' అని అన్నారు.

తొలి ఎపిసోడ్‌లో అల్లు అర్జున్?





నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'అన్‌స్టాపబుల్ సీజన్ 4' ఓటీటీ వేదిక 'ఆహా'లో ఈ నెల 24 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తొలి ఎపిసోడ్‌లో అల్లు అర్జున్ గెస్ట్‌గా కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందనీ, అల్లు అర్జున్ తాజా చిత్రం 'పుష్ప 2' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆ చిత్రబృందం కూడా 'అన్‌స్టాపబుల్' షో లో పాల్గొందని అంటున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను త్వరలో విడుదల చేయనున్నారు. ఇద్దరు మాస్ హీరోలు పాల్గొంటున్న ఈ ఎపిసోడ్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన నంద్యాల ఎపిసోడ్ గురించి అల్లు అర్జున్‌ని బాలకృష్ణ ప్రశ్నించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. 'అన్‌స్టాపబుల్' వేదికగా ఆ వివాదం గురించి వివరణ ఇచ్చి ఇంతటితో దాన్ని ముగించాలని అగ్ర నిర్మాత అల్లు అరవింద్ ప్లాన్ చేసినట్లుగా చెబుతున్నారు. ఈ తొలి ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో విడుదలయ్యాక ఈ విషయం మీద క్లారిటీ వస్తుందని అంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

గుర్తుండి పోయే జ్ఞాపకాలు



విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (వీడీ 12- వర్కింగ్ టైటిల్) షూటింగ్ ప్రస్తుతం కేరళలో శరవేగంగా సాగుతోంది. ఈ సందర్భంగా విజయ్ కేరళ అభిమానులతో భేటీ అయ్యారు. 'కేరళలో షూటింగ్ మరచిపోలేని అనుభూతులు ఇచ్చింది. ఈ జ్ఞాపకాలు ఎన్నేళ్లైనా గుర్తుండిపోతాయి. ప్రకృతి అందాల మధ్య గడిపిన క్షణాలు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా ప్రేక్షకుల మనసులను చూరగొంటుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. కేరళ అభిమానులతో విజయ్ ముచ్చటిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ చిత్రంలో విజయ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది వేసవిలో 'వీడీ 12' ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరో తెలుగు సినిమా చేస్తా



విద్యాబాలన్

'ఎన్టీఆర్: కథానాయకుడు', 'ఎన్టీఆర్: మహానాయకుడు' చిత్రాల్లో నటించా. మరిన్ని తెలుగు సినిమాలు చేయాలనుంది. మంచి కథ దొరికితే మరో తెలుగు సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను' అని బాలీవుడ్ నటి విద్యాబాలన్ అన్నారు. కార్తిక్ ఆర్యన్‌తో కలసి ఆమె కీలకపాత్ర పోషించిన 'భూల్ భూలయ్యా' చిత్రం ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వారిద్దరూ హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. విద్యాబాలన్ మాట్లాడుతూ "భూల్ భూలయ్యా 3' చిత్రంతో రెండింతల వినోదం ఖాయం. అన్ని అంశాలు అద్భుతంగా కుదిరాయి. హారర్, కామెడీ, థ్రిల్, సంగీతం... ఒకటేమిటీ అన్నీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కార్తిక్ ఆర్యన్, నేను ప్రేక్షకులను భయపెట్టడంతో పాటు కడుపుబ్బా నవ్విస్తాం. దీపావళికి మా సినిమా ప్రేక్షకులకు మంచి మజా ఇస్తుంది' అన్నారు. కార్తీక్ ఆర్యన్ మాట్లాడుతూ 'వృత్తిపట్ల అంకిత భావం ఉన్న గొప్ప నటి విద్యాబాలన్. బయటే కాదు షూటింగ్‌లోనూ ఆమె సరదాగా ఉంటారు. తనతో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'భూల్ భూలయ్యా 2'తో పోల్చితే మూడో పార్ట్‌లో మరింత వినోదం ఉంటుంది. కథతో పాటు పాత్రల విషయంలోనూ ప్రేక్షకులను ఆకట్టుకునే మరిన్ని మార్పులు చేశాం' అన్నారు.

బిల్లు నేనే చెల్లించేదాన్ని



'మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఉండటం ఎంతో ముఖ్యం. ఆర్థిక విషయాల్లో ఇతరులపై ఆధారపడటం నాకు నచ్చదు. ఎప్పుడైనా ఎవరితోనైనా డేట్‌కి వెళ్తే... బిల్లు నేనే చెల్లించేదాన్ని' అని అన్నారు శ్రుతిహాసన్. కొందరు అబ్బాయిలు ఖర్చులన్నీ తనతోనే పెట్టించేవారని ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. 'మొదట్లో ఎదుటి వ్యక్తిని అడగకుండానే నేను అన్నింటికీ డబ్బులు చెల్లించేదాన్ని. కొంత కాలం తర్వాత ఎప్పుడైనా ఈ విషయాన్ని అడిగితే...నువ్వు ఇష్టపడి కడుతున్నావేమో అనుకున్నామని అంటారు. ఇలాంటి అనుభవాలు ఎదురైన తర్వాత డబ్బుల విషయంలో స్పష్టమైన వైఖరితో ఉండాలని అర్థం చేసుకున్నా' అని శ్రుతిహాసన్ చెప్పారు.

అరవై మంది భద్రతా సిబ్బంది రక్షణలో సల్మాన్



బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి వరుస బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో ఆయన తన భద్రతను కట్టుదిట్టం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా రూ.రెండు కోట్లు వెచ్చించి దుబాయ్ నుంచి బుల్లెట్ ప్రూఫ్ కారు 'నిస్సాన్ పెట్రోల్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్‌'ని దిగుమతి చేసుకున్నారు. సల్మాన్‌కు ఇదివరకే ఒక బుల్లెట్ ప్రూఫ్ కారు ఉండగా, ఇది రెండోది. ఖరీదుకు తగ్గట్టుగానే ఈ కారులో అధునాతన సౌకర్యాలతో పాటు ప్రత్యేకించి ప్రమాదాల నుంచి గట్టెక్కించే రక్షణ వ్యవస్థను కలిగి ఉంది. అంటే.. బాంబు అలెర్ట్ ఇండికేటర్స్, అతి సమీపం నుంచి కాల్పులు జరిపినా తట్టుకునే బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు, కారులో ప్రయాణిస్తున్న వారిని బయటి వారు గుర్తించకుండా ఉండేలా టింటెడ్ విండోస్ వంటివి. ప్రస్తుతం ఈ కారు ఇండియాలో లభించడం లేదు.

రూ. ఐదు కోట్లు చెల్లిస్తే...

ఇదిలా ఉండగా.... 'ఐదు కోట్ల రూపాయలు చెల్లిస్తే సల్మాన్‌ని క్షమించి విడిచి పెడతాం, లేదంటే బాబా సిద్దీఖికి పట్టిన గతే పడుతుంది' అని హెచ్చరిస్తూ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ముంబై పోలీసులకు వచ్చిన తాజా బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం సల్మాన్‌కు ఉన్న గన్‌మెన్‌ల సంఖ్యను ఎనిమిది నుంచి పదికి పెంచారు. 24 గంటలు సల్మాన్ భద్రతను పర్యవేక్షించేందుకు ఆయన నివాసమైన గెలక్సీ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేకంగా కమాండ్ సెంటర్‌ను ముంబై పోలీసులు ఏర్పాటు చేశారు.

'బిగ్ బాస్' హౌస్‌లో...

మరో వైపు... సల్మాన్ కొంత కాలం పాటు 'బిగ్ బాస్ షో' హోస్టింగ్‌కు దూరంగా ఉంటారనే వార్తలు బాలీవుడ్‌లో చక్కర్లు కొట్టాయి. అయితే ఈ వార్తలకు చెక్ పెడుతూ 'బిగ్ బాస్ 18' షూటింగ్ కోసం సల్మాన్ సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ముంబై పోలీసులు షూటింగ్ సెట్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. దాదాపు 60 మంది భద్రతా సిబ్బంది సెట్‌లో ఉంటూ సల్మాన్‌ను నిరంతరం పర్యవేక్షించనున్నారు. బయటి వారికి సెట్‌లోకి అనుమతి లేదని, షోకు సంబంధించిన సిబ్బంది సైతం గుర్తింపు కార్డు చూపించిన తరవాతే లోనికి అడుగు పెట్టేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

మీ ఫోన్ నంబర్ ఇస్తారా?



సల్మాన్ ఖాన్ మాజీ ప్రియురాలు సోమీ అలీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టు వైరల్ అయింది. ఆమె లారెన్స్ బిష్ణోయ్‌ని ఉద్దేశించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. "నమస్తే లారెన్స్ భాయ్"... అంటూ సోమీ అలీ తన సందేశాన్ని మొదలుపెట్టారు. "మీరు జైలు నుంచే జూమ్ కాల్ చేస్తున్నారని విన్నాను. నేను కూడా మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాలి. అందుకు మార్గం ఏమిటో చెప్పండి. మన ప్రపంచంలో అన్నింటికంటే అందమైన ప్రదేశం రాజస్థాన్. మేము మీ దేవాలయానికి రావాలనుకుంటున్నాం. కానీ అంతకంటే ముందుగా మేము మీతో జూమ్ కాల్ మాట్లాడాలి. కొన్ని విషయాలు చెప్పాలి. నా మాట నమ్మండి. ఇది నేను మీ ప్రయోజనం కోసమే చెబుతున్నాను. నాకు మీ మొబైల్ నెంబరు ఇవ్వండి' అంటూ సోమీ అలీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు.

పాన్ ఇండియా సినిమాలా అనిపించింది



సంయుక్త

యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కథానాయిక సంయుక్త 'పొట్టేల్' ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ 'దర్శకుడు నాలుగేళ్లు కష్టపడి కథను సిద్ధం చేశాడు. అద్భుతంగా తెరపైన ఆవిష్కరించాడు. ట్రైలర్‌లో తొలి షాట్ చూడగానే రియల్ పాన్ ఇండియన్ ఫిల్మ్ అనిపించింది. ప్రతిభావంతులైన నటీనటులు ఈ సినిమాతో వెండితెరకు పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. అజయ్ పాత్ర ఆసక్తికరంగా అనిపించింది. నిర్మాతల అభిరుచి వల్లే ఇంత మంచి చిత్రం రూపుదిద్దుకుంది' అని ప్రశంసించారు. అనన్య మాట్లాడుతూ 'ట్రైలర్‌లో చూసింది కొంచెమే. మా సినిమా కొన్ని రోజుల పాటు ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. వాణిజ్య హంగులతో పాటు చక్కని కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అని సాహిత్ చెప్పారు. విక్రమార్కుడు చిత్రం తర్వాత ఆ స్థాయిలో ఉన్న విలన్ పాత్రను ఈ సినిమాలో చేశాను అని అజయ్ తెలిపారు.



మూడేళ్ల తరవాత..

బాలీవుడ్ జంట సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అడ్వానీ మూడేళ్ల తరవాత కలిసి ఆన్‌స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. ఈ చిత్రాన్ని 'మ్యాడ్ డాక్ ఫిల్మ్స్' బేనర్‌పై దినేష్ విజన్ నిర్మిస్తున్నారు. సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ ఓకే అయినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కాగా, 2021లో విడుదలైన 'షేర్‌షా' సినిమాలో సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అడ్వానీ తొలిసారిగా కలిసి నటించారు. గతేడాది వీరు వివాహం చేసుకున్నారు. పెళ్లి తరవాత ఇద్దరు కలిసి నటించబోతున్న తొలి చిత్రం ఇదే.

ఇన్ ప్రోగ్రెస్

తెల్లారు పొద్దుల్లో

సదన్, ప్రియాంక జంటగా రూపొందుతున్న 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి తాజాగా 'తెల్లారు పొద్దుల్లో' అంటూ సాగే మెలోడియస్, రొమాంటిక్ సాంగ్‌ను నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ విడుదల చేశారు. సంగీత దర్శకుడు మార్కండేయ రాసి, స్వరపరిచిన ఈ పాటను ధనుంజయ్, అదితి



భావరాజు పాడారు. పాట చాలా బాగుందని, అరకులో అందమైన ప్రదేశాల్లో చక్కగా చిత్రీకరించారని శేఖర్ మాస్టర్ ప్రశంసించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

అమ్మ మనసు బాధపడితే..

అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రేమమయిగానే కాదు త్యాగమూర్తిగా కూడా ఆమెకు సాటి మరెవరూ లేరు. అటువంటి ఓ అమ్మ మనసు ఎలాంటి భావోద్వేగాలకు గురైంది, అందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి.. అనే అంశాలతో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన




పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు కిశోర్ నిర్మిస్తున్నారు. చిత్రం ప్రోగ్రెస్ గురించి ఆయన మాట్లాడుతూ 'షూటింగ్ పార్ట్ , డబ్బింగ్ పూర్తయ్యాయి. మిగిలిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంతో జరుగుతున్నాయి. సోషల్ మీడియా లో గురువారం టీజర్‌ను విడుదల చేశాం. అద్భుతమైన స్పందన వస్తోంది' అని తెలిపారు.'మంచి కథ, కథనాలతో తొలి ప్రయత్నంగా మా బేనర్‌లో ఒక సినిమా తీయాలని సంకల్పించి ఈ సినిమా తీశాం. నవంబర్‌లో విడుదల చేస్తాం' అని చెప్పారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి కథ ఇదనీ, ప్రేక్షకులను ఆకట్టుకొనే రీతిలో రూపొందించామనీ దర్శకుడు వి.శ్రీనివాస్(సిప్పీ) చెప్పారు.

పవన్ కల్యాణ్ టైటిల్‌తో

ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం ఖరారైంది. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' టైటిల్‌ను యూనిట్ ఖరారు చేసింది. దీంతో పాటు ఫస్ట్‌లుక్, మోషన్ వీడియోను విడుదల చేశారు. నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పిల్లి కథానాయిక. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ సంస్థ నిర్మిస్తోంది. సంగీతం: రధన్, సినిమాటోగ్రఫీ: ఎంఎన్ బాలరెడ్డి.





గ్లాడియేటర్ 2 వస్తోంది

పురాతన రోమ్ సామ్రాజ్యాన్ని పాలించిన నిరంకుశ చక్రవర్తుల ఆగడాలు, వారిపై లూసియస్ పోరాటం.. కథాంశంగా రూపుదిద్దుకున్న 'గ్లాడియేటర్' చిత్రం 2000 సంవత్సరంలో విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. దీనికి సీక్వెల్‌గా రూపొందిన 'గ్లాడియేటర్ 2' చిత్రం నవంబర్ 15న ఇంగ్లీష్, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. పెడ్రో పాస్కల్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం గ్రిప్పింగ్ యాక్షన్, హై స్టేక్స్ డ్రామాతో ప్రేక్షకుల్ని అలరించనుంది. రిడ్లీ స్కాట్ అద్భుతమైన విజువల్స్‌తో, ఆకట్టుకునే విధంగా 'గ్లాడియేటర్ 2' చిత్రాన్ని రూపొందించారు.

'బ్యాక్‌డోర్' దర్శకుడి కొత్త చిత్రం

'బ్యాక్‌డోర్' అనే సందేశాత్మక చిత్రంతో ప్రేక్షకుల మన్ననలతోపాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు దర్శకుడు కర్రి బాలాజీ. ఆయన దర్శకత్వంలో మరో చిత్రాన్ని ప్రకటించారు. గతంలో 'అన్‌స్టాపబుల్' అనే కామెడీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించిన రంజిత్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలాజీ సినిమా విశేషాలను గురించి వివరిస్తూ 'రేవ్‌పార్టీలు, పబ్బుల్లో జల్సా చేస్తున్న ఈ తరం యువత ఎలా మత్తులో చిత్తవుతోంది, తమ జీవితాలను నాశనం చేసుకుంటోంది అనే అంశాల చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాం. ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తాం' అని చెప్పారు.



ప్రేమ పేరిట వేధింపులు.. విద్యార్థిని ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరిట ఓ యువకుడు వేధించి, బెదిరిస్తుండడంతో డిగ్రీ విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గలో శుక్రవారం చోటు చేసుకుంది. చిత్రదుర్గ సమీపంలోని మేదహళ్లికి చెందిన విద్యార్థిని ప్రేమ(18)ను ఓ యువకుడు ప్రేమ పేరిట కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఆమె సెల్ ఫోన్‌కు తరచూ బెదిరింపు మెసేజ్‌లు పెడుతున్నాడు. ఇటీవల చాకు ఫొటో పెట్టి.. ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయాలను గురువారం సాయంత్రం తనకు తెలిపిందని ప్రేమ తండ్రి కన్నీరుమున్నీరయ్యారు. ధైర్యం చెప్పి కాలేజీకి పంపించానని, మధ్యాహ్నం కాలేజీకి వచ్చి మాట్లాడతానని చెప్పానని, ఇంతలోనే ఘోరం జరిగిందని అన్నారు. కళాశాల భవంతిపై నుంచి విద్యార్థిని కిందకు దూకగానే అధ్యాపకులు, విద్యార్థులు అప్రమత్తమై ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిత్రదుర్గ ఇన్‌స్పెక్టర్ నహీం, సబ్ ఇన్‌స్పెక్టర్ రఘు కళాశాలను సందర్శించారు. ప్రేమ ఆత్మహత్యతో కాలేజీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. వేధించిన ఆకతాయిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవానీ రేవణ్ణకు సుప్రీం కోర్టులో భారీ ఊరట

బెంగళూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడి చేశారని ఫిర్యాదు చేసిన మహిళను కిడ్నాప్ చేసినట్లు నమోదైన కేసులో ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణకు సుప్రీం కోర్టు ఊరట లభించింది. కిడ్నాప్ కేసులో మాజీ మంత్రి రేవణ్ణ జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. ఇదే కేసులో రేవణ్ణ భార్య భవాని ముందస్తు బెయిల్ పొందారు. కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు భవాని రేవణ్ణ ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల కోర్టును ఆశ్రయించారు. సిట్ పిటిషన్ విచారణకు వస్తే సమస్య తలెత్తవచ్చునని భావించిన భవాని.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమెకు బెయిల్ రద్దు చేయాలని సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది.

జమిలిపై నిర్ణయం కాలేదు: పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'జమిలి ఎన్నికలపై ఇంకా నిర్ణయం కాలేదు. అదంతా చర్చ మాత్రమే' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సభ్యత్వాల నమోదుపై సమీక్ష జరిగింది. ఆ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. 'జమిలి ఎన్నికలపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉంది. రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇండస్ట్రియల్ పార్కు ఎక్కడ పెడతారో నాకు తెలియదు. కానీ కచ్చితంగా రాజమహేంద్రవరానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు తెచ్చే దిశగా ఎమ్మెల్యేల అందరి సహకారంతో కృషి చేస్తా' అని పురందేశ్వరి అన్నారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్‌సింగ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వాల నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఏపీలో ఇప్పటికే 17 లక్షలకు పైగా క్రియాశీల, సాధారణ సభ్యత్వాలు నమోదయ్యాయి' అని తెలిపారు. అనంతరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి బీజేపీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. 2వ మండలం నుంచి క్రియాశీల సభ్యురాలిగా సభ్యత్వ రశీదును అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు రశీదును అందించారు.

లుకౌట్ నోటీసును రద్దు చేయండి

హైకోర్టును ఆశ్రయించిన సజ్జల

అమరావతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లుకౌట్ సర్క్యులర్‌ను(ఎల్‌వోసీ) రద్దు చేయాలని కోరుతూ వైసీపీ సీనియర్‌నేత సజ్జల రామకృష్ణారెడ్డి శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ గుంటూరు ఎస్పీ ఈ నెల 10న లుకౌట్ నోటీసులు జారీ చేశారన్నారు. ఇది కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ విభాగము

ప్రో.నెం.జి1/2773/2024 కలెక్టర్ కార్యాలయం
కరీంనగర్ తేది: 15-10-2024

ఫారం-VI ప్రాథమిక ప్రకటన

భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము-2013 (చట్టము-30/2013) సెక్షన్ 11 (1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి-2014 లోని నియమము 19 (1) (ప్రకారం)

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం పరిధిలో గల ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన భూమిమొత్తము విస్తీర్ణం (40-15 3/4) ఎకరముల భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా గౌరవెల్లి రిజర్వాయర్ క్రింద D-4 కుడి ప్రధాన కాలువ కిలోమీటరు 19.127 నుండి కిలోమీటరు 19.600 వరకు త్రవ్వుట కొరకు అవసరమున్నదని భూసేకరణ చేయవలసి నందున తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, కరీంనగర్ గారు భావిస్తున్నారు.

సదరు భూసేకరణ చట్టము లోని సెక్షన్ 10-A క్రింద ఇవ్వబడిన అధికారాల అమలులో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము జి.ఓ.ఎం.ఎస్.నెం.41, I&CAD (LA.R&R/A2) Dept., dt. 22.07.2017 భూ సేకరణ చట్టం 2013 (నెం.30/2013) లోని చాప్టర్-II&III ల లోని నిబంధనల నుండి మినహాయింపు ఆదేశాలను జారీచేయనైనది. అందువల్ల, ఈ భూసేకరణ కూడా గౌరవెల్లి ప్రాజెక్ట్ క్రింద వస్తోంది కాబట్టి, ప్రస్తుత భూసేకరణకు, భూసేకరణ చట్టం, 2013 (నెం.30/2013) లోని చాప్టర్- II&IIIల లోని నిబంధనల విధానాన్ని అనుసరించవలసిన అవసరము లేదు.

షెడ్యూలు

గ్రామము: సుందరగిరి మండలము:చిగురుమామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 19.127 నుండి కిలోమీటరు 19.600 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ (ఖుష్కి/పట్టా/ప్రభుత్వ భూమి)	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
204	ఖుష్కి/పట్టా	1-00	పెసరు నమ్మవ్వ (లింగయ్య)	()	
			పెసరు లలిత (పర్శరాములు)	()	
			పెసరు నాగార్జున (కొమురయ్య)	పెసరు నాగార్జున (కొమురయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
			పెసరు సౌందర్య (లింగయ్య)	()	
			-	పెసరు లింగయ్య (కొమురయ్య) ఎంజాయిమెంట్ క్రమము	-
			-	పెసరు పర్శరాములు(కొమురయ్య) ఎంజాయిమెంట్ క్రమము	-
			-	పెసరు శ్రీనివాస్ (కొమురయ్య)	-
				పెసరు వెంకట్రాజం (చిన్న వెంకయ్య) ఎంజాయిమెంట్ క్రమము	
205	ఖుష్కి/పట్టా	2-07	పెసరు వెంకట్రాజం (చిన్న వెంకయ్య)	పెసరు వెంకట్రాజం (చిన్న వెంకయ్య)	-
			గుడాల సుగుణ (సంపత్)	గుడాల సుగుణ (సంపత్)	-
			పెసరు నమ్మవ్వ (లింగయ్య)	()	
			పెసరు లలిత (పర్శరాములు)	()	
			పెసరు సౌందర్య (లింగయ్య)	()	
			పెసరు నాగార్జున (కొమురయ్య)	పెసరు నాగార్జున (కొమురయ్య) ఎంజాయిమెంట్ క్రమము	
206	ఖుష్కి/పట్టా	0-37	రాధారపు రాములు(వెంకయ్య)	రాధారపు రాములు(వెంకయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	4-మామిడి 10-టేకు, 2-వేప
			రాధారపు కొమురయ్య (వెంకయ్య)	రాధారపు కొమురయ్య (వెంకయ్య)	-
			పెసరు తిరుపతి (వెంకయ్య)	పెసరు తిరుపతి (వెంకయ్య)	-
			రాగుల వెంకటేశం (కొమురయ్య)	రాగుల వెంకటేశం (కొమురయ్య)	-
			రాగుల మహేష్ (వెంకటేశం)	రాగుల మహేష్ (వెంకటేశం)	-
			రాధారపు శ్రీధర్ (రాములు)	()	-
			కొమ్మిడి శైలజారాణి (కుంట మహేందర్ రెడ్డి)	()	-
మొత్తం విస్తీర్ణం 4-04					

గ్రామము: కొండాపూర్ మండలము:చిగురు మామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.05 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
166	ఖుష్కి/పట్టా	0-05	రెడ్డి ఓదయ్య (కొంరయ్య)	రెడ్డి ఓదయ్య (కొంరయ్య)	-
			వడియాల రమణ కుమార్ (రాజిరెడ్డి)	వడియాల రమణ కుమార్ (రాజిరెడ్డి)	-
			రెడ్డి రమేష్ (రాజయ్య)	రెడ్డి రమేష్ (రాజయ్య)	-
	కెనాల్/కాలువ		నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	-
మొత్తం విస్తీర్ణం 0-05					

గ్రామము: కొండాపూర్ మండలము:చిగురుమామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.325 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
148	ఖుష్కి/పట్టా	0-01	బత్తుల భీమయ్య (రాజయ్య)	బత్తుల భీమయ్య (రాజయ్య)	-
			బత్తుల నమ్మయ్య (రాములు)	బత్తుల నమ్మయ్య (రాములు)	-
			గాల్ల కనకవ్వ (మల్లయ్య)	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	-
			బత్తుల రాజయ్య (భీమయ్య)	బత్తుల రాజయ్య (భీమయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			బత్తుల భీమయ్య (రాములు)	బత్తుల భీమయ్య (రాములు)	-
			గాల్ల సంపత్ (మల్లయ్య)	గాల్ల సంపత్ (మల్లయ్య)	-
			గాల్ల తిరుపతి (మల్లయ్య)	గాల్ల తిరుపతి (మల్లయ్య)	-
			గంట నరవ్వ (అక్కయ్య)	గంట నరవ్వ (అక్కయ్య)	-
			గంట నరవ్వ (కొమురయ్య)	గంట నరవ్వ (కొమురయ్య)	-
	కెనాల్/కాలువ		నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	-
				గాల్ల సంపత్ (ఎంజాయిమెంట్ క్రమము)	-
149	పడావ్	0-08	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	
			బత్తుల రాజయ్య (భీమయ్య)	బత్తుల రాజయ్య (భీమయ్య)	
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			-	బత్తుల కొమురయ్య (రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
				బత్తుల భీమయ్య (రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
150	ఖుష్కి/పట్టా	0-34	బత్తుల భీమయ్య (రాజయ్య)	బత్తుల భీమయ్య (రాజయ్య)	-
			బత్తుల రాజయ్య (భీమయ్య)	బత్తుల రాజయ్య (భీమయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			బత్తుల భీమయ్య (రాములు)	బత్తుల భీమయ్య (రాములు)	-
			గాల్ల సంపత్ (మల్లయ్య)	గాల్ల సంపత్ (మల్లయ్య)	-
			బత్తుల కొమురయ్య (రాములు)	బత్తుల కొమురయ్య (రాములు)	-
			గంట నరవ్వ (అక్కయ్య)	గంట నరవ్వ (అక్కయ్య)	-
			గంట నరవ్వ (కొమురయ్య)	గంట నరవ్వ (కొమురయ్య)	-
			గల్ల అంజలి (గల్ల సంపత్)	గల్ల అంజలి (గల్ల సంపత్)	-
			గల్ల వర్షిత (గల్ల తిరుపతి)	గల్ల వర్షిత (గల్ల తిరుపతి)	-
			-	గల్ల కనకవ్వ (ఎంజాయిమెంట్ క్రమము)	-
మొత్తం విస్తీర్ణం 1-08					

గ్రామము: కొండాపూర్ మండలము:చిగురుమామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.3 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
148	ఖుష్కి/పట్టా	0-02	బత్తుల భీమయ్య (రాజయ్య)	బత్తుల భీమయ్య (రాజయ్య)	-
			బత్తుల నమ్మయ్య (రాములు)	బత్తుల నమ్మయ్య (రాములు)	-
			గాల్ల కనకవ్వ (మల్లయ్య)	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	-
			బత్తుల రాజయ్య (భీమయ్య)	బత్తుల రాజయ్య (భీమయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			బత్తుల భీమయ్య (రాములు)	బత్తుల భీమయ్య (రాములు)	-
			గాల్ల సంపత్ (మల్లయ్య)	గాల్ల సంపత్ (మల్లయ్య)	-
			గాల్ల తిరుపతి (మల్లయ్య)	గాల్ల తిరుపతి (మల్లయ్య)	-
			గంట నరవ్వ (అక్కయ్య)	గంట నరవ్వ (అక్కయ్య)	-
			గంట నరవ్వ (కొమురయ్య)	గంట నరవ్వ (కొమురయ్య)	-
			-	గంట లచ్చయ్య (అంజూన్) (ఎంజాయిమెంట్ క్రమము)	-
	కెనాల్/కాలువ		నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	-
149	ఖుష్కి/పట్టా	0-08	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	గాల్ల కనకవ్వ (మల్లయ్య)	-
			బత్తుల రాజయ్య (భీమయ్య)	బత్తుల రాజయ్య (భీమయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			బత్తుల భీమయ్య (రాములు)	బత్తుల భీమయ్య (రాములు)	-
			గాల్ల సంపత్ (మల్లయ్య)	గాల్ల సంపత్ (మల్లయ్య)	-
			గాల్ల తిరుపతి (మల్లయ్య)	గాల్ల తిరుపతి (మల్లయ్య)	-
			గంట చిన్న మల్లయ్య(బాలయ్య)	గంట చిన్న మల్లయ్య(బాలయ్య)	-
			గంట నరవ్వ (కొమురయ్య)	గంట నరవ్వ (కొమురయ్య)	-
			-	బత్తుల కొమురయ్య(రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	-
			-	బత్తుల భీమయ్య (రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
201	బంజరాయి	0-21	గంట అంకుస్ (వెంకటయ్య)	గంట అంకుస్ (వెంకటయ్య)	
			ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	
				బత్తుల భీమయ్య (రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
				బత్తుల నమ్మయ్య (భీమయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	
202	ఖుష్కి/పట్టా	0-21	కొంతె చిన్నరాజయ్య(రామయ్య)	కొంతె చిన్నరాజయ్య(రామయ్య)	-
			బత్తుల నమ్మయ్య (రాములు)	( )	-
			బింగి కనకయ్య (కాంతయ్య)	బింగి కనకయ్య (కాంతయ్య)	-
			బింగి వీరస్వామి (కాంతయ్య)	బింగి వీరస్వామి (కాంతయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	( )	-
			బత్తుల రమేష్ (బత్తుల భీమయ్య)	( )	-
				బింగి లక్ష్మీనారాయణ (ఎంజాయిమెంట్ క్రమము)	
203	ఖుష్కి/పట్టా	0-01	దరిపెల్లి బాలయ్య (మల్లయ్య)	దరిపెల్లి బాలయ్య (మల్లయ్య)	-
			బత్తుల రాములు (రాజయ్య)	బత్తుల రాములు (రాజయ్య)	-
			-	బత్తుల భీమయ్య (రాములు) (ఎంజాయిమెంట్ క్రమము)	-
			-	బత్తుల భీమయ్య (రాజయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	-
			-	బత్తుల నమ్మయ్య (భీమయ్య) (ఎంజాయిమెంట్ క్రమము)	-
123	ఖుష్కి/పట్టా	0-12	బింగి చంద్రయ్య (భీమయ్య)	ముంజ నరేష్ (వెంకటేశం)	-
			మండల సంపతి (మల్లయ్య)	మండల సంపతి (మల్లయ్య)	-
			పోతరవేని శ్రీనివాస్(వెంకయ్య)	పోతరవేని శ్రీనివాస్(వెంకయ్య)	-
			బత్తుల రాజయ్య (రాజయ్య)	బత్తుల రాజయ్య (రాజయ్య)	-
			బత్తుల నమ్మయ్య (భీమయ్య)	బత్తుల నమ్మయ్య (భీమయ్య)	-
			మండల రాజా (మల్లయ్య)	మండల రాజా (మల్లయ్య)	-
			మండల స్వరూప (కొమురయ్య)	మండల స్వరూప (కొమురయ్య)	-
			కొమిరె కోల (రాజయ్య)	( )	-
			ముంజ నరేష్ (వెంకటేష్)	ముంజ నరేష్ (వెంకటేష్)	-
			బత్తుల సరవ్వ (బత్తుల రాజయ్య)	బత్తుల సరవ్వ (బత్తుల రాజయ్య)	-
			పోతరవేని మనుష (శ్రీనివాస్)	( )	-
			కొమిరె రజనీకాంత్ (లక్ష్మయ్య)	( )	-
			-	దాలి (ఎంజాయిమెంట్ క్రమము)	-
మొత్తం విస్తీర్ణం 1-20					

గ్రామము: కొండాపూర్ మండలము:చిగురుమామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.175 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
144	ఖుష్కి/పట్టా	0-19	బత్తుల రాజయ్య (రాజయ్య)	బత్తుల రాజయ్య (రాజయ్య)	-
			బింగి ఆయిలయ్య (రామయ్య)	బింగి ఆయిలయ్య (రామయ్య)	-
	కెనాల్/కాలువ		నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	నీటి పారుదల ప్రాజెక్టులు (నీటి పారుదల ప్రాజెక్టులు)	-
మొత్తం విస్తీర్ణం 0-19					

గ్రామము: ఉల్లంపల్లి మండలము:చిగురుమామిడి జిల్లా: కరీంనగర్
కిలోమీటరు 1.285 నుండి కిలోమీటరు 2.245 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
210			గుంటచిన్న మల్లయ్య(బాలయ్య)	గుంటచిన్న మల్లయ్య(బాలయ్య)	-
			కానవేని శివప్రసాద్(కానవేని చంద్రయ్య)	()	-
				గుంటవెంకటి (బాలయ్య) (ఎంజాయ్‌మెంట్ క్రమము)	
218	ఖుష్కి/పట్టా	1-02	కానవేని కనకయ్య (మల్లయ్య)	కానవేని కనకయ్య (మల్లయ్య)	1-మామిడి 4-టేకు, 1-వేప
			గుర్రిల జ్ఞానేశ్వర్‌రావు సత్యనారాయణ	గుర్రిల జ్ఞానేశ్వర్‌రావు సత్యనారాయణ	-
			కానవేని రాజు (బాలయ్య)	కానవేని రాజు (బాలయ్య)	-
			ఎద్ల సునీత (సంపత్)	ఎద్ల సునీత (సంపత్)	-
219	ఖుష్కి/పట్టా	0-13	ఆలువాల యాదగిరి(మల్లయ్య)	ఆలువాల యాదగిరి(మల్లయ్య)	-
			ఆలువాల వర్ధరాములు(వెంకయ్య)	ఆలువాల వర్ధరాములు(వెంకయ్య)	-
			ఆలువాల సంపత్ (లస్మయ్య)	ఆలువాల సంపత్ (లస్మయ్య)	-
			ఆలువాల రమేష్ (రాజయ్య)	ఆలువాల రమేష్ (రాజయ్య)	-
			ఆలువాల శంకర్ (ఎల్లయ్య)	ఆలువాల శంకర్ (ఎల్లయ్య)	8-టేకు 5-వేప
			బాలగోని సునీత (తిరుపతి)	బాలగోని సునీత (తిరుపతి)	
			తాడ రాంరెడ్డి (బాల్ రెడ్డి)	తాడ రాంరెడ్డి (బాల్ రెడ్డి)	
				ఆలువాల పెద్ద శంకర్ (నర్సయ్య) ఎంజాయ్‌మెంట్ క్రమము	
220	ఖుష్కి/పట్టా	0-27	కోల రాదవ్వ (ఒదయ్య)	కోల రాదవ్వ (ఒదయ్య)	10-టేకు 1-పైప్‌లైన్
			కోల రాజమణి (రమేష్)	కోల రాజమణి (రమేష్)	1-ఉసిరి
225	ఖుష్కి/పట్టా	0-31	షేక్ హుస్సేన్ (చిన్న కాసిం)	షేక్ హుస్సేన్ (చిన్న కాసిం)	-
			బిక్కంటి సరోజన (బాలరాజు)	బిక్కంటి సరోజన (బాలరాజు)	-
			తల్ల సంపత్ (మల్లయ్య)	తల్ల సంపత్ (మల్లయ్య)	-
			ఆలేపాముల యుగంధర్ (లింగయ్య)	ఆలేపాముల యుగంధర్ లింగయ్య	-
				పట్టల సాయిలు (బాలరాజు) (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
226	ఖుష్కి/పట్టా	0-09	షేక్ హుస్సేన్ (చిన్నకాసిం)	షేక్ హుస్సేన్ (చిన్నకాసిం)	-
			ద్యావ కిషన్‌రెడ్డి(ప్రతాపరెడ్డి)	ద్యావ కిషన్‌రెడ్డి(ప్రతాపరెడ్డి)	-
			నాంపల్లి వెంకటేష్ (కొమరయ్య)	నాంపల్లి వెంకటేష్ (కొమరయ్య)	-
			బిక్కంటి శ్రీకాంత్(బాలరాజు)	బిక్కంటి శ్రీకాంత్(బాలరాజు)	-
			బిక్కంటి శ్రీనివాస్(బాలరాజు)	బిక్కంటి శ్రీనివాస్(బాలరాజు)	-
			బిక్కంటి సరోజన(బాలరాజు)	బిక్కంటి సరోజన(బాలరాజు)	-
			జంగ లక్ష్మి (శ్రీనివాస్ రెడ్డి)	()	-
230	ఖుష్కి/పట్టా	0-23	కీసర వెంకటయ్య(మల్లయ్య)	కీసర వెంకటయ్య(మల్లయ్య)	-
			కీసర ఐలయ్య (మల్లయ్య)	కీసర ఐలయ్య (మల్లయ్య)	-
			ఆలేపాముల యుగంధర్ (లింగయ్య)	ఆలేపాముల యుగంధర్ (లింగయ్య)	-
				కీసర కొమురయ్య(మల్లయ్య) (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
మొత్తం విస్తీర్ణం 4-15					

గ్రామం : కొమ్మనపల్లి మండలం: చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 2.245 నుండి కిలోమీటరు 4.025 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
424	ఖుష్కి/పట్టా	0-28 1/2	చల్ల ఎల్లయ్య (ఒదయ్య)	చల్ల ఎల్లయ్య (ఒదయ్య)	-
			అలుముంగ (లక్ష్మారెడ్డి)	అలుముంగ (లక్ష్మారెడ్డి)	-
			నురవరం స్వాతి (సుధీర్‌రెడ్డి)	నురవరం స్వాతి (సుధీర్‌రెడ్డి)	-
			పట్టాల సమ్మయ్య (వెంకటయ్య)	పట్టాల సమ్మయ్య (వెంకటయ్య)	-
				ఎండపల్లి నరసయ్య (వెంకటయ్య)	పడావ్
423	ఖుష్కి/పట్టా	0-11 1/2	తోట వీరమ్మ (వెంకటయ్య)	తోట వీరమ్మ (వెంకటయ్య)	1 పైప్ లైన్
422	బంజరాయి	0-27	దరిపల్లి రాజమ్మ (మల్లయ్య)	దరిపల్లి రాజమ్మ (మల్లయ్య)	-
			కత్తుల రవీందర (కొంరయ్య)	కత్తుల రవీందర్ (కొంరయ్య)	-
			కుంటెల్ల లచ్చమ్మ (నర్సయ్య)	కుంటెల్ల లచ్చమ్మ (నర్సయ్య)	-
			మామిడి వెంకటయ్య(లస్మయ్య)	మామిడి వెంకటయ్య(పోచయ్య)	-
			కుండేల్ల వెంకటమల్లయ్య (వెంకయ్య)	కుండేల్ల వెంకటమల్లయ్య (వెంకయ్య)	-
			మామిడి రాజయ్య(మల్లయ్య)	మామిడి రాజయ్య(మల్లయ్య)	-
			కత్తుల రాజవ్వ (రోశయ్య)	కత్తుల రాజవ్వ (రోశయ్య)	-
			కుండెల రాజవ్వ (మొండయ్య)	కుండెల రాజవ్వ (మొండయ్య)	-
			కుండెల్ల మల్లవ్వ (సమ్మయ్య)	కుండెల్ల మల్లవ్వ (సమ్మయ్య)	-
			కీసర బుచ్చవ్వ (కొంరయ్య)	కీసర బుచ్చవ్వ (కొంరయ్య)	-
			కీసర లక్ష్మవ్వ (అయిలయ్య)	కీసర లక్ష్మవ్వ (అయిలయ్య)	-
			కొలిపాకబాలలక్ష్మి (లింగయ్య)	కొలిపాకబాలలక్ష్మి (లింగయ్య)	-
			కత్తుల బాలవ్వ (రాజయ్య)	కత్తుల బాలవ్వ (రాజయ్య)	-
			చల్ల పద్మ (సమ్మయ్య)	చల్ల పద్మ (సమ్మయ్య)	-
			చల్ల సమ్మవ్వ (శ్రీనివాస్)	చల్ల సమ్మవ్వ (శ్రీనివాస్)	-
			కత్తుల నరవ్వ (కొంరయ్య)	కత్తుల నరవ్వ (కొంరయ్య)	-
			కత్తుల లచ్చవ్వ (ఎల్లయ్య)	కత్తుల లచ్చవ్వ (ఎల్లయ్య)	-
			కత్తుల స్వప్న (దేవేందర్)	కత్తుల స్వప్న (దేవేందర్)	-
			బొర్ర కొంరవ్వ (చంద్రయ్య)	బొర్ర కొంరవ్వ (చంద్రయ్య)	-
			చల్ల బుచ్చవ్వ (సాయిలు)	చల్ల బుచ్చవ్వ (సాయిలు)	-
			కత్తుల అంజయ్య (కొంరయ్య)	కత్తుల అంజయ్య (కొంరయ్య)	-
			కుండేళ్ల వెంకటయ్య (కుండేళ్ల మొండయ్య)	కుండేళ్ల వెంకటయ్య (కుండేళ్ల మొండయ్య)	-
			మామిడి సంపత్ (మల్లయ్య)	()	-
			మామిడి నర్సయ్య (మల్లయ్య)	()	-
			మామిడి రమేశ్ (మల్లయ్య)	()	-
			ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	ప్రభుత్వ భూములు (ప్రభుత్వ భూములు)	-
387	ఖుష్కి/పట్టా	0-16	బండి ఐలయ్య (చిన్నఎల్లయ్య)	బండి ఐలయ్య (చిన్నఎల్లయ్య)	-
			బండి వర్ధరాములు (చిన్నఎల్లయ్య)	బండి వర్ధరాములు(చిన్నఎల్లయ్య)	-
			కత్తుల యెల్లయ్య(మొండయ్య)	కత్తుల యెల్లయ్య(మొండయ్య)	-
			తోట వీరమ్మ (వెంకటయ్య)	తోట వీరమ్మ (వెంకటయ్య)	25-టేకు 5-చింత, 1-పైప్‌లైన్
			దరిపల్లి రమేష్ (మల్లయ్య)	దరిపల్లి రమేష్ (మల్లయ్య)	-
			కత్తుల మొండయ్య(పెద్ద అయిలయ్య)	కత్తుల మొండయ్య(పెద్ద అయిలయ్య)	-
			కత్తుల రోషమ్మ(పెద్ద అయిలయ్య)	కత్తుల రోషమ్మ(పెద్ద అయిలయ్య)	-
			దరిపెల్లి శ్రీనివాస్ (మల్లయ్య)	దరిపెల్లి శ్రీనివాస్ (మల్లయ్య)	-
			దరిపెల్లి సత్తవ్వ (దరిపెల్లి మల్లయ్య)	దరిపెల్లి సత్తవ్వ (దరిపెల్లి మల్లయ్య)	-
			-	రోడ్(ఎంజాయిమెంట్ క్రమము)	-
485	ఖుష్కి/పట్టా	0-09	గంప సహదేవ్(పెద్దబుచ్చయ్య)	గంప సహదేవ్(పెద్దబుచ్చయ్య)	-
			గంప సతీష్‌కుమార్(అంజయ్య)	గంప సతీష్‌కుమార్(అంజయ్య)	-
			గంప శ్రీకాంత్ (అంజయ్య)	గంప శ్రీకాంత్ (అంజయ్య)	-
			తోట కృష్ణం రాజ్ (వెంకటయ్య)	తోట కృష్ణం రాజ్(వెంకటయ్య)	33-మామిడి 5-జామ, 1-టేకు, 1-బోరు, 1-పైప్‌లైన్
			తోట నాగరాజు (వెంకటయ్య)	తోట నాగరాజు (వెంకటయ్య)	
			గంప లత (తిరుపతి)	గంప లత (తిరుపతి)	-
			గంప రమేష్ (సహదేవ్)	గంప రమేష్ (సహదేవ్)	-
			గంప రాధ (అంజయ్య)	గంప రాధ (అంజయ్య)	-
			గంప అంజయ్య (చంద్రయ్య)	గంప అంజయ్య (చంద్రయ్య)	-
487	ఖుష్కి/పట్టా	0-32	గంప సతీష్‌కుమార్(అంజయ్య)	గంప సతీష్‌కుమార్(అంజయ్య)	-
			గంప శ్రీకాంత్ (అంజయ్య)	గంప శ్రీకాంత్ (అంజయ్య)	-
			తోట కృష్ణంరాజ్ (వెంకటయ్య)	తోట కృష్ణంరాజ్ (వెంకటయ్య)	5-మామిడి
			తోట నాగరాజు(వెంకటయ్య)	తోట నాగరాజు(వెంకటయ్య)	
488	ఖుష్కి/పట్టా	0-18	బండి వర్ధరాములు(చిన్నఎల్లయ్య)	బండి వర్ధరాములు(చిన్నఎల్లయ్య)	1-వేప
			కొలిపాక వీరమల్లు (మల్లయ్య)	కొలిపాక వీరమల్లు (మల్లయ్య)	-
			తోట రజిత (శ్రీనివాస్)	తోట రజిత (శ్రీనివాస్)	3-వేప, 1-పైప్‌లైన్
			గంప రవీందర్ (అర్జయ్య)	గంప రవీందర్ (అర్జయ్య)	-
			తిరుపతి అర్జిత(అర్జిత కనకయ్య)	తిరుపతి అర్జిత(అర్జిత కనకయ్య)	-
			కొలిపాక రాజకుమార్(వెంకటేశ)	కొలిపాక రాజకుమార్(వెంకటేశ)	-
			కొలిపాక వెంకటయ్య(వెంకట్రాముడు)	కొలిపాక వెంకటయ్య(వెంకట్రాముడు)	-
			కొలిపాక శివశంకర్(సమ్మయ్య)	కొలిపాక శివశంకర్(సమ్మయ్య)	-
			దరిపల్లి నర్సవ్వ (కొమురయ్య)	దరిపల్లి నర్సవ్వ (కొమురయ్య)	-
			దరిపెల్లి సంధ్య (శ్రీనివాస్)	దరిపెల్లి సంధ్య (శ్రీనివాస్)	-
464	ఖుష్కి/పట్టా	0-24	దరిపెల్లి దేవయ్య (వెంకయ్య)	దరిపెల్లి దేవయ్య (వెంకయ్య)	-
			దరిపల్లి సమ్మయ్య (రాజయ్య)	దరిపల్లి సమ్మయ్య (రాజయ్య)	1-పైప్ లైన్ 1-టేకు
			తోట రజిత (శ్రీనివాస్)	తోట రజిత (శ్రీనివాస్)	5-మామిడి 1-పైప్‌లైన్ 1-బోర్
			గంప తిరుపతి (సహదేవ్)	గంప తిరుపతి (సహదేవ్)	-
			కుడుం ఆజీందర్ (కుడుం నర్సయ్య)	()	-
			తోట రవీంద్ (శ్రీనివాస్)	()	-
			కుడుల శారద(కుడుల ఆజీందర్)	()	-
460	ఖుష్కి/పట్టా	0-28	కొలిపాక వీరమల్లు(మల్లయ్య)	కొలిపాక వీరమల్లు(మల్లయ్య)	-
			కొలిపాక ఆయిలయ్య(మల్లయ్య)	కొలిపాక ఆయిలయ్య(మల్లయ్య)	15-టేకు
			కొలిపాక కనుకవ్వ(మల్లయ్య)	కొలిపాక కనుకవ్వ(మల్లయ్య)	-
			దరిపల్లి సమ్మయ్య(రాజయ్య)	దరిపల్లి సమ్మయ్య(రాజయ్య)	-
			దూడెల రాజు (కొక్కయ్య)	దూడెల రాజు (కొక్కయ్య)	-
[illegible]			[illegible]	[illegible]	
461	ఖుష్కి/పట్టా	0-22	[illegible]	[illegible]	
473	ఖుష్కి/పట్టా	0-14	[illegible]	[illegible]	
రోడ్డు		0-02	రోడ్డు	రోడ్డు	
మొత్తం విస్తీర్ణం 6-35					

గ్రామం : ఇందుర్తి మండలం చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 25.8 నుండి కిలోమీటరు 26.5 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
202	[illegible]		[illegible]	[illegible]	
203	ఖుష్కి/పట్టా	0-38	[illegible]	[illegible]	
204	ఖుష్కి/పట్టా	0-01	[illegible]	[illegible]	
మొత్తం విస్తీర్ణం 2-03					

గ్రామం : సుందరగిరి మండలం: చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.05 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
585/3	ఖుష్కి/పట్టా	0-08	దేవునూరి రాజవ్వ (రవీందర్)	దేవునూరి రాజవ్వ (రవీందర్)	-
			దేవునూరి కవిత (సదానందం)	దేవునూరి కవిత (సదానందం)	-
			దేవునూరి బ్రహ్మం(కనుకయ్య)	దేవునూరి బ్రహ్మం(కనుకయ్య)	-
			దేవునూరి రాజకుమార్(చంద్రయ్య)	దేవునూరి రాజకుమార్(చంద్రయ్య)	-
			దేవేనూరి వెంకటి (కనుకయ్య)	దేవేనూరి వెంకటి (కనుకయ్య)	-
	మొత్తం విస్తీర్ణం	0-08			

గ్రామం : ఇందుర్తి మండలం: చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 0.15 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
208	ఖుష్కి/పట్టా	0-06	మంద పోశయ్య (లచ్చయ్య)	()	
			మంద ముత్తయ్య(దుర్గయ్య)	మంద ముత్తయ్య (దుర్గయ్య)	-
			జాట్టు స్వామి (పోచయ్య)	()	
			మంద సాయయ్య (పోచయ్య)	()	
			మంద పెదరాజయ్య(మల్లయ్య)	మంద పెదరాజయ్య(మల్లయ్య)	
			మంద వెంకట్రాజం (లచ్చయ్య)	()	
			మంద రాజయ్య (దుర్గయ్య)	()	
			మంద స్వప్న (సదానందం)	మంద స్వప్న (సదానందం)	

గ్రామము : చిగురుమామిడి మండలం: చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 0.15 నుండి కిలోమీటరు 0.9 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
1113	ఖుష్కి/పట్టా	0-13	పింగిలి రాంరెడ్డి(మల్లారెడ్డి)	(పింగిలి రాంరెడ్డి) మల్లారెడ్డి	
			చందబోయిన లచ్చవ్వ (చంద్రయ్య)	చందబోయిన లచ్చవ్వ (చంద్రయ్య)	-
			పింగిలి కవిత (సంపత్ రెడ్డి)	పింగిలి కవిత (సంపత్‌రెడ్డి)	-
			బరిగెల పద్మ (యాదయ్య)	()	-
			బరిగెల తిరుపతి (సింగయ్య)	()	-
			[illegible]	()	-
				పింగిలి సంపత్‌రెడ్డి (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
రోడ్డు	రోడ్డు	0-0½		రోడ్డు	-
1115	ఖుష్కి/పట్టా	0-20	చంద్రబోయిన మల్లయ్య (చిన్న కొంరయ్య)	చంద్రబోయిన మల్లయ్య (చిన్న కొంరయ్య)	-
			చంద్రబోయిన లచ్చవ్వ (చంద్రయ్య)	చంద్రబోయిన లచ్చవ్వ (చంద్రయ్య)	-
			నక్క వెంకటయ్య(కొమురయ్య)	నక్క వెంకటయ్య(కొమురయ్య)	-
			జేల రజిత (అయిలయ్య)	జేల రజిత (అయిలయ్య)	-
			చందబోయిన రాజవ్వ(మల్లయ్య)	చందబోయిన రాజవ్వ(మల్లయ్య)	-
			నక్క సంపత్ (సాయిలు)	నక్క సంపత్ (సాయిలు)	-
			నక్క వర్ధరాములు (సాయిలు)	నక్క వర్ధరాములు (సాయిలు)	-
			చందబోయిన కోమలత(రవీందర్)	చందబోయిన కోమలత(రవీందర్)	-
			జాప్ప రమ్య (శ్రీనివాస్)	()	-
1138	ఖుష్కి/పట్టా	0-23	చందబోయిన చంద్రయ్య(ఒదేల)	చందబోయిన చంద్రయ్య(ఒదేల)	
[illegible]			[illegible]	[illegible]	
మొత్తం విస్తీర్ణం 3-26¼					

గ్రామము : ఇందుర్తి మండలం: చిగురుమామిడి జిల్లా : కరీంనగర్
కిలోమీటరు 0 నుండి కిలోమీటరు 1.655 వరకు

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
[illegible]			[illegible]	[illegible]	

గ్రామము: చిగురుమామిడి మండలము : చిగురుమామిడి జిల్లా:కరీంనగర్
కిలోమీటరు 1.655 నుండి కిలోమీటరు 1.871 వరకు మరియు
కిలోమీటరు 1.943 నుండి కిలోమీటరు 3.025

సర్వే నంబర్	భూమి వర్గీకరణ	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా	అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా	ఇతర వివరములు (ఇల్లు, చెట్లు, వగైరా)
1	2	3	4	5	6
1290	ఖుష్కి/పట్టా	0-12	కన్నం లింగయ్య (రాజమల్లయ్య)	కన్నం లింగయ్య (రాజమల్లయ్య)	
			కన్నం రవీందర్ (వెంకటమల్లయ్య)	కన్నం రవీందర్ (వెంకటమల్లయ్య)	-
			-	కన్నం రవీందర్ (వెంకటమల్లయ్య) (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
1291	ఖుష్కి/పట్టా	0-13	కర్ర పుష్ప (తిరుపతి రెడ్డి)	కర్ర పుష్ప (తిరుపతి రెడ్డి)	-
			కర్రపుష్ప (తిరుపతి రెడ్డి)	కర్ర పుష్పలత (తిరుపతి రెడ్డి)	-
			వడియాల ముకుంద రెడ్డి (వెంకటరెడ్డి)	()	-
1292	ఖుష్కి/	0-24	అయిరెడ్డి రాజిరెడ్డి(తిరుపతిరెడ్డి)	అయిరెడ్డి రాజి రెడ్డి (తిరుపతిరెడ్డి)	-
			అయిరెడ్డి రాజిరెడ్డి (తిరుపతి రెడ్డి)	()	-
			అయిరెడ్డి సత్యనారాయణ (వెంకటరాజిరెడ్డి)	అయిరెడ్డి సత్యనారాయణ (వెంకటరాజిరెడ్డి)	-
			ఎర్రెడ్డి రామ్ రెడ్డి (గణపతి రెడ్డి)	ఎర్రెడ్డి రామ్ రెడ్డి (గణపతి రెడ్డి)	-
			కర్ర పుష్ప (తిరుపతి రెడ్డి)	కర్ర పుష్ప (తిరుపతి రెడ్డి)	-
			ఏముగల సుజాత (తిరుపతి రెడ్డి)	ఏముగలసుజాత (తిరుపతి రెడ్డి)	-
1293	ఖుష్కి/పట్టా	0-11	-	అయిరెడ్డి రాజిరెడ్డి (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
1294	ఖుష్కి/పట్టా	0-14	అయిరెడ్డి విజయరెడ్డి (గణపతి రెడ్డి)	అయిరెడ్డి విజయరెడ్డి (గణపతి రెడ్డి)	-
1295	ఖుష్కి/పట్టా	0-25	పొతం మంగారెడ్డి (కేశవరెడ్డి)	పొతం మంగారెడ్డి (కేశవరెడ్డి)	-
			పొతం మంగారెడ్డి (కేశవరెడ్డి)	నాగెల్లి మంగ (అంజిరెడ్డి)	-
			నాగెల్లి సరోజన (నరేందర్‌రెడ్డి)	నాగెల్లి సరోజన (నరేందర్‌రెడ్డి)	-
			బీంరెడ్డి రాజేశ్వరి (లక్ష్మారెడ్డి)	బీంరెడ్డి రాజేశ్వరి (లక్ష్మారెడ్డి)	-
			బీంరెడ్డి లక్ష్మారెడ్డి (అగారెడ్డి)	బీంరెడ్డి లక్ష్మారెడ్డి (అగారెడ్డి)	-
			నాగెల్లి అంజి రెడ్డి (వీర రెడ్డి)	నాగెల్లి అంజిరెడ్డి (వీర రెడ్డి)	-
1304	ఖుష్కి/పట్టా	0-31	నాగెల్లి వీరారెడ్డి (రాజిరెడ్డి)	నాగెల్లి వీరారెడ్డి (రాజిరెడ్డి)	-
			నాగెల్లి సరోజన (రాంరెడ్డి)	నాగెల్లి సరోజన (రాంరెడ్డి)	-
			బీంరెడ్డి రాజేశ్వరి (లక్ష్మారెడ్డి)	బీంరెడ్డి రాజేశ్వరి (లక్ష్మారెడ్డి)	-
			బీంరెడ్డి లక్ష్మారెడ్డి (అగారెడ్డి)	బీంరెడ్డి లక్ష్మారెడ్డి (అగారెడ్డి)	-
			నాగెల్లి అంజి రెడ్డి (వీర రెడ్డి)	నాగెల్లి అంజి రెడ్డి (వీర రెడ్డి)	-
			గౌంగిరెడ్డి నవీన్ రెడ్డి (మోహన్ రెడ్డి)	గౌంగిరెడ్డి నవీన్ రెడ్డి (మోహన్ రెడ్డి)	-
			నాగెల్లి కళావతి (భగవాన్ రెడ్డి)	నాగెల్లి కళావతి (భగవాన్ రెడ్డి)	-
1308	ఖుష్కి/పట్టా	0-05	మంగాలత లక్ష్మి (మాధవరెడ్డి)	()	-
			బోయిని విజయలక్ష్మి (లక్ష్మణ్)	()	-
			బోయిని కొంరయ్య (బోందయ్య)	బోయిని కొంరయ్య (బోందయ్య)	-
			బోయిని లక్ష్మయ్య (బోందయ్య)	బోయిని లక్ష్మయ్య (బోందయ్య)	-
			బోయిని నర్సవ్వ (బోందయ్య)	()	-
			కాల్వ మల్లేశం (రాజమల్లు)	కాల మల్లేశం (రాజమల్లు)	-
1309	ఖుష్కి/పట్టా	0-09	ఆన్నాడి సుజాత (అన్నాడి తిరుపతిరెడ్డి)	అన్నాడి సుజాత (అన్నాడి తిరుపతిరెడ్డి)	-
			కాసం అనూష (కాసం తిరుపతి రెడ్డి)	కాసం అనూష (కాసం తిరుపతి రెడ్డి)	-
1310			-	కాసం అనూష (కాసం తిరుపతి రెడ్డి (ఎంజాయ్ మెంట్ క్రమము)	-
			-	కాల్వ మల్లేశం (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
			-	కాల్వ స్వప్న (ఎంజాయ్‌మెంట్ క్రమము)	-
1311	ఖుష్కి/పట్టా	0-34	అనుమాండ్ల వెంకట్ రెడ్డి (కిష్టారెడ్డి)	అనుమాండ్ల వెంకట్ రెడ్డి (కిష్టారెడ్డి)	-
			అనుమాండ్ల వెంకట్ రెడ్డి (కిష్టారెడ్డి)	అనుమాండ్ల వెంకట్ రెడ్డి (కిష్టారెడ్డి)	-
			కాల్వ స్వప్న (కాల్వ మల్లేశం)	కాల్వ స్వప్న (కాల్వ మల్లేశం)	-
			కాల్వ మల్లేశం (రాజమల్లు)	కాల్వ మల్లేశం (రాజమల్లు)	-
				రోడ్డు (ఎంజాయ్‌మెంట్ క్రమము)	
1333	ఖుష్కి/పట్టా	1-10	యెల్లారెడ్డి రాంచంద్ర రెడ్డి (పోచయ్య)	యెల్లారెడ్డి రాంచంద్ర రెడ్డి పోచయ్య	-
			అయిరెడ్డి లక్ష్మి (ఆనందరెడ్డి)	అయిరెడ్డి లక్ష్మి (ఆనందరెడ్డి)	-
			ఎదల సత్య కృష్ణ ప్రసాద్ (రామ రావు)	ఎదల సత్య కృష్ణ ప్రసాద్ (రామ రావు)	-
			వట్టికూటి పట్టాభిరామయ్య (గంగయ్య)	వట్టికూటి పట్టాభిరామయ్య (గంగయ్య)	-
			బైరి రవీందర్ (రాజేశం)	()	-
			బైరి వెంకటేష్ (రాజేశం)	బైరి వెంకటేష్ (రాజేశం)	-
1413	ఖుష్కి/పట్టా	0-32	అనుమాండ్ల శ్రీనివాస రెడ్డి మల్లయ్య	అనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి మల్లయ్య	-
			అనుమాండ్ల వెంకటరెడ్డి	()	-
			అనుమాండ్ల జైపాల్ రెడ్డి (వెంకట్ రెడ్డి)	అనుమాండ్ల జైపాల్ రెడ్డి (వెంకట్ రెడ్డి)	-
			అనుమాండ్ల సాయిచందర్ రెడ్డి (రాజిరెడ్డి)	అనుమాండ్ల సాయిచందర్ రెడ్డి (రాజిరెడ్డి)	-
			అనుమాండ్ల మహేష్‌రెడ్డి(రాజిరెడ్డి)	అనుమాండ్ల మహేష్‌రెడ్డి(రాజిరెడ్డి)	-
[illegible]			[illegible]	[illegible]	
			నల్లాల రాజు (బాల్ రెడ్డి)	నల్లాల రాజు (బాల్ రెడ్డి)	-
మొత్తం విస్తీర్ణం 2-30					
పూర్తి విస్తీర్ణం 40-15¾					

కావున, భూసేకరణ చట్టము 2013 (నెం.30/2013) లోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు తెలియజేయుటకు గాను ఇట్టి ప్రకటన జారి చేయనైనది. భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, కరీంనగర్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, కరీంనగర్ కార్యాలయము నందు ఉంచబడడమైనది. ఇట్టిది, సంబంధిత వ్యక్తులు, ఏదైనా పనిదినములందు కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.

సదరు చట్టములోని సెక్షను 12 ననుసరించి, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, కరీంనగర్, తహసీల్దార్, చిగురుమామిడి గారలు గానీ వారి తరపున వారి సిబ్బంది సదరు భూమిలో ప్రవేశించి, సర్వే చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టములోని సెక్షన్ 11 (4) ననుసరించి, సేకరణకు ప్రతిపాదించిన భూములందు జిల్లా కలెక్టర్, కరీంనగర్ గారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా ఇట్టి ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి, షెడ్యూలులో ప్రకటించిన భూములలో క్రయ విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టములోని సెక్షన్ 15(1) లో పేర్కొన్న అంశములపై, ప్రతిపాదిత భూసేకరణ విషయములో ఏమైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్నయెడల సంబంధిత వ్యక్తులు ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేది నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, కరీంనగర్ / రెవెన్యూ డివిజనల్ అధికారి, కరీంనగర్ గారికి లిఖిత పూర్వకముగా తెలియజేసుకోవచ్చును.

సం/-
భూసేకరణ అధికారి &
రెవెన్యూ డివిజనల్ అధికారి,
కరీంనగర్

సం/-
అదనపు కలెక్టర్,
కరీంనగర్

సం/-
జిల్లా కలెక్టర్,
కరీంనగర్

DIPR RO.NO:304/LA-PP/ADVT/PUBLICATION/2024-25

పసిడి రూ.80,000కు చేరువలో



సరికొత్త రికార్డు స్థాయికి 10 గ్రాముల ధర

ఢిల్లీ మార్కెట్లో రూ.79,900కు చేరిక

అంతర్జాతీయ విపణిలో 2,700 డాలర్లు దాటిన ఔన్స్ పసిడి

న్యూఢిల్లీ: బంగారం ధరలు మళ్లీ దూసుకుపోతున్నాయి. శుక్రవారం పసిడి రూ.80,000 మైలురాయికి చేరువైంది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం మరో రూ.550 పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.79,900కు చేరుకుంది. దేశీయంగా పసిడి ధర ఎగబాకడం వరుసగా ఇది మూడో రోజు. అంతర్జాత విపణిలో స్వర్ణం మరింత ప్రియమవడం, పండగ సీజన్ కావడంతో ఆభరణ వర్తకులు, స్టాకిస్టులు కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. పుత్తడితో పాటు వెండి కూడా ఎగబాకింది. కిలో వెండి రూ.1,000 పెరిగి రూ.94,500 ధర పలికింది. కాగా, హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ.870 పెరుగుదలతో రూ.78,980కి చేరుకుంది. 22 క్యారెట్ల రేటు రూ.800 పెరిగి రూ.72,400గా నమోదైంది. కిలో వెండి రూ.2,000 ఎగబాకి రూ.1.05 లక్షలు ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ తొలిసారిగా 2,700 డాలర్ల స్థాయిని అధిగమించి, సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 0.76 శాతం పెరిగి 2,728.10 డాలర్ల వద్దకు చేరుకుంది. సిల్వర్ 32.30 డాలర్ల వద్ద ట్రేడైంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న విషయంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా బులియన్ ధరలు మళ్లీ దూసుకెళ్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతేకాదు, అమెరికాతో పాటు అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లు తగ్గిస్తుండటం కూడా పసిడి ధరలను ఎగదోస్తున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గత ద్రవ్యపరపతి సమీక్షలో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును ఏకంగా 0.5 శాతం తగ్గించింది. వచ్చే సమీక్షలో ఫెడ్ రేట్లు మరింత తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. అంతేకాదు, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను గురువారం మరో 0.25 శాతం తగ్గించింది. తాజా గోల్డ్ ర్యాలీకి ఇది కూడా కారణమైంది.

సాధారణంగా ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో బంగారం కంటే స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి మళ్లుతుంటాయి.

రూ.500 లక్షల కోట్లు

ఎన్ఎస్‌డీఎల్ వద్ద డీమ్యాట్ రూపంలో ఉన్న మొత్తం సెక్యూరిటీల విలువ ఇది..

న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబరు చివరినాటికి తమ వద్ద ఎలక్ట్రానిక్ లేదా డీమెటీరియలైజ్ (డీమ్యాట్) రూపంలో ఉన్న మొత్తం సెక్యూరిటీల విలువ తొలిసారిగా రూ.500 లక్షల కోట్ల (6 లక్షల కోట్ల డాలర్లు) స్థాయిని దాటిందని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) వెల్లడించింది. ఈ చారిత్రక సందర్భంలో ఇన్వెస్టర్లు, మార్కెట్ వర్గాలు, నియంత్రణ సంస్థలతో పాటు సంబంధిత వర్గాలందరికీ ఎన్ఎస్‌డీఎల్ తాత్కాలిక ఎండీ ఎస్ గోపాలన్ ధన్యవాదాలు తెలిపారు. డిపాజిటరీ వద్ద డీమ్యాట్ రూపంలో ఉన్న సెక్యూరిటీల విలువ 2014 జూన్‌లో రూ.100 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంది. ఇందుకు 18 ఏళ్లు పట్టింది. ఆ తర్వాత ఆరేళ్లలో (2020 నవంబరు) రూ.200 లక్షల కోట్లకు, ఆపై నాలుగేళ్లలో రూ.500 లక్షల కోట్లకు ఎగబాకింది. గత నెలాఖరు నాటికి ఎన్ఎస్‌డీఎల్ యాక్టివ్ క్లయింట్ ఖాతాల సంఖ్య 3,80,89,585కు చేరుకుంది.

జోయాలుక్కాస్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి పండగను పురస్కరించుకుని ప్రముఖ ఆభరణాల రిటైల్ సంస్థ జోయాలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. జోయ్ దీపావళి పేరుతో తీసుకువచ్చిన ఈ ఆఫర్లు ఈ నెల 18 నుంచి నవంబరు 3 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఆఫర్‌లో భాగంగా వినియోగదారులు రూ.లక్ష అంతకుపైబడి విలువ చేసే డైమండ్, అన్ కట్ డైమండ్ ఆభరణాల కొనుగోలుపై ఉచితంగా 1 గ్రాము బంగారు కాయిన్‌ను అందించనున్నట్లు వెల్లడించింది. అలాగే రూ.50,000 అంతకు పైబడిన విలువ చేసే బంగారం, ప్రీషియస్ జువెలరీ కొనుగోళ్లపై రూ.1,000 గిఫ్ట్ వోచర్, రూ.10,000 అంతకు మించిన వెండి ఆభరణాల కొనుగోలుపై రూ.500 గిఫ్ట్ వోచర్‌ను అందించనుంది. అలాగే వినియోగదారులు 10 శాతం ముందస్తు చెల్లింపుతో ప్రస్తుతమున్న బంగారం ధరను లాక్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు. కస్టమర్లు తమ పాత బంగారాన్ని.. హెచ్‌యూఐడీ 916 హాల్‌మార్క్ కలిగిన జువెలరీతో మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జోయాలుక్కాస్ తెలిపింది.

వడ్డీ రేట్ల తగ్గింపునకు ఇది సమయం కాదు..

ఆర్‌బీఐ గవర్నర్ దాస్

న్యూఢిల్లీ: దేశంలో వడ్డీ రేట్లు ఇప్పుడే తగ్గవని మరోసారి స్పష్టమైంది. ధరల సెగ నేపథ్యంలో కీలక రెపో రేటు తగ్గింపునకు ఇంకా సమయం ఆసన్నం కాలేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ఇండియా క్రెడిట్ ఫోరమ్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. 'రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై వసూలు చేసే రెపో రేటు తగ్గించడం తొందరపాటు చర్య అవుతుంది. అది ఆర్థిక వ్యవస్థనీ దెబ్బతీసే అవకాశం ఉంది' అని దాస్ అన్నారు.

డేటానే కీలకం: వడ్డీ రేట్లు ఎప్పుడు తగ్గుతాయనే విషయం సూచనప్రాయంగా చెప్పేందుకూ దాస్ నిరాకరించారు. అందుబాటులో ఉండే వివరాలు (డేటా), భవిష్యత్ అంచనాల ఆధారంగా మాత్రమే వడ్డీ రేట్లు, ద్రవ్య, పరపతి విధానాలపై తమ నిర్ణయాలు ఉంటాయన్నారు.



ఐసీఎస్ఐ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సామాజిక బాధ్యతలో సీఎస్‌ల పాత్ర కీలకం

యువ సీఎస్‌లు కొత్త నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంపెనీల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)ల నిర్వహణలో కంపెనీ సెక్రటరీ (సీఎస్)లది కీలక పాత్ర అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సౌత్ ఇండియా రీజినల్ చాప్టర్ నిర్వహించిన సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. తెలివితేటలే ప్రగతికి చోదక శక్తులన్నారు. దివాలా, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్, వాల్యుయేషన్, ఫోరెన్సిక్ ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్లలోనూ సీఎస్‌లది కీలక పాత్ర అన్నారు. సీఎస్ కోర్సు పూర్తి చేస్తున్న యువకులు తాజా మార్పులనూ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని గవర్నర్ కోరారు. మారిటైమ్ లా, క్యాపిటల్ మార్కెట్లకు సంబంధించి ఐసీఎస్ఐ ప్రత్యేక సీఎస్‌లను తీర్చిదిద్దడంపైనా గవర్నర్ సంతోషం వ్యక్తం చేశారు.

రెండు లక్షల మంది సీఎస్‌లు అవసరం: దేశంలో కంపెనీ సెక్రటరీల అవసరం ఏటికేటికీ పెరుగుతోందని ఐసీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు నరసింహన్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 74,000 మంది సీఎస్‌లు ఉన్నారు. 2047 నాటికి వీరి సంఖ్య రెండు లక్షలకు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌సీఎల్‌టీ కేసులు చూసే ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీల కోసం హైదరాబాద్‌లో రూ.10 కోట్ల అంచనాతో ప్రత్యేక భవనం నిర్మించనున్నట్లు ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సభ్యుడు ఆర్ వెంకటరమణ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఏపీ, తెలంగాణల్లో గోద్రెజ్ క్యాపిటల్ విస్తరణ

వచ్చే మార్చి నాటికి రూ.800 కోట్ల ఏయూఎం లక్ష్యం

సంస్థ ఎండీ మనీష్ షా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ విభాగాలకు అవసరమైన రుణాలను అందిస్తున్న గోద్రెజ్ క్యాపిటల్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. దక్షిణాదిలో రెండు తెలుగు రాష్ట్రాలు కంపెనీకి ఎంతో కీలకంగా ఉన్నాయని, కార్యకలాపాల విస్తరణ ద్వారా మరింత పట్టును చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ,సీఈఓ మనీష్ షా తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని ఐదు నగరాల్లో 6 శాఖల ద్వారా కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోందని, విస్తరణలో భాగంగా ఈ ఏడాది కొత్తగా మరో 10 శాఖలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా ఏపీ, తెలంగాణల్లో కంపెనీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.500 కోట్లుగా ఉందని, వచ్చే ఏడాది మార్చి నాటికి దీన్ని రూ.800 కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నట్లు షా తెలిపారు. ఎంఎస్ఎంఈ, ఎస్ఎంఈ రంగంలోని కంపెనీలకు వర్కింగ్ క్యాపిటల్ కింద సెక్యూర్డ్, అన్ సెక్యూర్డ్ రుణాలను గోద్రెజ్ క్యాపిటల్ అందిస్తోంది. కాగా సప్లయ్-చెయిన్ రంగాలకు ఫైనాన్సింగ్ సేవలను విస్తరించామని, ఇందులో భాగంగా క్రీమ్‌లైన్ డెయిరీతో కలిసి డెయిరీ ఫార్మ్ లోన్‌ను ప్రారంభించినట్లు షా చెప్పారు. అలాగే వచ్చే రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లోని గృహ రుణ విభాగంలోకి ప్రవేశించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఏయూఎం రూ.13,600 కోట్లుగా ఉందని, మార్చి నాటికి దీన్ని రూ.17,000 కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నట్లు షా చెప్పారు.

రెండు ఉపగ్రహాల అనుసంధానం

అనంత్ టెక్నాలజీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏటీఎల్) మరో రెండు ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) త్వరలో ప్రయోగించే 400 కిలోల శ్రేణిలోని రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అసెంబ్లింగ్, అనుసంధానం, టెస్టింగ్ (ఏఐటీ) పూర్తి చేసినట్లు తెలిపింది. బెంగళూరులో ఏటీఎల్‌కు చెందిన ఏరోస్పేస్ పార్కులో కంపెనీ ఈ పని పూర్తి చేసింది. ఇస్రోకు చెందిన ఈ తరహా ఉపగ్రహాలకు ఒక ప్రైవేట్ కంపెనీ ఇలాంటి సేవలు అందించడం ఇదే మొదటిసారి. గత కొద్ది సంవత్సరాలుగా మౌలిక సదుపాయాలు, సుశిక్షితులైన మానవ వనరులపై పెట్టిన పెట్టుబడులతో ఇది సాధ్యమైందని కంపెనీ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు.

3 రోజుల తర్వాత లాభాలు

సెన్సెక్స్ 218 పాయింట్లు అప్

ముంబై: వరుసగా మూడు రోజులు నష్టపోయిన ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్పంగా లాభపడ్డాయి. శుక్రవారం నష్టాల్లోనే ప్రారంభమైన సెన్సెక్స్.. క్రమంగా తేరుకుని మధ్యాహ్నానికల్లా లాభాలపట్టింది. ఒక దశలో సూచీ 385 పాయింట్లు ఎగబాకి 81,391 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 218.14 పాయింట్ల లాభంతో 81,224.75 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104.20 పాయింట్ల వృద్ధితో 24,854.05 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,980 ▲	72,400 ▲	1,05,000 ▲
ముంబై	77,410 ▲	70,908 ▲	92,283 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ

హైదరాబాద్	490	విజయవాడ	510
వరంగల్	492	గోదావరి	505
చిత్తూరు	538	విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

స్పోర్ట్స్

1 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ క్యాలెండర్ ఇయర్‌లో 100 సిక్స్‌లు బాదిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. ఇంతకుముందు (2022) 89 సిక్స్‌లు కొట్టిన రికార్డు ఇంగ్లండ్ పేరిట ఉంది.

4 టెస్టుల్లో కోహ్లీ 9000 పరుగుల మైలురాయిని చేరుకొన్నాడు. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ (15,921), ద్రవిడ్ (13,265), గవాస్కర్ (10,122) తర్వాత నాలుగో భారత బ్యాటర్‌గా.. ఓవరాల్‌గా 18వ ఆటగాడిగా విరాట్ నిలిచాడు.

అద్భుతం చేస్తారా!

పోరాడుతున్న టీమిండియా

కోహ్లీ, రోహిత్, సర్ఫరాజ్ అర్ధ శతకాలు

- భారత్ రెండో ఇన్నింగ్స్ 231/3
- రచిన్ సెంచరీ ● కివీస్ 402 ఆలౌట్



సర్ఫరాజ్ (70 బ్యాటింగ్) కోహ్లీ (70)

బెంగళూరు: తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 46 పరుగులకే కుప్పకూలిన భారత్.. విరాట్, రోహిత్, సర్ఫరాజ్ దూకుడైన అర్ధ శతకాలతో ఏదో అద్భుతం చేసే విధంగా పోరాడుతోంది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 180/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కివీస్ 402 పరుగుల భారీ స్కోరు చేసింది. రచిన్ రవీంద్ర (134) శతకంతో అదరగొట్టగా.. టిమ్ సౌథీ (65) విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జడేజా, కుల్దీప్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. 356 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. ఆఖరి బంతికి కోహ్లీ (70) అవుట్ కాగా.. సర్ఫరాజ్ (70 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (52), యశస్వీ జైస్వాల్ (35)ను ఎజాజ్ పటేల్ అవుట్ చేశాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు టీమిండియా ఇంకా 125 పరుగులు వెనుకబడింది. మొత్తంగా బ్యాటర్ల జోరుతో శుక్రవారం ఒక్కరోజే 453 పరుగులు నమోదయ్యాయి.

సౌథీ ఎదురుదాడి..: రచిన్, సౌథీ అనూహ్యంగా 8వ వికెట్‌కు 137 పరుగులు జోడించడంతో.. న్యూజిలాండ్ స్కోరు 400 పరుగులు దాటింది. తొలి సెషన్‌లోనే ఓవర్‌నైట్ బ్యాటర్ మిచెల్ (18)ను సిరాజ్ అవుట్ చేయగా.. బ్లండెల్ (5)ను బుమ్రా పెవిలియన్ చేర్చాడు. ఫిలిప్స్ (14), హెన్రీ (8)ను జడేజా బౌల్డ్ చేయడంతో.. కివీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగదనిపించింది. అయితే, సెటిల్డ్ బ్యాటర్‌కు సౌథీ అండగా నిలిచాడు. భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న రచిన్ సెంచరీ పూర్తి చేసుకోగా.. సౌథీ దూకుడు కనబర్చాడు. దీంతో లంచ్ సమయానికి న్యూజిలాండ్ 345/7తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న సౌథీని సిరాజ్ క్యాచవుట్ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. ఎజాజ్ పటేల్ (4), రచిన్‌ను అవుట్ చేసిన కుల్దీప్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 12 ఏళ్ల తర్వాత భారత గడ్డపై శతకం చేసిన కివీస్ ఆటగాడిగా రచిన్ నిలిచాడు.



రచిన్ రవీంద్ర (134)

అదరగొట్టిన కోహ్లీ, సర్ఫరాజ్..: భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్.. దూకుడైన ఆటతో అలరించింది. కోహ్లీ ఈ ఏడాది తొలి అర్ధ శతకంతోపాటు భారీషాట్లు ఆడడం ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఆరంభంలో జైస్వాల్‌లో కొంత తడబాటు కనిపించినా.. రోహిత్ మాత్రం సహజశైలిలో షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, 17వ ఓవర్‌లో పటేల్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన జైస్వాల్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాగా, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రోహిత్ భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినా.. దురదృష్టవశాత్తు పటేల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఆ దశలో కోహ్లీ, సర్ఫరాజ్ జట్టు బాధ్యతలను భుజాన వేసుకొన్నారు. విరాట్‌కు ఈ ఏడాది ఇదే తొలి హాఫ్ సెంచరీ. క్రీజులో కుదురుకొన్న వీరిద్దరూ మూడో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియా రోజును మెరుగ్గా ముగిస్తుందనిపించింది. కానీ, చివరి బంతికి ఫిలిప్స్ బౌలింగ్‌లో కోహ్లీ క్యాచవుట్ కావడం.. అభిమానులను నిరాశకు గురిచేసింది.

వెంటాడిన దురదృష్టం



జోరుమీదున్న రోహిత్ అనూహ్యంగా అవుటయ్యాడు. స్పిన్నర్ పటేల్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడేందుకు రోహిత్ ముందుకు వంగాడు. కానీ, బ్యాట్ లోపలి అంచుకు తగిలిన బంతి బౌన్స్ అయి వికెట్లకు తగిలింది. దీంతో రోహిత్ నమ్మశక్యం కానిరీతిలో క్రీజును వదిలాడు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46 ఆలౌట్; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లేథమ్ (ఎల్బీ) కుల్దీప్ 15, కాన్వే (బి) అశ్విన్ 91, యంగ్ (సి) కుల్దీప్ (బి) జడేజా 33, రచిన్ (సి/సబ్) జురెల్ (బి) కుల్దీప్ 134, మిచెల్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 18, బ్లండెల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 5, ఫిలిప్స్ (బి) జడేజా 14, హెన్రీ (బి) జడేజా 8, సౌథీ (సి) జడేజా (బి) సిరాజ్ 65, ఎజాజ్ (ఎల్బీ) కుల్దీప్ 4, ఓరౌర్క్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 91.3 ఓవర్లలో 402 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-67, 2-142, 3-154, 4-193, 5-204, 6-223, 7-233, 8-370, 9-384; **బౌలింగ్:** బుమ్రా 19-7-41-1, సిరాజ్ 18-2-84-2, అశ్విన్ 16-1-94-1, కుల్దీప్ 18.3-1- 99-3, జడేజా 20-1-72-3.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్) బ్లండెల్ (బి) పటేల్ 35, రోహిత్ (బి) పటేల్ 52, కోహ్లీ (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ (బ్యాటింగ్) 70, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 49 ఓవర్లలో 231/3; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231; **బౌలింగ్:** సౌథీ 7-1-22-0, హెన్రీ 11-1-52-0, ఓరౌర్క్ 11-1-48-0, ఎజాజ్ పటేల్ 12-2-70-2, ఫిలిప్స్ 8-1-36-1.

ఫైనల్లో న్యూజిలాండ్

టీ20 మహిళల వరల్డ్ కప్

- వెస్టిండీస్ ఓటమి
- దక్షిణాఫ్రికాతో తుదిపోరు రేపు

షార్జా: పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత న్యూజిలాండ్ మహిళలు టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరారు. శుక్రవారం ఉత్కంఠగా జరిగిన రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్ 8 పరుగులతో వెస్టిండీస్‌ను ఓడించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 128/9 స్కోరు చేసింది. జార్జ్ ప్లిమ్మర్ (33), సుజీ బేట్స్ (26), ఇసబెల్లా గేజ్ (20) సత్తా చాటారు. డాటిన్ 4, ఫ్లెచర్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 120/8 స్కోరుకే పరిమితమైంది. బౌలింగ్‌లో అదరగొట్టిన డాటిన్ (33) మెరుపు బ్యాటింగ్‌తో పోరాడింది. కానీ 17వ ఓవర్లో డాటిన్ అవుటవడంతో మ్యాచ్ కివీస్‌వైపు మొగ్గింది. ఆపై ఫ్లెచర్ (17 నాటౌట్), జైదా (14) విండీస్‌ను గెలిపించేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు. కార్సన్ 3, కెర్ 2 వికెట్లు తీశారు. ఇక.. ఆదివారం జరిగే ఫైనల్లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ తలపడనున్నాయి.

సంక్షిప్తస్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 128/9 (ప్లిమ్మర్ 33, బేట్స్ 26, ఇసబెల్లా 20 నాటౌట్, డోటిన్ 4/22, ఆలీ ఫ్లెచర్ 2/22).

వెస్టిండీస్: 20 ఓవర్లలో 120/8 (డాటిన్ 33, ఫ్లెచర్ 17 నాటౌట్, జైడా 14, కార్సన్ 3/29, కెర్ 2/14).

భారత్–పాక్ సై

ఎమర్జింగ్ టీమ్స్ పోరు నేడు



మ్యాచ్ రా. 7 నుంచి

అల్అమారత్ (మస్కట్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భాగంగా శనివారం కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్ 'బి'లో హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్సీలోని భారత్ 'ఎ' జట్టు పాకిస్థాన్ 'ఎ'ను ఢీకొననుంది. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడుతున్నాయి. గ్రూప్ 'బి'లో భారత్, పాక్‌తోపాటు ఒమన్, యూఏఈ జట్లున్నాయి. రెండు గ్రూపుల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.

టైటాన్స్ బోణీ



ప్రారంభ వేడుకలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ టైటాన్స్, బుల్స్ సారథులు పవన్, ప్రదీప్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 11లో తెలుగు టైటాన్స్ శుభారంభం చేసింది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన లీగ్ ప్రారంభోత్సవానికి బాలీవుడ్ నటులు విద్యాబాలన్, కార్తీక్ ఆర్యన్ హాజరై సందడి చేశారు. ఆ తర్వాత జరిగిన సీజన్ తొలి మ్యాచ్‌లో టైటాన్స్ 37-29తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ షెహ్రావత్ 13 పాయింట్లతో అదరగొట్టగా, డిఫెండర్ క్రిషన్ ధుల్ 6 పాయింట్లు సాధించి, జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. టైటాన్స్ స్టార్ రైడర్ పవన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో 1200 రైడ్ పాయింట్ల మైలురాయిని చేరుకోవడం విశేషం. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి బెంగళూరును టైటాన్స్ రెండుసార్లు ఆలౌట్ చేసింది. బెంగళూరు కెప్టెన్, స్టార్ రైడర్ పర్దీప్ నర్వాల్ 3 పాయింట్లకే పరిమితమవడం ఆ జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. మరోమ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 36-28తో యుముంబాను ఓడించింది.



చాంపియన్ అర్జున్

లండన్: వరంగల్ కుర్రాడు అర్జున్ ఇరిగేసి డబ్ల్యూఆర్ చెస్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్ రౌండ్లో ఫ్రాన్స్ జీఎం మాగ్జిమ్ వాచెర్ లగ్రావెను ఓడించి అర్జున్ టైటిల్ దక్కించుకున్నాడు. ఫైనల్లో మొదట క్లాసికల్ చెస్‌లో రెండు గేమ్‌లూ డ్రాగా ముగిశాయి. దీంతో విజేతను తేల్చేందుకు జరిగిన ఆర్మగెడాన్ గేమ్‌లో మాగ్జిమ్‌ను అర్జున్ ఓడించి ట్రోఫీ అందుకున్నాడు. అర్జున్‌కు రూ. 18 లక్షలు ప్రైజ్‌మనీ లభించింది. అంతేకాదు, ఈ ప్రదర్శనతో అర్జున్ లైవ్ ఎలో రేటింగ్‌లో 2796కు చేరుకున్నాడు. ఆదివారం నుంచి జరిగే యూరోపియన్ కప్‌తో 2800 ఎలో రేటింగ్ మార్క్‌ను కూడా అర్జున్ అందుకునే అవకాశముంది.



లలిత్‌బాబుకు 'పట్టాయ' టైటిల్

పట్టాయ శ్రీరాచ చెస్ టైటిల్‌ను విజయవాడ గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబు గెల్చుకున్నాడు. థాయ్‌లాండ్‌లో శుక్రవారం ముగిసిన ఆఖరిదైన 9వ రౌండ్‌లో ఇండోనేసియా ఐఎం ఆదిత్య బగుస్ అర్ఫాన్‌తో తలపడిన లలిత్ డ్రాగా ముగించాడు. తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి లలిత్ 7 పాయింట్లతో విజేతగా నిలిచాడు.

పాక్ ఘన విజయం

నోమన్‌కు 8 వికెట్లు | **మూడున్నరేళ్ల తర్వాత స్వదేశంలో టెస్ట్ గెలుపు**

ముల్తాన్: మూడున్నర సంవత్సరాలు, 11 టెస్టుల అనంతరం పాకిస్థాన్ జట్టు స్వదేశంలో విజయాన్ని అందుకుంది. శుక్రవారం ముగిసిన రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ 152 పరుగులతో పాక్ చేతిలో చిత్తయింది. 297 పరుగుల లక్ష్యంతో, ఓవర్‌నైట్ 36/2 స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు 144 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ పది వికెట్లను స్పిన్నర్లు నోమన్ అలీ (8/46), సాజిద్ ఖాన్ (2/93) తీశారు. మొదటి ఇన్నింగ్స్ పది వికెట్లనూ వారిద్దరే చేజిక్కించుకున్నారు. ఇలా ఓ టెస్ట్ మ్యాచ్‌లో 20 వికెట్లను ఇద్దరు బౌలర్లే కైవసం చేసుకోవడం 1972 తర్వాత ఇదే తొలిసారి. ఇక..మ్యాచ్‌లో పాక్ 366, 221 రన్స్ చేయగా, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 291 స్కోరు సాధించింది.

క్వార్టర్స్‌లో సింధు ఓటమి

ఓడెన్స్: డెన్మార్క్ ఓపెన్‌లో క్వార్టర్స్‌లో పీవీ సింధు పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సింధు 13-21, 21-16, 9-21తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో ఓటమిపాలైంది. గతంలో గ్రెగోరియాతో 12 సార్లు ముఖాముఖి తలపడి ఏకంగా పదిసార్లు గెలిచిన సింధు ఈసారి మాత్రం మునుపటి ప్రదర్శన కనబర్చలేకపోయింది.

ఉత్తరాఖండ్ 313/8

డెహ్రాడూన్: అవ్నీష్ సుధ (89), ఆదిత్య తారే (69) రాణించడంతో హైదరాబాద్‌తో రంజీలో ఉత్తరాఖండ్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ తొలిరోజు ఆట చివరికి 76 ఓవర్లలో 8 వికెట్లకు 313 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ 3, రోహిత్ 2, మిలింద్, రక్షణ్, కార్తికేయ తలో వికెట్ తీశారు.

మక్కల సేకరణకు రూ.1,800 కోట్లు!

» రాష్ట్ర ప్రభుత్వానికి మార్క్‌ఫెడ్ ప్రతిపాదనలు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో మొక్కజొన్న కొనుగోళ్లకు రూ.1800 కోట్లు అవసరమంటూ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చిన వెంటనే మక్కల కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ, రూ.1,800 కోట్లకు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 5,46,865 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. 9.63 లక్షల మెట్రిక్ టన్నుల మక్కల ఉత్పత్తి జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే 7.22 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలు వస్తాయని మార్క్‌ఫెడ్ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. క్వింటాలుకు రూ.2,225 కనీస మద్దతు ధర ఉండగా ప్రస్తుతం మార్కెట్ ధరలు కాస్త తక్కువగా ఉన్నాయి. మక్కలు మార్కెట్‌కు వచ్చే కొద్దీ ధరలు మరింత తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు వెల్లడించారు. మొక్కజొన్నలు మార్కెట్‌కు వస్తున్న జగిత్యాలలో 9, ఆదిలాబాద్‌లో 1, నిర్మల్‌లో 2 కలిపి తొలివిడతలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మొత్తం సీజన్‌లో 102 సెంటర్లు ఏర్పాటుచేసి మొక్కజొన్నల కొనుగోళ్లు చేపడతామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన 'నాఫెడ్' కు కూడా ప్రతిపాదనలు పంపామని, 50 వేల మెట్రిక్ టన్నుల మక్కల సేకరణకు నాఫెడ్ అనుమతి ఇచ్చిందని ఎండీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. టీజీ మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు సేకరించి వాటిని డిస్టిలరీలకు అమ్మాలనే ఆలోచనతో నాఫెడ్ ఉన్నట్లు సమాచారం.

ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటకానికి ప్రోత్సాహం

» వేములవాడ ఆలయానికీ బంగారు తాపడం

» రూ.60 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి

» బాసర ఆలయానికి రూ.110 కోట్లు: కొండా సురేఖ

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. పర్యావరణ పర్యాటకం(ఎకో-టూరిజం)తో పాటు ఆధ్యాత్మిక పర్యాటక రంగాన్ని సమన్వయం చేసేందుకు టూరిజం సర్క్యూట్ల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులకు దర్శనం, వసతి సౌకర్యాలు తదితర 24 రకాల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపురాన్ని 60 కిలోల బంగారంతో తాపడం పనులు ఫిబ్రవరి 20లోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్టు పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో అందుదబాటులో ఉన్న 65 కిలోల బంగారంతో గోపురం తాపడం పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధి, విస్తరణ పనులకు రూ.60 కోట్ల వ్యయం చేయనున్నట్టు తెలిపారు. బాసరసరస్వతి ఆలయాన్ని రూ.110కోట్లతో పునర్నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు.

పథకాల అమలు తర్వాతే స్థానిక ఎన్నికలు: పొన్నం

గద్వాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే చాలా పథకాలను అమలు చేశామని, త్వరలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. పథకాలన్నింటినీ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గద్వాలలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. 2 లక్షల మేర రుణమాఫీ చేశామని వివరించారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయలేనోళ్లు కూడా ఎగిరెగిరి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 40 నెలలుగా గురుకులాలకు అద్దెలు సైతం చెల్లించలేదని, ఈ పాపం బీఆర్‌ఎస్‌ది కాదా? అని నిలదీశారు.

గవర్నర్‌తో శశిధర్‌రెడ్డి భేటీ

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి శశిధర్‌రెడ్డి శుక్రవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సమావేశమయ్యారు. తెలంగాణలో ఎత్తిపోతల పథకాలు వ్యయప్రయాసలతో కూడుకున్నవని తెలిపారు. నీటిపారుదల రంగం నిపుణులు హన్మంతరావు ప్రతిపాదించిన చతుర్విధ జల ప్రక్రియ అమలు అవసరాన్ని వివరించారు.

నల్లగొండ జిల్లాలో 249 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో మొత్తం 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, వడ్ల రాబడికి అనుగుణంగా ఇప్పటికే 249 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం 'ఇచ్చింది తీసుకో... లేదంటే పో!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. 325 సెంటర్లలో... దొడ్డు ధాన్యం సేకరణకు 244, సన్న ధాన్యం సేకరణకు 81 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ప్రారంభించిన 249 కేంద్రాల్లో... 42 కేంద్రాలు సన్న ధాన్యం సేకరణకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. సన్న ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, ఎప్పుడు ధాన్యం వస్తే అప్పుడు కేంద్రాలు తెరిచేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని కమిషనర్ చౌహాన్ తెలిపారు. సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలు 42 ఇప్పటికే ఏర్పాటు చేసినా వరి కోతలు చేపట్టనందున ధాన్యం రావడం లేదని, దొడ్డు ధాన్యం మాత్రం 7 వేల క్వింటాళ్లు సేకరించినట్లు కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు- 9963407064 కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

తక్కువ ధరకు ధాన్యం విక్రయించొద్దు

» రైతులకు నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

నల్లగొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లాలోని రైతులెవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించొద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ శివారు అవంతీపురం వ్యవసాయ మార్కెట్ వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సన్నధాన్యానికి సైతం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.500 బోనస్ కూడా ఇస్తుందని వెల్లడించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే ధర కంటే మిల్లర్లు ఎక్కువ ధర చెల్లిస్తే అక్కడ విక్రయించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ధాన్యం విక్రయాల విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూం నెంబర్ 9963407064కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రైతుల నుంచి చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేసి మద్దతు ధర ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

విత్తనాభివృద్ధి సంస్థలో ప్రాంతీయ మేనేజర్ల బదిలీ

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో ఏళ్ల తరబడి ఒకేచోట ఉంటున్న ప్రాంతీయ మేనేజర్లను బదిలీ చేశారు. ఈ మేరకు సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఆర్ఎంలు బదిలీ అయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలో కార్పొరేషన్‌లో పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో... ఆర్ఎంలను బదిలీచేయటం చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉండగా విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి ఆదేశాల మేరకు... నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న 16 మంది సీడ్ ఆఫీసర్లను క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులిచ్చారు. రైతుల వద్దకు వెళ్లి సీడ్ కార్పొరేషన్ పంపిణీ చేసే విత్తనాలను కొనుగోలుచేయాలని ప్రమోషన్ వర్క్ చేయాలని సూచించారు.

5 డీఏల్లో ఒక్కటీ ఇవ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తామని వారు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నా ఒక్కటి కూడా ఇవ్వలేదని, సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి.. పాత విధానం పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని లేఖలో ఉద్యోగుల జేఏసీ ఆక్షేపించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన ఉద్యోగుల తొమ్మిది డిమాండ్లతోపాటు ఇతర 41 డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ముఖ్యమంత్రి వద్దకు పలుమార్లు వెళ్లి.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరినా స్పందన అంతంత మాత్రమే ఉందన్నారు. ఉద్యోగుల నుంచి సంఘాలపై ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉద్యోగుల మద్దతు ఉందని, కష్టకాలంలో ఉన్న ప్రభుత్వానికి చేదోడుగా ఉండేందుకు ఇటీవల వరదలపై ఉద్యోగులు స్పందించి రూ.130 కోట్ల విరాళం ప్రకటించారని జేఏసీ గుర్తు చేసింది.

మియాపూర్‌లో చిరుత!



» మెట్రోస్టేషన్ సమీపంలో సంచారంతో కలకలం

» సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్..

» సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

మియాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చిరుత సంచారం కలకలం రేపింది.. రద్దీగా ఉండే మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో చిరుత పులి కనిపించడంతో అక్కడి వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చిరుత సంచరిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో కొద్ది క్షణాల్లోనే వైరల్‌గా మారింది. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మెట్రో స్టేషన్ వెనుక భాగంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు చిరుతను చూశారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారులతో కలిసి ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. చిరుత ఎక్కడి నుంచి వచ్చింది..? ఎక్కడెక్కడ తిరిగింది..? అన్నది గుర్తించే ప్రయత్నం చేశారు. రాత్రి సమయం కావడంతో చిరుత ఆనవాళ్లు, అడుగుల గుర్తింపులో ఇబ్బంది ఉందని ఓ అధికారి తెలిపారు. మెట్రో స్టేషన్ వెనకాల 200 ఎకరాల మేర ఖాళీ స్థలం, దట్టమైన అడవి ఉంది. అందులో నుంచే పులి వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పులి జాడ గుర్తించాలని నిర్ణయించారు. చిరుత సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లోనూ పులి కనిపించిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు.

మెయిన్స్‌కు ఓకే

(మొదటిపేజీ తరువాయి)



అభ్యర్థులు హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్ష రద్దయింది. మూడోసారి కూడా రద్దయితే వ్యవస్థపై విశ్వాసమే పోతుంది. పరీక్షలు జరుగుతాయనే నమ్మకం అభ్యర్థులకు కలగదు. తీవ్ర నైరాశ్యం నెలకొని ఆత్మహత్య ఘటనలు జరిగే అవకాశం ఉంటుంది" అని వ్యాఖ్యానించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, విస్తృతంగా చర్చించే సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారని, అందులో జోక్యం చేసుకోవాల్సిన ఎలాంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది. ప్రశ్నల్లో తప్పొప్పులను కోర్టులు నిర్ణయించలేవని, అన్నీ పరిశీలించిన తర్వాతే నిపుణుల కమిటీ 'కీ' విడుదల చేసిందని వివరించింది. ఎస్టీ రిజర్వేషన్ పెరిగినా.. పోస్టులు కూడా పెరిగాయని గుర్తు చేసింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో తప్పులు ఉన్నాయని, దానిని రద్దు చేయడంతోపాటు మెయిన్స్ పరీక్షలను అడ్డుకోవాలని దాఖలైన పిటిషన్లను ఈనెల 15న సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసిన విషయం తెలిసిందే. సింగిల్ జడ్జి తీర్పును కొట్టేసి మెయిన్స్ పరీక్షలను అడ్డుకోవాలని కోరుతూ డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ అభినందన్ కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. "ప్రిలిమ్స్ ఫైనల్ కీ తప్పులతడకగా ఉంది. పలు ప్రశ్నలపై అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. ఆ కమిటీ ఇచ్చిన కీని పక్కనపెట్టి స్వతంత్ర నిపుణుల కమిటీ వేయాలి. ఒరిజినల్ నోటిఫికేషన్‌లో లేకుండానే ఎస్టీ రిజర్వేషన్‌ను 6 నుంచి 10 శాతానికి పెంచారు. దీనివల్ల మిగతా అభ్యర్థులకు అన్యాయం జరుగుతుంది. 2022లో అర్హత సాధించని వారు 2024లో అర్హత సాధించారు. దరఖాస్తులకు గడువు పొడిగించేది లేదని నోటిఫికేషన్‌లో పేర్కొని రెండు రోజులు పొడిగించారు. మెయిన్స్ పరీక్షలు, రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను తర్వాత చేపట్టాలి" అని కోరారు. ప్రభుత్వం, టీజీపీఎస్సీ తరఫున న్యాయవాదులు రాహుల్ రెడ్డి, పీఎస్ రాజశేఖర్ వాదిస్తూ.. "నోటిఫికేషన్ రద్దు, ఉపసంహరణ, సవరణ వంటి అన్ని అధికారాలూ కమిషన్‌కు ఉంటాయి. నిబంధనల ప్రకారమే రీ నోటిఫికేషన్ జారీ చేశాం. రీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరిలో ఇచ్చాం. అప్పీలుదారులు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. పరీక్షలు రాశారు. ఫలితాలు వచ్చిన తర్వాత అర్హత సాధించకపోవడంతో రీ నోటిఫికేషన్‌ను సవాల్ చేశారు. అందుకే ఫిబ్రవరిలో రీ నోటిఫికేషన్ ఇస్తే చాలా ఆలస్యంగా ఆగస్టులో సవాల్ చేశారు" అని వివరించారు. అత్యంత పారదర్శకంగా అన్ని అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించిన తర్వాతే ఫైనల్ కీ విడుదల చేశామని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, 31 వేలమంది పరీక్షల్లో పాల్గొంటున్నారని, 90 శాతానికిపైగా హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ రద్దయిందని, సింగిల్ జడ్జి అన్ని అంశాలు సవివరంగా చర్చించారని, కేవలం ఆరుగురు అప్పీలుదారుల కోసం వాయిదా వేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. రీ నోటిఫికేషన్ ఫిబ్రవరిలో ఇస్తే మీరు ఇంత ఆలస్యంగా ఎందుకు సవాల్ చేశారని అప్పీలుదారులను ప్రశ్నించింది. పరీక్షల్లో పాల్గొని ఫలితాలు వచ్చిన తర్వాత సవాల్ చేయడం కరెక్ట్ కాదని వ్యాఖ్యానించింది. అప్పీళ్లను డిస్మిస్ చేస్తూ తీర్పు ఇచ్చింది.

గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలి

జీవో 29ని రద్దు చేయాలి

సుప్రీం కోర్టులో గ్రూప్-1 అభ్యర్థి పిటిషన్

సోమవారం విచారిస్తాం: సీజేఐ ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ పోగుల రాంబాబు అనే అభ్యర్థి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవోతో తాము నష్టపోతున్నామంటూ గురువారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్ -1 నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వంతోపాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు పిటిషనర్ తరఫున న్యాయవాది మోహిత్ రావు శుక్రవారం ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందని కోరారు. అయితే.. తక్షణమే విచారించలేమని, సోమవారం (ఈనెల 21న) విచారిస్తామని సీజేఐ స్పష్టం చేశారు.

జీవో 29ను రద్దు చేయాలి: అభ్యర్థులు

రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 29ను రద్దు చేయాలని గ్రూప్ 1 అభ్యర్థులు శ్రీనివాస్, అర్జున్, ఇందిరా నాయక్, రామ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని, మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం దక్కుతుందన్న నమ్మకంతో సుప్రీం కోర్టును ఆశ్రయించామని, జీవో 29ను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

స్కిల్స్ వర్సిటీకి వంద కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

నిధుల సమస్య రాకూడదన్న లక్ష్యంతో రూ.500 కోట్లతో ప్రత్యేకంగా కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని సీఎం ఇప్పటికే నిర్ణయించారు. ఇందుకు ఆర్థిక సహకారం అందించాలని కార్పొరేట్ కంపెనీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.100 కోట్లను తొలి బోర్డ్ మీటింగులోనే సీఎం రేవంత్ ప్రకటించారు. ఆ సమావేశంలోనే పలువురు పారిశ్రామికవేత్తలు కూడా తమ వంతు విరాళాలు ప్రకటించారు కూడా. తాజాగా అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్లను అందించింది. ఈ నేపథ్యంలోనే వర్సిటీలో భాగస్వామ్యం అవుతున్న కార్పొరేట్ కంపెనీలు సైతం భారీ విరాళాలను ప్రకటించే అవకాశాలున్నాయి. వర్సిటీ తొలి బ్యాచ్ నవంబరు నాలుగో తేదీ నుంచి ప్రారంభం కానుంది.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సీఎం రేవంత్



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు శుక్రవారం వచ్చారు. సుమారు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సీఎం అక్కడికి చేరుకున్నారు. సీఎస్ శాంతి కుమారి ఇతర అధికారులు సీఎం వెంట ఉన్నారు. కాగా, సీఎం కమండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న సమయంలో సీపీ ఆనంద్ బషీర్ బాగ్‌లోని పాత సీపీ కార్యాలయంలో ఉండగా, డీజీపీ జితేందర్ సైతం తన కార్యాలయంలోనే ఉన్నారు. అయితే సీపీ, డీజీపీ విధుల్లో బిజీగా ఉండటం వల్లే సీఎం వెంట కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లలేదని సమాచారం.

దీపావళి లోపు కొత్త ఆర్వోఆర్ చట్టం

» ముసాయిదా చట్టంపై సీఎంతో చర్చించిన మంత్రి పొంగులేటి

» కేబినెట్ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ చట్టంపై చర్చించే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి నాటికి కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) చట్టాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటి వరకు ముసాయిదా ఆర్వోఆర్‌పై వచ్చిన సలహాలు, చేపట్టిన మార్పులు, పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన ఫలితాలను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లు తెలిసింది. ఈ ఏడాది జూలై చివరిలో కొత్త ఆర్వోఆర్ చట్టం ముసాయిదాను ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై ఆగస్టు 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అభిప్రాయ సేకరణకు పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది. ఆ తరువాత వెంటనే జిల్లా కలెక్టర్లతో అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా తిరుమలగిరి ప్రాంతాల్లో కొత్త చట్టం తీసుకురానున్న నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయగా వచ్చిన ఫలితాలను, సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముసాయిదా చట్టంలో మార్పులు, చేర్పులు చేపట్టారు. అలాగే గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఏర్పాటు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో భూ కమిషన్ల ఏర్పాటు వంటి అంశాలపై ఎక్కువ మంది నుంచి సూచనలు అందాయి. ముసాయిదాలో చేర్చిన పలు అంశాలపై సీఎంతో పొంగులేటి చర్చించినట్లు తెలిసింది. రాబోయే కేబినెట్ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ చట్టంపై చర్చించే అవకాశం ఉందని, ఆ వెంటనే ఆర్డినెన్స్ లేదా ప్రత్యేక సమావేశాల ద్వారా చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తారనే చర్చ జరుగుతోంది.

భూమాత కార్యాచరణ షురూ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ధరణి పోర్టల్ స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామని ప్రకటన చేసింది. ఇప్పటికే ధరణి పోర్టల్ నిర్వహణను నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీకి) అప్పగించిన ప్రభుత్వం భూమాత పోర్టల్ ఏర్పాటుకు మార్గం సుగుమం చేసింది. ధరణి పోర్టల్ వల్ల పెండింగ్‌లో ఉన్న 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులను భూమాత పోర్టల్ ద్వారా కొత్త ఆర్వోఆర్ చట్టంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని రెవెన్యూ చట్టాలను సవరించే పనిలో భాగంగా 2016లో రద్దు అయిన భూ ఆక్రమణ నిరోధక చట్టాన్ని తీసుకొచ్చేందుకు భూ చట్టాల నిపుణులతో చర్చించారు. అలాగే గ్రామస్థాయి ఉద్యోగుల ఎంపికకు సంబంధించి విధివిధానాలపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం వెల్లడించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో త్వరలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ చట్టం, గ్రామ స్థాయి ఉద్యోగుల నియామకం, భూ చట్టాల సంస్కరణ, కొత్త చట్టాల రూపకల్పనపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీఛార్జ

రాహుల్‌గాంధీ మాస్కులు ధరించి అభ్యర్థుల ర్యాలీ.. చెదరగొట్టిన పోలీసులు.. వీధుల్లోకి పారిపోయిన అభ్యర్థులు

» సాయంత్రం బీజేవైఎం నేతృత్వంలో మళ్లీ ర్యాలీ..

» నిరసకారులను అరెస్టు చేసిన పోలీసులు





జీవో 29ను రద్దు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న గ్రూప్-1 అభ్యర్థులను అడ్డుకుంటున్న పోలీసులు

చిక్కడపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి జరగనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో దాదాపు 150 మంది అభ్యర్థులు రాహుల్‌గాంధీ మాస్కులు ధరించి గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ నుంచి ధర్నాచౌక్‌కు ర్యాలీ ప్రారంభించారు. ఈ క్రమంలో అశోక్‌నగర్ వద్ద పోలీసులు వారిని అడ్డుకొని చెదరగొట్టారు. దాంతో నిరసనకారులు వీధుల్లోకి పారిపోయారు. పోలీసులు వెంటపడి తమను బాదారని అభ్యర్థులు చెప్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్ తెలియజేయాలని నిరసనలు చేస్తుంటే పోలీసులు తమను నేరస్థులుగా చూస్తూ ఇష్టం వచ్చినట్లు తరుముతున్నారని, కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 సంబంధించి కోర్టులో అనేక కేసులున్నాయని, వాటిని పరిష్కరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్‌ను వారు కోరారు. ఇప్పుడు పరీక్షలు నిర్వహించినా మళ్లీ నిర్వహించాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. దానివల్ల ప్రభుత్వానికే చెడ్డ పేరు వస్తుందని, అయినా మొండిగా వ్యవహరిస్తే వచ్చే దసరా నాటికి ఈ ప్రభుత్వం లేకుండా పోతుందని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ బీజేవైఎం నాయకుల ఆధ్వర్యంలో గ్రూప్- 1 అభ్యర్థులు ఆంధ్రాకేఫ్ నుంచి గాంధీనగర్ ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు ర్యాలీగా చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వారు అక్కడే బైఠాయించి నినాదాలు చేయగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

కిషన్ రెడ్డిని కలిసిన అభ్యర్థులు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తేవాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని అభ్యర్థులు కోరారు. శుక్రవారం గాంధీనగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రిని 100 మంది గ్రూప్ 1 అభ్యర్థులు కలిశారు. సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని తమ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

రేవంత్‌ను దించేందుకు మంత్రుల కుట్ర

ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత ఇంకా పెరగాలని చూస్తున్నారు.. ఆ తర్వాత సీఎం కుర్చీ నుంచి దించేస్తారు

» గ్రూప్ 1, హైడ్రా, మూసీ విషయాల్లో జాగ్రత్తపడకపోతే రేవంత్‌కు చిక్కులు తప్పవు: సంజయ్



కరీంనగర్/హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి దించేయాలని కాంగ్రెస్ మంత్రులు, నాయకులు కుట్రలు చేస్తున్నారని, తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గ్రూప్ 1, మూసీ, హైడ్రా విషయాల్లో జాగ్రత్తపడకపోతే రేవంత్‌కు చిక్కులు తప్పవని హెచ్చరించారు. హైడ్రా, మూసీ, గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనలతో రేవంత్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఆ వ్యతిరేకత ఇంకా పెరగాలని మంత్రులు భావిస్తున్నట్లు సంజయ్ చెప్పారు. ఆ తర్వాత రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగిస్తారన్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతో కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని, మొండిగా వ్యవహరించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జీ చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. "మహిళా అభ్యర్థులను అర్ధరాత్రి అరెస్టు చేయడానికి ఎంత ధైర్యం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం అశోక్‌నగర్ వెళ్లి గ్రూప్ 1 అభ్యర్థులకు సంఘీభావం తెలుపుతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జీవో-29ను తీసుకువచ్చిందని, చేసిన తప్పును సరిదిద్దుకోకుండా రాక్షసంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే తెలంగాణను ప్రేమ దుకాణం (మొహబ్బత్ కి దుకాన్) చేస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఎన్నికలప్పుడు వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. రాష్ట్రం ఇప్పుడు విద్వేషాల బజార్(నఫ్రత్ కా బజార్)గా మారిందని సంజయ్ అన్నారు. నిరుద్యోగులకు బ్రాండ్ అంబాసిడర్‌లాగా కేటీఆర్ ఫోజులు కొడుతున్నారని, బీఆర్‌ఎస్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హతే లేదని ఆయన స్పష్టం చేశారు.

మూసీపై రేవంత్ రోజుకో మాట

మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్ రోజుకో మాట మాట్లాడుతున్నారని సంజయ్ విమర్శించారు. మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామని ప్రభుత్వం పలు సందర్భాల్లో చెప్పిందన్నారు. మూసీ ప్రక్షాళనకు ప్రపంచ బ్యాంకు అప్పుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం సాగిల పడుతోందన్నారు. మూసీ పేరుతో లక్షన్నర కోట్ల దోపిడీకి బీజేపీ వ్యతిరేకమని చెప్పారు. "11వేల కొంపలను కూల్చివేయడమే పునరుజ్జీవమా" అని సంజయ్ ప్రశ్నించారు. కాగా, మూసీపై శుక్రవారం కేటీఆర్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఓ జోక్ అని సంజయ్ ఎద్దేవా చేశారు.

లాఠీచార్జి అమానుషం: లక్ష్మణ్

శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. హాస్టళ్లలోకి చొరబడి చదువుకుంటున్న విద్యార్థులను కూడా బయటకు గుంజుకొచ్చి రక్తం చిందేలా కొట్టడం దుర్మార్గమని, నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తోందనడానికి ఇదే నిదర్శనం అని విమర్శించారు. నిరుద్యోగులు చేసిన తప్పేంది? అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

నేడు, రేపు కొన్నిచోట్ల భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 21 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం అన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముఖ్యంగా ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాగల మూడు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల(గంటకు 30-40 కి.మీ వేగంతో)తో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

» నేటి నుంచి స్లాట్ బుకింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్ సెట్ బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. శనివారం నుంచి స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. బీ ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ(ఫామ్-డీ), బయో టెక్నాలజీ, బయో మెడికల్ అండ్ ఫార్మాస్యూటికల్ కోర్సుల్లో చేరిక కోసం స్లాట్ బుకింగ్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ శనివారం నుంచి మంగళవారం వరకు జరగనుంది. ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకున్నవారికి ఈ నెల 21 నుంచి 23 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. అలాగే కాలేజీలు/కోర్సుల్లో ఆప్షన్ల స్వీకరణ సోమవారం నుంచి శుక్రవారం దాకా జరగనుంది. సమగ్ర నోటిఫికేషన్, విద్యాసంస్థల వివరాల కోసం http://tgeapcetb.nic.in ద్వారా సంప్రదించవచ్చని సెట్ కన్వీనర్, సాంకేతిక విద్యా కమీషనర్ శ్రీదేవ సేన తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ నిందితుడు రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌పై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఐదో నిందితుడు రిటైర్డ్ డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై ప్రభుత్వం వివరణ సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తాను రిటైర్డ్ పోలీసు అధికారినని.. సీనియర్ సిటిజన్‌ను అని.. కేసుతో ఎలాంటి సంబంధం లేదని తనకు బెయిల్ ఇవ్వాలని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దిగువ కోర్టు తాను దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లను కొట్టేయడం చెల్లదని పేర్కొన్నారు. ఇతర నిందితులు పోలీసు కస్టడీలో ఉండగా ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా తనను అరెస్ట్ చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం.. పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

అధికారులకు రాజకీయాలతో పనేంటి: హైకోర్టు

అధికారులకు రాజకీయాలతో పనేంటని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల్లో అధికారులు కూడా పోటీ చేస్తున్నారా? ఎన్నికలకు అప్పీలు దాఖలుకు సంబంధం లేదని పేర్కొంది. హైదరాబాద్ ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్‌లోని ఓ ఆస్తి వివాదానికి సంబంధించి ఆలస్యంగా అప్పీలు దాఖలు చేయడంపై అసహనం వ్యక్తంచేసింది. హైదరాబాద్ కలెక్టర్ ఎన్నికల్లో పోటీ చేయలేదు కదా? ఎన్నికల వల్ల ఆలస్యం అయిందని చెప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించింది.

'సాహితీ' లక్ష్మీనారాయణకు ముగిసిన ఈడీ కస్టడీ

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి. లక్ష్మీనారాయణకు ఈడీ కస్టడీ ముగిసింది. ప్రపంచస్థాయి విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాస సముదాయాల పేరుతో వందల కోట్లు దారిమళ్లించిన కేసులో లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు సోమవారం కస్టడీలోకి తీసుకున్నారు. ఐదు రోజుల కస్టడీ గడువు ముగియడంతో శుక్రవారం కోర్టులో హాజరుపర్చిన తర్వాత తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రజల నుంచి సేకరించిన సొమ్ము ఏయే కంపెనీలకు దారిమళ్లించారు, సహనిందితులుగా ఉన్నది ఎవరు, తెరవెనుక ఉన్నది ఎవరు, కొల్లగొట్టిన సొమ్ములో ఎవరి వాటా ఎంత..? ఇలా పలు కీలక ప్రశ్నలకు ఈడీ అధికారులు సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం మేరకు త్వరలోనే మరికొందర్ని విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

రౌడీషీటర్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

» తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటి కేసు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ మహ్మద్ కైసర్ అలియాస్ పహిల్వాన్ కైసర్‌కు చెందిన రూ.కోటి ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే కైసర్‌పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. ఓ రౌడీషీటర్‌కు చెందిన ఆస్తులు ఈడీ అటాచ్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి కావడం విశేషం. భార్య షాహేదా బేగం పేరిట ఆస్తులు కూడబెట్టినట్లు అధికారులు ఆధారాలు సేకరించారు.

మాప్‌అప్ రౌండ్‌లో 100 ఎంబీబీఎస్ సీట్లు

» అన్ని కన్వీనర్ కోటాలోవే.. వెబ్ ఆప్షన్లకు అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండో విడత కౌన్సిలింగ్ ముగిసిన 100 ఎంబీబీఎస్ సీట్లు మిగిలిపోయాయి. ఇవన్నీ కూడా కన్వీనర్ కోటా సీట్లే. వీటిలో 75 సీట్లు ఇటీవల ఎన్ఎంసీ నుంచి అనుమతులు పొందిన నోవా మెడికల్ కళాశాలవి. ఈ కళాశాలకు 150 సీట్లకు అనుమతి ఇవ్వగా, వాటిలో 50 శాతం అంటే 75 సీట్లు కన్వీనర్ కోటాలోవి. మరోవైపు రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత ఆయా కాలేజీల్లో 25 కన్వీనర్ ఖాళీ సీట్లు అయ్యాయి. ఈ సీట్లు, నోవా కాలేజీ సీట్లు కలిపి మొత్తం 100 కన్వీనర్ సీట్లు ఉన్నాయి. వీటిలో ఓసీ జనరల్ 31, ఓసీ ఫీమేల్ 16, ఎస్సీ 14, ఎస్టీ 14, మిగిలినవి బీసీ రిజర్వేషన్ సీట్లు. ఈ సీట్ల భర్తీకి మాప్‌అప్ రౌండ్ వెబ్ ఆప్షన్ల నమోదుకు హెల్త్ వర్సిటీ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది.

ఆర్‌జే శేఖర్ బాషా అరెస్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బిగ్‌బాస్ కంటెస్టెంట్, రేడియో జాకీ(ఆర్‌జే) శేఖర్ బాషాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. యూట్యూబర్ హర్షసాయి బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు శేఖర్ బాషాను విచారించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. శేఖర్ బాషా యూట్యూబ్ చానల్స్‌లో తప్పుడు ప్రచారం చేస్తూ తన పరువుకు భంగం కలిగిస్తున్నాడని బాధితురాలు ఇటీవల పోలీసులను ఆశ్రయించింది. కాగా, యూట్యూబర్ హర్షసాయి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వద్ద రూ. 2కోట్ల వరకు తీసుకున్నాడని, అత్యాచారం చేసి మోసం చేశాడని ఆమె కొద్ది రోజుల క్రితం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసు దర్యాప్తులో ఉండగా నిందితుడు హర్షసాయి పరారీలో ఉన్నాడు. మరోపక్క, సినీ నటుడు రాజ్ తరుణ్ కేసు విషయంలోనూ శేఖర్ బాషా మీడియాలో హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే.

విద్యా కమిషన్ సభ్యుడిగా విశ్వేశ్వర్‌రావు

» మరో ఇద్దరు సభ్యులనూ నియమించిన సర్కారు

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి చైర్మన్‌గా ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్‌కు ముగ్గురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీజేఎస్ ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చారుగొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డిలను సభ్యులుగా నియమించింది. విద్యా కమిషన్‌లో సభ్యుడిగా విశ్వేశ్వర్‌రావును తీసుకోవడం ద్వారా టీజేఎస్‌కు మరో నామినేటెడ్ పోస్టును సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించినట్లయింది. కాగా, కోదండరెడ్డి చైర్మన్‌గా ఏర్పాటైన రైతు కమిషన్‌కూ ఒకటి, రెండు రోజుల్లో సభ్యులను నియమించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బచావత్ తీర్పు మేరకే నీటి వినియోగం ఉండాలి

» జూరాల ప్రాజెక్టుపైనా నియంత్రణ ఉండాలి
» ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై ఏపీ అఫిడవిట్ దాఖలు
» నవంబరు 6 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బచావత్ ట్రిబ్యునల్(కృష్ణా ట్రిబ్యునల్-1) తీర్పు మేరకు కేటాయింపులకు అనుగుణంగా నీటి వినియోగం ఉండాలని, దీనిపై సమీక్షించడానికి వీల్లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుపుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2)లో శుక్రవారం ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై ఏపీ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. తొలుత తాగునీటి అవసరాలు, ఆ తర్వాత సాగునీటి అవసరాలు ఉన్నప్పుడే శ్రీశైలం, సాగర్‌లలో జలవిద్యుత్ ఉత్పాదన చేయాలని స్పష్టం చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి తెలంగాణకు 122 టీఎంసీలు, ఏపీకి 386 టీఎంసీల నీటి కేటాయింపులు చేయాలని పేర్కొన్నట్లు తెలిపింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో శ్రీశైలం పెన్నా-కృష్ణా బేసిన్‌ల ఉమ్మడి రిజర్వాయర్‌గా మారిందని పేర్కొంది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గంపగుత్తగా 811 టీఎంసీలను కేటాయించిందని, ఆ నీటిని ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి తరలించడానికి వీలు కల్పించిందని గుర్తు చేసింది. ఇందులో 299 టీఎంసీలే తెలంగాణకు కేటాయింపులున్నాయని, 367 టీఎంసీలు కోస్తాంధ్రకు, 144 టీఎంసీలు రాయలసీమకు కేటాయింపులున్నాయని పేర్కొంది. ఉమ్మడి రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల, వినియోగం కేటాయింపుల ఆధారంగానే ఉండాలని విన్నవించింది. ఇక పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభిస్తే.. ఆ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు తరలించే నీటికి బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీలు వాడుకోవాలనే వాటాలో ఉమ్మడి ఏపీకి దక్కిన 45 టీఎంసీలపై ఏపీకే అధికారం ఉందని స్పష్టం చేసింది. ఇక బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కృష్ణా-2) ఉమ్మడి ఏపీకి 1005 టీఎంసీల నీటి కేటాయింపులు చేసిందని, అందువల్ల ఆ కేటాయింపుల ప్రకారం నీరు దిగువ ప్రాంతాలకు చేరాలంటే జూరాలపై కూడా నియంత్రణ ఉండాలని, ఆ ప్రాజెక్టుకు కూడా ఆపరేషనల్ ప్రొటోకాల్‌లోకి తేవాలని ఏపీ కోరింది. మరోవైపు ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై వేసిన అఫిడవిట్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున సాక్షిగా కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) పూర్వ ఇంజనీర్ అనిల్‌కుమార్ గోయల్‌ను పెట్టుకున్నారు. వచ్చేనెల నవంబరు 6, 7, 8వ తేదీల్లో ఏపీ సాక్షిగా ఉన్న అనిల్‌కుమార్ గోయల్‌ను తెలంగాణ తరఫు న్యాయవాది క్రాస్‌ఎగ్జామినేషన్ చేయనున్నారు.

టూరిజం.. కేరాఫ్ తెలంగాణ!

చారిత్రక, సాంస్కృతిక పర్యాటకానికి చాన్స్.. వైవిధ్యాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని సీఎం యోచన

హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని ఆకర్షించే అద్భుతమైన పర్యాటక సంపద తెలంగాణలో ఉందని, దాన్ని గుర్తించి.. అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో రాతియుగం నాటి ఆనవాళ్లు మొదలు.. శతాబ్దాల నాటి చారిత్రక కట్టడాలు, సుసంపన్నమైన చరిత్ర, వైవిధ్యభరితమైన సంస్కృతి-సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానం, భిన్నమైన పర్యాటక సంపద ఉన్నాయని.. వైవిధ్యాలను గుర్తించి, అభివృద్ధి చేస్తే.. విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవచ్చని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది.

పర్యాటకులు మమేకమయ్యేలా..!

హైదరాబాద్ గోల్కొండ కోట, చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్, జూపార్క్, భద్రాచలం గోదావరి తీరంలో గిరిజనుల కొమ్ము నృత్యం, ఆదిలాబాద్ గోండుల గుస్సాడి, రామప్ప ఆలయంలో పేరిణీ, మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతర, పల్లెపల్లెనా సాగే బతుకమ్మ సంబురాలు, తుంగభద్ర తీరాన జోగులాంబ, నవ బ్రహ్మల ఆలయాలు, నాగార్జునసాగర్‌లో బుద్ధవనం, ధూళికట్ట, ముజ్జుగూడెం బౌద్ధ స్తూపాలు, కొలనుపాక జైన మందిరం, జాన్‌పహాడ్ సైదులు దర్గా, ఆదిలాబాద్, ఇతర జిల్లాల్లోని రమణీయమైన జలపాతాల్లాంటి అనేక వైవిధ్యభరితమైన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి.. తెలంగాణకు ప్రపంచ పర్యాటక పటంలో చోటుదక్కేలా తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. "పర్యాటకులు ఏదైనా ఒక ప్రాంతానికి వెళ్లినపుడు.. అక్కడి విశేషాలతో అనుభూతి చెందాలి. చారిత్రక ప్రదేశానికి వెళ్లినపుడు దాని చరిత్ర, నాటి ప్రజల సంస్కృతి, అలవాట్లు తెలిసేలా ఏర్పాట్లు చేయాలి. గోల్కొండ కోటకు వెళ్లినపుడు దాని ప్రాశస్త్యాన్ని తెలిపే సమాచారంతోపాటు.. నాడు కుతుబ్‌షాహీలు ధరించిన దుస్తుల్లో ఫొటోలు దిగే సదుపాయం కల్పించాలి. రామప్ప ఆలయంలో



పేరిణీ నృత్యం చూసే వెసులుబాటే కాదు.. పర్యాటకులు ఆ వేషధారణతో నృత్యం చేసే అవకాశమివ్వాలి. కొమ్ము, గుస్సాడీ నృత్యాలు చేసేలా ఏర్పాట్లు చేస్తే.. పర్యాటకుల మనసులో ఆ అనుభూతి చిరకాలం ఉండిపోతుంది. చార్మినార్‌లో గాజుల తయారీ, హైదరాబాద్‌కు ప్రత్యేకమైన దమ్ బిర్యానీ తయారీలో పర్యాటకులను భాగస్వాములను చేస్తే.. ఆ ప్రాంత సంస్కృతిని పూర్తిస్థాయిలో ఆస్వాదిస్తారు" అని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకం

తెలంగాణలోని చారిత్రక హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన ఆలయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. ఖమ్మంలో భద్రాచల రామాలయం, పర్ణశాల, ముజ్జుగూడెం బౌద్ధ స్తూపం, వరంగల్‌లో రామప్ప ఆలయం, వేయిస్తంభాల గుడి, కరీంనగర్‌లో వేములవాడ, ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు ఆలయాలు, ధూళికట్ట బౌద్ధ స్తూపం, ఆదిలాబాద్‌లో బాసర సరస్వతి, మెదక్ చర్చి, నిజామాబాద్‌లో డిచ్‌పల్లి రామాలయం, ఆర్మూర్ సిద్ధుల గుట్ట, రంగారెడ్డిలో రాచకొండ కోట, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆలంపూర్ జోగులాంబ, నవబ్రహ్మల ఆలయాలు, నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ బుద్ధవనం, జాన్‌పహాడ్ దర్గా, కొలనుపాక జైన ఆలయాలను అభివృద్ధి చేస్తే.. అవి ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రాలుగా మారుతాయని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, తెలంగాణ సంస్కృతినే పర్యాటకంగా మార్చాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పల్లెపల్లెనా జరిగే బతుకమ్మ పండుగలో విదేశీయులు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని రేవంత్ సూచించారు. బోనాల ఉత్సవాలకు కూడా ఇదే విధంగా ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. జానపద కళాకారులను ఒకే వేదికపై తీసుకువచ్చి, ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేయాలని పేర్కొన్నారు.

జలపాతాల అడ్డా..!

తెలంగాణలోని ప్రతి జిల్లాల్లో రమణీయమైన జలపాతాలు ఉన్నాయి. ఆదిలాబాద్‌లో కుంటాల, పొచ్చెర, గాయత్రి, ఖమ్మంలో బొగత, వెన్నెల, వరంగల్‌లో భీమునిపాదం, కరీంనగర్‌లో సబితం, రాయికల్, నిజామాబాద్‌లో సిర్నాపల్లి, మెదక్‌లో పోచారం జలపాతం, నల్లగొండలో ఎత్తిపోతల, రంగారెడ్డిలో నానాజీపూర్, మహబూబ్‌నగర్ జిల్లాలో మల్లెల తీర్థం జలపాతాలున్నాయి. ఈ ప్రాంతాల్లో పర్యాటకులకు మంచి సౌకర్యాలు, విడిది ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రకృతి ఒడిలో సేద తీరేవిధంగా అన్ని హంగులను సమకూర్చాలని యోచిస్తోంది. తెలంగాణలోని అడవుల్లో సఫారీ ఏర్పాట్లను చేయాలనుకుంటోంది. పర్యావరణపరంగా బఫర్ జోన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, నిబంధనలను పాటిస్తూనే.. ఫారెస్ట్ టూరిజంను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచనలు చేశారు.

9 వర్సిటీలకు ఉప కులపతులు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త వీసీల నియమకానికి ప్రతి వర్సిటీకి ముగ్గురు సభ్యులతో సర్చ్ కమిటీ నియమించింది. మొత్తం పది వర్సిటీలకు 1382 దరఖాస్తులు వచ్చాయి. కమిటీ సిఫారసుల మేరకు జాబితా సిద్ధం చేసిన ప్రభుత్వం గవర్నర్ తుది ఆమోదానికి పంపింది. అయితే మరో నాలుగు వర్సిటీల ఉప కులపతులను నియమించాల్సి ఉంది. ఇందులో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ), బీఆర్ అంబేద్కర్ దూరవిద్య విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్ విశ్వవిద్యాలయం(జేఎన్ఏఎఫ్ఏయూ), పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఈ నాలుగు వర్సిటీల వీసీల నియామకం త్వరలో పూర్తవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఓయూ వీసీగా తొలిసారి దళిత వ్యక్తి

దళిత వ్యక్తికి ఓయూ వైస్‌చాన్స్‌లర్‌గా తొలిసారి అవకాశం లభించింది. వీసీగా నియమితులైన ఆచార్య కుమార్ మొలుగారం దళిత సామాజిక వర్గానికి చెందిన వారు. ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలో సీనియర్ ప్రొఫెసర్‌గా, రీజనల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్‌గా ఆయన పనిచేశారు. ఉస్మానియా నుంచే డిగ్రీ పూర్తిచేశారు. జేఎన్‌యూలో మాస్టర్స్ చేశారు. ఐఐటీ బాంబే నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలం కొండాపూర్‌కు చెందిన మొగ్లారామ్ 29ఏళ్లుగా బోధన, పరిశోధనాంశాల్లో సేవలందిస్తున్నారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులైన రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లా వాస్తవ్యులు. 1992లో గుజరాత్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ వీసీగా నియమితులైన డాక్టర్ జానయ్య స్వస్థలం నల్లగొండ జిల్లాలోని మామిడాల గ్రామం. బెనారెస్ హిందూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. పదహారేళ్లపాటు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్‌లో సీనియర్ ఎకనమిస్ట్‌గా చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన నిత్యానందరావు స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూరు. ఓయూలో ఎంఏ తెలుగు, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు.


కొత్త డైరెక్టర్ల నియామకమెప్పుడు?

» విద్యుత్తు సంస్థల్లో పోస్టుల భర్తీలో జాప్యం
» నాలుగు నెలల క్రితమే దరఖాస్తుల స్వీకరణ
» ఇప్పటికీ ముందుకు సాగని ప్రక్రియ
» 11 నెలల్లో ముగ్గురు సీఎండీల మార్పు
» జెన్‌కో, ట్రాన్స్‌కోలో పాలన గందరగోళం

హైదరాబాద్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల తొలగింపు.. నియామకాలకు నోటిఫికేషన్ల జారీ.. దరఖాస్తుల స్వీకరణ యుద్ధ ప్రాతిపదికన జరగ్గా... నియామక ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డైరెక్టర్లందరినీ తొలగించి.. ఆయా స్థానాల్లో చీఫ్ ఇంజనీర్లు/సీజీఎంలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కొత్త డైరెక్టర్ల నియామకానికి ఆయా సంస్థలు నోటిఫికేషన్లు జారీ చేశాయి. ట్రాన్స్‌కోలో ట్రాన్స్‌మిషన్, ప్రాజెక్టు, ఫైనాన్స్, జెన్‌కోలో హైడల్, థర్మల్, కోల్, ఫైనాన్స్, హెచ్ఆర్ డైరెక్టర్ల పోస్టులు, ఎస్పీడీసీఎల్‌లో ప్రాజెక్ట్స్, ఆపరేషన్, కమర్షియల్, ఫైనాన్స్ ఎన్పీడీసీఎల్‌లో ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసేవారు 62ఏళ్ల లోపు వయసు కలిగి, సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీ చేసి, సంబంధిత సబ్జెక్ట్‌లో 15 ఏళ్లపాటు అనుభవం కలిగి, రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ రంగంలో 25ఏళ్ల వృత్తిపరమైన అనుభవం కలిగి ఉండాలని నిబంధన విధించారు. డైరెక్టర్‌గా నియమితులయ్యే వారిని కనిష్ఠంగా రెండేళ్ల పాటు పదవిలో కొనసాగిస్తామని, ఆ తర్వాత ఏడాది పాటు రెండేళ్లకు మించకుండా రెండుసార్లు పొడిగింపు ఇస్తామని విద్యుత్తు సంస్థలు నోటిఫికేషన్‌లో పేర్కొన్నాయి. ఈ పోస్టుల కోసం 50దాకా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ పూర్తయి.. నాలుగు నెలలు పూర్తవుతోంది. కానీ, ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉంది. అయితే, డైరెక్టర్ పోస్టులకు సంబంధించిన వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని పలు సంఘాలు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాయి. ఒకటి, రెండు పోస్టులు తమ వర్గానికి కట్టబెట్టాలని లాబీయింగ్ చేస్తున్నాయి. అదే సమయంలో పైరవీలు జోరుగా సాగుతుండడంతో ఆయా పదవులు ఎవరికి దక్కనున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. పదకొండు నెలల్లో ముగ్గురు సీఎండీలు మారడంతో విద్యుత్తు సంస్థల్లో(జెన్‌కో, ట్రాన్స్‌కో) పాలన గందరగోళంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ట్రాన్స్‌కో/జెన్‌కో సీఎండీగా ఉన్న దేవులపల్లి ప్రభాకర్‌రావు రాజీనామా చేసి వెళ్లిపోగా.. ఆ స్థానంలో సీనియర్ ఐఏఎస్ ఎస్ఏఎం రిజ్వీ నియమితులయ్యారు. కొంత కాలానికే ఆయన్ను బదిలీ చేసి రొనాల్డ్ రాస్‌ను నియమించారు. కానీ, అనూహ్యంగా విభజన కేసులో ఆయన ఏపీకి వెళ్లాల్సి రావడంతో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పని చేస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియాకు జెన్‌కో/ట్రాన్స్‌కో సీఎండీ, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఏ రోజు తనను రిలీవ్ చేస్తారో తెలియని పరిస్థితుల్లో ఆయన సైతం విధులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

క్రమశిక్షణ తప్పొద్దు

» ఇసుక, మద్యంలో జోక్యం వద్దు
» వైసీపీ తరహా దందాలు చేయొద్దు
» నేతలకు చంద్రబాబు స్పష్టీకరణ



అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'కట్టుతప్పద్దు. క్రమశిక్షణ మరవొద్దు" అని టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇసుక, మద్యం, ఇతర దందాల్లో జోక్యం చేసుకోవద్దని సూటిగా చెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జోనల్, ప్రాంతీయ ఇన్‌చార్జులతో చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతంలో వైసీపీ పాలకులు పాల్పడిన దందాల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. "ఇసుక విషయంలో ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు వేలు పెట్టవద్దు. తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించవద్దని అధికారులకు స్పష్టంగా చెప్పాను. ఇసుక విధానం సక్రమంగా అమలు కాకపోతే అధికారులను కూడా బాధ్యులను చేస్తాను. మద్యం విషయంలో కూడా ఎవరూ జోక్యం చేసుకోవద్దు" అని సూటిగా చెప్పారు. వారసత్వంగా వస్తున్న మద్యం వ్యాపారం చేసుకుంటే ఏమీ కాదని.. కానీ ఇతరులు జోక్యం చేసుకుంటే పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని స్పష్టం చేశారు.

కమిటీ నుంచి పిలుపు వస్తే...

దారి తప్పుతున్న పార్టీ ఎమ్మెల్యేలను ఎప్పటికప్పుడు గుర్తించి, వారిని హెచ్చరించేందుకు పార్టీ పరంగా పంచ సభ్య కమిటీ వేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... "వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ప్రజలు నిరసించారు. ఘోర పరాజయం పాలైనవాళ్లు మనకు ఆదర్శం కాదు. వాళ్ల మాదిరిగా ఉండాలని మనం అనుకోవద్దు. పంచ సభ్య కమిటీ నుంచి మీకు పిలుపు వచ్చిందంటే మీరు గీత దాటినట్లు లెక్క. మీరు ఏం తప్పులు చేశారో.. చేస్తున్నారో ఆ కమిటీ మీకు చెబుతుంది. దిద్దుకోవాలని సూచిస్తుంది. అప్పటికీ మార్పు రాకపోతే తర్వాత నేను పిలవాల్సి వస్తుంది. అప్పటికీ మార్పు రాకపోతే ఆ తర్వాత చర్యలు తీవ్రంగా ఉంటాయి. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటానికే నేను ఇక్కడకు వచ్చాను" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. "నా నుంచి మీరు చాలా ఆశిస్తున్నారు. మీ పనితీరు బాగుండి మీకు మంచి పేరు వస్తే మీ గురించి నేను ఆలోచిస్తాను. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారికి... సీనియర్లకు అందరికీ ఇదే వర్తిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. చాలా మంది పనితీరులో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు.

ఉత్తరాంధ్రకు వాయుగండం

» 21 లేదా 22న అల్పపీడనం
» వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం దిశగా వస్తుందని అంచనా

విశాఖపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్‌లు, వాయుగుండాలకు అనుకూల వాతావరణం నెలకొంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో గల్ఫ్ ఆఫ్ థాయ్‌లాండ్ నుంచి వచ్చే తుఫాన్ల అవశేషాలు బంగాళాఖాతంలో ప్రవేశించిన వెంటనే బలపడుతున్నాయి. అటువంటి అవశేషంతో వచ్చిన ఉపరితల ఆవర్తనం ఒకటి ఈ నెల 20న ఉత్తర అండమాన్ సముద్రంలో ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 21 లేదా 22న తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది 24న వాయుగుండంగా బలపడి వాయవ్యంగా పయనించే క్రమంలో దక్షిణ ఒడిశా, దానికి ఆనుకొని ఉత్తరాంధ్ర తీరం దిశగా వస్తుందని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. కాగా, ఈసారి దేశవ్యాప్తంగా మంచి వర్షాలకు కారణమైన నైరుతి రుతుపవనాలు ఈ నెల 15న నిష్క్రమించగా, అదేరోజు ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ సీజన్‌లో వాయుగుండాలు, తుఫాన్లు సంభవిస్తుంటాయని వాతావరణ నిపుణులొకరు వ్యాఖ్యానించారు. అక్టోబరులో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం, రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని ఈ నెల 2న భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అందుకు అనుగుణంగానే 15వ తేదీన నైరుతి రుతుపవనాలు నిష్క్రమించే రోజుకు సాధారణం కంటే 14 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైందని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. మరోవైపు.. గురువారం ఉదయం చెన్నై సమీపాన తీరం దాటిన వాయుగుండం పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో పూర్తిగా బలహీనపడింది. దీని ప్రభావంతో శుక్రవారం రాత్రికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని చెబుతున్నారు.

ఆదాయం ఘనం.. అద్దెల భారం!

» 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 37 ఆఫీసులకే సొంత భవనాలు
» 107 ఆఫీసులకు స్థలాలు ఇవ్వాల్సి ఉన్నా.. 57 కార్యాలయాలకే కేటాయింపు
» రాష్ట్రంలో అద్దె బకాయిలు 2.97 కోట్లు



హైదరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నడిబొడ్డున నాంపల్లి రెడ్‌హిల్స్‌లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదనే కారణంతో కరెంట్ కట్ చేయడం చర్చనీయాంశమైంది. వెంటనే భవనం ఖాళీ చేయాలని యజమాని హుకుం జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 144 కార్యాలయాలు ఉండగా 107 కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. 37 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకొచ్చే శాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ కీలకమైంది. నిత్యం రూ. వందల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న శాఖలో ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతూ ఉద్యోగులు పని చేస్తున్నారు. తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖకు ఘనమైన చరిత్ర ఉంది. 1864 నుంచి ఈ శాఖ పని చేస్తుంది. ఇన్ని దశాబ్దాలు గడిచినా నేటికీ సొంత భవనాలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ రూపంలో ఆదాయాన్ని ఆర్జించే శాఖలో 60 శాతం కార్యాలయాలు అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నాయి. రాష్ట్రంలో ఆరుగురు డీఐజీలు ఈ శాఖకు పని చేస్తున్నారు. అందులో నాలుగు సొంత భవనాలు ఉండగా 2 చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నారు. జిల్లా రిజిస్ట్రార్లకు సంబంధించి 12 మంది పని చేస్తుంటే అందులో 11 జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థలాల కేటాయింపులు సక్రమంగా చేపట్టలేదు. అద్దెభవనాల్లోన్న 107 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అవసరమైన భవనాలు నిర్మించేందుకు కేవలం 57 కార్యాలయాలకే స్థలాలున్నాయి. ఇంకా 50 కార్యాలయాలకు స్థలాలు చూడాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఆ శాఖ మంత్రి పొంగులేటి అధికారులతో మాట్లాడుతూ తక్షణమే సొంత భవనాలను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలకు సంబంధించి రూ. 2,96,53,776 కోట్ల అద్దె బకాయిలున్నాయి. అందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో రూ.1,00,14,809 కోట్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో రూ.48.35 లక్షలు, హైదరాబాద్ సౌత్ పరిధిలో రూ.40 లక్షలు, హైదరాబాద్ పరిధిలో రూ.9 లక్షలు, మహబూబ్‌నగర్ పరిధిలో రూ.19.37 లక్షలు, వరంగల్ రూ.10.08లక్షలు, నిజామాబాద్ రూ.46లక్షలు, ఆదిలాబాద్ రూ.4.15లక్షలు, కరీంనగర్ రూ.5.75 లక్షల బకాయిలు ఉన్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.